
అక్టోబరు విప్లవ ప్రత్యేక సంచిక

1973

49

సృజన

ఆధునిక సాహిత్య వేదిక



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

49

అక్టోబర్ విప్లవ ప్రత్యేక సంచిక

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

80 పేజీలు 1 రు.

ముఖచిత్రం :

అమర వీరుడు జగదీశ్

ప్రతులకు, వివరాలకు :

సృజన

హనుమకొండ

వరంగల్ – 506001

విడిప్రతి: ఒక రూపాయి

అర్ధసంవత్సర చందా: ఆరు రూపాయలు

సంవత్సర చందా: పది రూపాయలు

SṚJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries, Andhra Pradesh Hyderabad. Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited and Published by Varavararao for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudraṇalayam,
J. P. N. Road, Warangal–506002 (A. P.)

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

1973 అక్టోబర్ | మాసపత్రిక | 49

నెత్తురు మొగ్గ

ఎర్రెర్రని కొండల్లో
తెలంగాణ గుండెల్లో
ఎత్తినాడే ఎర్రజెండా జగదీశ్

విప్లవ రచయితల సంఘం సభలు వరంగల్ జగదీశ్ నగర్‌లో జరుపుకుంటున్నది. ఈ జగదీశ్ ఎవరు? ఎక్కడో తమిళనాడులో పుట్టి వరంగల్‌లో హోటల్ వర్కర్‌గా పనిచేసి, ములుగులో పాన్‌డబ్బా పెట్టుకొని పత్రికలమ్మి బ్రతికినవాడు. వృత్తిమాత్రమే కార్మికవృత్తి కాదు కార్మిక వర్గ చైతన్యం కూడ కలిగిన కార్యకర్త. అందుకే నక్సల్‌బరీలో '67లో సాయుధ రైతాంగ పోరాట వసంత మేఘ గర్జన వినిపించిన రోజుల్లోనే శ్రీకాకుళంలో గిరిజన రైతాంగ పోరాటం భారతదేశ చరిత్రలోనే కొత్త పోరాట రూపాన్ని తీసుకున్న తరుణంలోనే, యిక్కడ వీరతెలంగాణలో కూడా మార్క్సిస్ట్ లెనినిస్ట్ పార్టీ పోరాట ప్రచారంలో భాగస్వామి అయ్యాడు జగదీశ్. అందుకే తెలంగాణలో యింకా గెరిల్లా చర్యలుకూడ ప్రారంభం కాకపూర్వమే ములుగునుంచి పట్టుకొనివచ్చి ఒకరాత్రి హనుమకొండలో లాడ్జింగ్‌లో వుంచి అరాత్రే మానుకోట అడవులకు తీసుకెళ్ళి కాల్చివేసారు పోలీసు గుండాలు. ఈ విషయం వరంగల్ నగరంలో ప్రజలెందరికో తెలిసిన నగ్న రహస్యం.

తెలంగాణ రైతాంగ సాయుధపోరాట మార్గానికి తొలి నెత్తురు ముగ్గు వేసినవాడు జగదీశ్. శ్రామికరాజ్య సూర్యోదయం కోసం తొలివేకువ కలలు గన్న నెత్తురుమొగ్గ జగదీశ్.

జగదీశ్ వూరూరా పేద ప్రజలను పోరాటానికి ఆయత్తం చేసినవాడు. సాయుధ రైతాంగ పోరాటానికి కార్మిక వర్గం అగ్రగామి దళంగ పనిచేయాలన్న అవగాహనతో కృషిచేసినవాడు. అందుకే యీ అక్టోబర్ విప్లవ సంచికను 'గ్రామాల్లోని పేదరైతాంగంతో చేయికలిపి విప్లవ రైతాంగా పోరాటంలో మరణించిన అమరుడు కామ్రేడ్ జగదీశ్‌కు' అంకితం చేస్తున్నాం.

— సంపాదకుడు

ఓ! విలుకాడ!

రెంజిమ్

తోటారాముని తొడకు కాటా తగిలిందానీ
చిలుక చీటీ తెచ్చెరా! ఓ! విలుకాడా!
మైనా మతలబుచేసెరా! ఓ! చెలికాడా!
మైనా మతలబు చేసెరా!

వొడ్డీపూదారిలో సద్దుమణిగిందంట
సండ్రిపూదారిలో గాండ్రించి దూకిందంట
సంజ మాటునదాగీ పంజా విసిరిందంట
తోటరాముని తొడకు కాటా తగిలిందంట
కంజూ కన్నీరెట్టెరా! ఓ! విలుకాడా!
నెమలీ నాట్యము మానెరా! ఓ! చెలికాడా!
నెమలీ నాట్యము మానెరా!

జింకా, లేడీ కుమిలి కుమిలి ఏడ్చాయంట
కాడు బర్రెవచ్చి బావురన్నదంట
అడవీ గోరింతాకు వాడిలీ పోయిందంట
మోదుగూ పూలన్నీ వాడిపోయాయంట
పల్లె తల్లడిల్లి గొల్లుమన్నదంట
అడవీ హడలీ పోయెరా! ఓ! విలుకాడా!
వాగు జల జల ఏడ్చెరా! ఓ! చెలికాడా!
వాగు వల వల ఏడ్చెరా!

గొల్లోళ్లా సిన్నమ్మా పాలు తాపిందంట
కురుమోదూ, గోండోడూ గటక తెచ్చారంట
పరధామా పరమేసు పసరు పోసిండంట
మన్నెపు మామయ్యా కట్టు కట్టిండంట
తోటరాముడు కళ్లు తెరిచి నవ్విండంట
అడవి అడవీ నవ్వెరా! ఓ! విలుకాడా!
పల్లె మల్లెలూపూచెరా! ఓ! చెలికాడా!
నాకళ్ళా నీరూ నిండెరా!

నల్లపిట్టలు కల్లీపళ్ళు తెచ్చాయంట
అల్లుపిట్టలు చల్లాగాలీ విసిరాయంట
గోగురిచ్చ వచ్చీ గోము చేసిందంట
పైడికంఠి వచ్చీ పదము పాడిందంట
తోటరాముడు నవ్వి లేచి నిలిచాడంట
అడవీ అలలుగాలేచెరా! ఓ! విలుకాడా!
పల్లె విల్లంబాయెరా! ఓ! చెలీకాడా!
నా గుండె రవరవ లాడెరా!

తోటరాముడంటె మిత్రులకు ప్రాణము
తోట రాముడంటె శత్రువుపై బాణము
తోట రాముడు మందీ వారలోని ఖడ్గము
తోట రాముడు పల్లె చేతిలో బల్లెము
తోటరాముడు అడవీ గుండెల్లో గీతము
కల్లా కపటము లేదురా! ఓ! విలుకాడా!
అతనీవల్లా నేరామేమిరా! ఓ! చెలీకాడా!
అతనీవల్లా నేరామేమిరా?

గురిమెళ్ళ అడవీలో గుర్రూ పెడతందంట
మనిసీ నెత్తురు మరిగీ మత్తెక్కి వుందంట
గుండెల్లో గురిచూసీ దెబ్బ కొట్టాలంట
తోటరాముని పేరు అడవి నిలపాలంట
విల్లంబు సారించరా! ఓ! చెలికాడా!
బల్లెమ్ము చేపట్టరా! ఓ! విలుకాడా!
మన చెలిమి నిలబెట్టరా!
ఓ! విలుకాడా! నా చెలీకాడా!
మన చెలిమి నిలబెట్టరా!

[ఉరిశిక్షకు గురికాబడి మృత్యువు నెదుర్కొంటోన్న ఆదిలాబాద్ జిల్లా రైతాంగ గెరిల్లా వీరులు కామేశ్రీడ్స్ కిష్టగౌడ్, భూమయ్యలకు ఈ నా పాట వినమ్రతతో అంకితం.]

విప్లవ పరిస్థితి అంచనా– మార్క్సిస్టు - లెనినిస్టు దృక్పథం

స్టాలిన్

[నక్సల్‌బరీలో రైతాంగ విప్లవం ఆరంభమయిన దగ్గరనుండి భారతదేశంలో విప్లవానుయాయు లందరిలోనూ సీరియస్ చర్చలు జరుగుతున్నాయి. శాంతియుతంగానే సోషలిజం స్థాపింపబడుతుందని చెప్పే రివిజనిస్టులను వదలి మిగిలిన వారందరికీ యీ చర్చపై ఆసక్తి వుంది. ఎప్పటికయినాసరే సాయుధ పోరాటంద్వారా తప్ప మరో విధంగా భారతదేశానికి సోషలిజం రాజాలదని ఒకవైపు చెబుతూనే మరోవైపు తాము అవలంబిస్తున్న పార్లమెంటరీ పంథాకు దేశంలో విప్లవపరిస్థితి లేకపోవడమే కారణమంటూ నయారివిజనిస్టులు సాకు చెబుతున్నారు. అందువల్ల విప్లవపరిస్థితిని అంచనా వేయగల కొలబద్ద యేమిటి? అనే విషయం అందరిముందు చర్చనీయాంశమయింది. సాధారణ పరిస్థితుల్లో మాదిరిగా పరిపాలించగల పరిస్థితి ప్రభుత్వానికీ, మనగల స్థితి ప్రజలకూ అసాధ్యమయినప్పుడు విప్లవ పరిస్థితి యేర్పడినట్లు భావించవలసి యుంటుందని ఒక సందర్భంలో లెనిన్ చెప్పారు.

పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరిణతిచెందిన తర్వాత యేర్పడిన స్థితిగతుల నన్నిటిని ఆకళింపు చేసుకొని విప్లవాలకు సరిఅయిన వ్యూహం, ఎత్తుగడలు లెనిన్ రూపొందించాడు. అందుకే లెనినిజాన్ని "......జనరల్‌గా కార్మిక విప్లవానికి సంబంధించిన సిద్ధాంతమూ, ఎత్తుగడలూ, ప్రత్యేకించి కార్మికవర్గ నియంతృత్వానికి సంబంధించిన సిద్ధాంతమూ, ఎత్తుగడలూ"నని కామ్రేడ్ స్టాలిన్ నిర్వచించారు. "లెనినిజం యొక్క సమస్యలు" అనే గ్రంధంలో "లెనినిజం యొక్క పునాదులు" అను భాగంలో మూడవ అధ్యాయానికి శీర్షిక "సిద్ధాంతము". అందులో 3వ అంశము నేటి సామ్రాజ్యవాద యుగంలో విప్లవ పరిస్థితిని అంచనావేయడానికి విప్లవకారులకు తోడ్పడుతుందనే భావంతో ఆ విషయానికి సంబంధించిన భాగాన్ని మాత్రం అనువదించి ప్రకటిస్తున్నాం.

అనువదింపబడిన భాగం "Problems of Leninism" మాస్కో ప్రచురణ 34 వ పేజీలో 5 వ పేరాతో ఆరంభమవుతుంది. — సంపాదకుడు]

కార్మికవర్గ విప్లవానికి సంబంధించి లెనిన్ సిద్ధాంతం మూడు ప్రాథమిక ప్రతిపాదనలపై ఆధారపడివుంది.

మొదటి ప్రతిపాదన : అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో ఫైనాన్సు పెట్టుబడియొక్క ఆధిపత్యం, స్టాకులు, బాండ్ల రూపంలో ఆర్థిక లావాదేవీలు నడవడం, ముడిపదార్థాలు దొరికే ప్రాంతాలకు పెట్టుబడిని ఎగుమతిచేయడం (సామ్రాజ్యవాదం యొక్క ప్రాథమిక లక్షణాలలో ఒకటి), ఫైనాన్సు పెట్టుబడియొక్క ఆధిపత్యం ఫలితంగా ఫైనాన్సు పెట్టుబడిదారీ వర్గానికి సంక్రమించిన సర్వాధికారం— ఇదంతా కూడా గుత్తపెట్టుబడిదారీ వర్గంయొక్క పరాన్నభుక్కు స్వభావాన్ని తెలుపుతుంది. పెట్టుబడిదారీ గుత్త సంస్థలైన ట్రస్టులు, సిండికేట్లయొక్క భారం నూరు రెట్లు పెరుగుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థకే వ్యతిరేకంగా కార్మికవర్గ అసంతృప్తి తీవ్రమవుతుంది. ప్రజానీకం తమ విముక్తికి ఏకైకమార్గం కార్మికవర్గ విప్లవమేనని గుర్తిస్తుంది.

అందుచేత మొదటి నిర్ణయం : పెట్టుబడిదారీ దేశాల్లో విప్లవాత్మకమైన సంక్షోభం తీవ్రతరమౌతుంది. సామ్రాజ్యవాద దేశాలలో అంతర్గతంగా కార్మికవర్గ రంగంలో తిరుగుబాటు శక్తులు పెరుగుతాయి.

రెండవ ప్రతిపాదన : వలస దేశాలకు, సామ్రాజ్యవాదులపై ఆధారపడిన దేశాలకు పెట్టుబడిని ఎగుమతి చేయడం అధికం కావటం వలసలు, పలుకుబడి ప్రాంతాల (spheres of influence) రూపంలో సామ్రాజ్యవాదులు ప్రపంచమంతటా వ్యాపించడం, కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచ జనాభాలో అత్యధిక భాగాన్ని ఆర్థిక దాస్యానికి, వలస పీడనకూ గురిచేసే ప్రపంచ వ్యవస్థగా పెట్టుబడిదారీ విధానం పరిణామం చెందడం— ఇదంతా ఒక ప్రక్కన జాతీయ ఆర్థిక వ్యవస్థలను, భూభాగాలను ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనే గొలుసులో లింకులుగా తయారుకావడానికి దారితీసింది. మరొక ప్రక్కన ప్రపంచ జనాభాను రెండు శిబిరాలుగా చీల్చింది. ఒకటి, విశాలమైన వలసదేశాలను, తమపై ఆధారపడిన దేశాలను దోపిడి, పీడనలకు గురిచేసే కొన్ని అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలు, రెండు— సామ్రాజ్యవాద దాస్యం నుండి విముక్తికై పోరాటం కొనసాగించవలసిన పరిస్థితిలో పడిన వలసదేశాలకు, సామ్రాజ్యవాదులపై ఆధారపడిన దేశాలకు చెందిన అత్యధిక మెజారిటీ ప్రజలు. అందుచేత రెండవ నిర్ణయం ఏమంటే వలసదేశాలలో విప్లవాత్మకమైన సంక్షోభం తీవ్రమౌతుంది. వలసదేశాల రంగంలో సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులు పెరుగుతాయి.

మూడవ ప్రతిపాదన : "పలుకుబడి ప్రాంతాలు", వలసదేశాలపై గుత్తాధిపత్యం, పెట్టుబడిదారీ దేశాల అసమాన అభివృద్ధి (ఇది అదివరకే విశాలప్రాంతాలను ఆక్రమించుకొని ఉన్న దేశాలకు, కొత్తగా తమ వాటాను డిమాండ్ చేస్తున్న దేశాలకు మధ్య ప్రపంచాన్ని పునర్విభజించుకొనడానికిగాను తీవ్రమైన పోరాటానికి దారితీస్తుంది.)

ఈ అనిశ్చిత పరిస్థితికి సామ్రాజ్యవాద యుద్ధమే పరిష్కారం కావడం— ఇదంతా కూడ మూడవ రంగంలో పోరాటం అంటే సామ్రాజ్యవాదులమధ్య అంతర్గతపోరాటం తీవ్రం కావడానికి దారితీస్తుంది. ఇది సామ్రాజ్యవాదాన్ని బలహీనపరచి మొదటి రెండురంగాలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్యంకావడానికి దోహదం చేస్తుంది. ఆ విధంగా విప్లవ కార్మికవర్గ రంగం, వలస విముక్తిపోరాటం ఏకమౌతాయి.

మూడవ నిర్ణయం: సామ్రాజ్యవాద వ్యవస్థలో యుద్ధాన్ని నివారించడం సాధ్యంకాదు యూరపులోని కార్మికవర్గ విప్లవం, తూర్పుదేశాలలోని వలసవిప్లవాలు కలిసి ప్రపంచ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ విప్లవం యొక్క ఐక్యసంఘటనగా రూపొందడం అనివార్యం.

లెనిన్ ఈ నిర్ణయాలనన్నింటినీ కలిపి ఒకేఒక సాధారణ నిర్ణయానికి వచ్చారు. "సామ్రాజ్యవాదం సోషలిస్టు విప్లవానికి పూర్వరంగం."

కార్మికవర్గ విప్లవం ఎడల మన దృక్పథం, విప్లవ స్వభావం దాని పరిమితి, లోటుపాటులు, విప్లవానికి సంబంధించిన స్కీం వగైరా విషయాలన్నింటిలోనూ మార్పు వస్తుంది.

గతంలో కార్మికవర్గవిప్లవానికి కావలసిన పరిస్థితులు ఉన్నదీ, లేనిదీ నిర్ణయించ డానికి ఆ దేశంయొక్క ఆర్థిక పరిస్థితిని మాత్రమే గమనంలోకి తీసుకొనేవాళ్ళం.

ఈనాడు ఈ విషయాన్ని పరిశీలించేటప్పుడు అన్ని దేశాలయొక్క, లేదా మెజా రిటీ దేశాలయొక్క ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలి. అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గమనంలోకి తీసుకోవాలి. ఎందుచేతనంటే ఏ దేశానికాదేశం, ఆయా దేశాల లోని ఆర్థిక వ్యవస్థలు స్వయంపోషకంగాలేవు; ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనే గొలు సులో లింకులుగా తయారయ్యాయి. "సంస్కారవంతమైన" పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరిణామం చెందింది. సామ్రాజ్యవాదమంటే కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు ప్రపంచంలోని అత్యధిక మెజారిటీ జనాభాను ఆర్థిక బానిసత్వానికి, వలసపీడనకు గురిచేయడమే.

కార్మికవర్గ విప్లవానికి అవసరమైన భౌతికపరిస్థితులు ఒకదేశంలో ఉన్నాయా, లేవా అని ఆలోచించడం గతంలో రివాజుగా ఉండేది. అదికూడా అభివృద్ధి చెందిన దేశాలను గురించి మాత్రమే ఆలోచించే వాళ్ళం. ఈ దృక్పథానికి కాలం చెల్లిపో యింది. ఈనాడు మనం ప్రపంచ ఆర్థిక వ్యవస్థనంతటినీ విడదీయరాని మొత్తంగా భావించి ఈ మొత్తం వ్యవస్థలో విప్లవానికి అవసరమైన భౌతిక పరిస్థితులు ఉన్నాయా,

లేవా అని ఆలోచించాలి. ఈ వ్యవస్థ మొత్తంగా విప్లవానికి పరిపక్వమై ఉన్నట్లయితే ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ఈ వ్యవస్థ మొత్తంగా విప్లవానికి పరిపక్వమై ఉన్నది కాబట్టి ఈ వ్యవస్థలో కొన్ని పారిశ్రామికంగా తగినంతగా అభివృద్ధిచెందని దేశాలుండడం విప్లవానికి అధిగమించరాని అడ్డంకి ఏమీ కాదు.

ఒక అభివృద్ధిచెందిన దేశంలోని కార్మికవర్గ విప్లవం ఆ దేశంలోని పెట్టుబడిదారీ వర్గాన్ని మాత్రమే వ్యతిరేకించవలసి ఉంటుందని గతంలో భావించబడేది. ఈ దృక్పథం ఇంకెంతమాత్రమూ సరియైనదికాదు. ఈనాడు మనం ప్రపంచ కార్మికవర్గ విప్లవాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. పెట్టుబడిదారీ వర్గంయొక్క జాతీయ సంఘటనలన్నీ ప్రపంచ సామ్రాజ్యవాద సంఘటన అనే గొలుసులో లింకులుగా తయారయ్యాయి. దీనిని అన్ని దేశాలలోని విప్లవోద్యమాల సంఘటన ప్రతిఘటించవలసి ఉంటుంది.

గతంలో, ఒక దేశంలోని కార్మికవర్గ విప్లవం ఆదేశంలోని అంతర్గత పరిణామాలయొక్క ఫలితమేనని అనుకోవడం జరిగింది. ఈ దృక్పథం ఇంకెంతమాత్రం సరైనదికాదు. ఈనాడు కార్మికవర్గ విప్లవం ప్రధానంగా ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థలోని వైరుధ్యాలగతిని బట్టి ఉంటుంది. ప్రపంచ సామ్రాజ్యవాద సంఘటన అనే గొలుసు ఏదో ఒక దేశంలో తెగిపోవటం ఫలితంగానే కార్మికవర్గ విప్లవంజరుగుతుంది.

విప్లవం ఎక్కడ ప్రారంభమౌతుంది ? ఎక్కడ, ఏ దేశంలో పెట్టుబడిదారీ సంఘటన బ్రద్దలవుతుంది ?

పరిశ్రమలు బాగా అభివృద్ధి అయినచోట, కార్మికవర్గం మెజారిటీగా ఉన్నచోట, సంస్కృతి బాగా అభివృద్ధి అయినచోట, ప్రజాస్వామ్యం బాగా అభివృద్ధి అయినచోట– గతంలో సర్వసాధారణంగా ఈ సమాధానం చెప్పబడేది.

లెనినిస్టు విప్లవ సిద్ధాంతం దీనికి అభ్యంతరం చెబుతుంది. విప్లవం తప్పనిసరిగా పరిశ్రమలు బాగా అభివృద్ధి అయినచోట మాత్రమే రావలసిన అవసరం లేదు. సామ్రాజ్యవాదమనే గొలుసు ఎక్కడ బలహీనంగా ఉంటుందో అక్కడ పెట్టుబడిదారీ సంఘటనకు గండి పడుతుంది. ప్రపంచ సామ్రాజ్యవాద సంఘటన అనే గొలుసు తన బలహీనమైన లింకు దగ్గర తెగిపోవడం ఫలితంగానే కార్మికవర్గ విప్లవం జరుగుతుంది. విప్లవం మొదట ప్రారంభించిన దేశం, పెట్టుబడిదారీ సంఘటనకు గండికొట్టిన దేశం ఇంకా పెట్టుబడిదారీ విధాన పరిధిలోనే ఉన్న దేశాలకంటె పెట్టుబడిదారీ విధానందృష్ట్యా తక్కువ అభివృద్ధి చెందిన దేశంకూడ కావచ్చును,

1917లో ప్రపంచ సామ్రాజ్యవాద గొలుసు తక్కిన దేశాలలోకంటె రష్యాలో బలహీనంగాఉంది. ఈ గొలుసు అక్కడ తెగి కార్మికవర్గ విప్లవం జయప్రదం కావడానికి అవకాశం లభించింది. ఎందుచేత? రష్యాలో అప్పుడు గొప్ప ప్రజా విప్లవం చెలరేగుతున్నది. దానికి విప్లవ కార్మికవర్గం నాయకత్వం వహించింది. భూస్వాముల దోపిడికి, పీడనకు గురైన, విస్తృత రైతాంగంతో అది చేయికలిపింది. పైగా విప్లవం సామ్రాజ్యవాదంయొక్క భయంకరమైన ప్రతినిధియైన జారిజాన్ని ఎదుర్కొనవలసి వచ్చింది. జారిజానికి ఏమాత్రం నైతికబలం లేదు. ప్రజానీకమంతా దానిని అసహ్యించుకున్నారు. ఫ్రాన్సు, జర్మనీలకంటె, బ్రిటన్, అమెరికాలకంటె పెట్టుబడిదారీ విధానందృష్ట్యా రష్యా తక్కువ అభివృద్ధి చెందిన దైనప్పటికీ సామ్రాజ్య వాద గొలుసు అక్కడే అత్యంత బలహీనంగా ఉంది.

సమీప భవిష్యత్తులో ఈ గొలుసు ఎక్కడ తెగుతుంది? మళ్ళీ అది అత్యంత బలహీనంగా ఎక్కడ ఉంటుందో అక్కడే. భారతదేశంలో తెగిపోయినా ఆశ్చర్యం లేదు. ఎందుచేత? అక్కడ మంచి మిలిటెంటు యువకార్మికవర్గం ఉన్నది. దానికి జాతీయ విముక్తి ఉద్యమం మిత్రుడుగా ఉన్నది. అది నిస్సందేహంగా ఎంతో శక్తి వంతమైన, ముఖ్యమైన మిత్రుడు. అక్కడ విప్లవం విదేశీ సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొనవలసి ఉన్నది. ఈ సామ్రాజ్యవాదానికి ఏమాత్రం నైతికబలం లేదు. దోపిడి, పీడనలకు గురిచేయబడిన విస్తృతమైన భారత ప్రజానీకం దానిని అసహ్యించు కుంటున్నారు.

ఈ సామ్రాజ్యవాదగొలుసు జర్మనీలోకూడ తెగిపోయే అవకాశంఉంది. భారత దేశంలో కొనసాగుతున్న పరిస్థితులే జర్మనీలోకూడ వస్తున్నాయి. ఐతే అభివృద్ధి స్థాయిలో జర్మనీ, భారతదేశాలమధ్య ఎంతో తేడాఉంది. జర్మనీలోని విప్లవ పురోగ మనంపైన, దాని ఫలితంపైన దీని ప్రభావం తప్పకుండా ఉంటుంది.

అందుచేతనే లెనిన్ ఇలా అన్నాడు:

"పశ్చిమ యూరపులోని పెట్టుబడిదారీదేశాలు సోషలిజంలోకి ఏవిధంగా అభివృద్ధి చెందుతాయి? ఆ దేశాలలోని పెట్టుబడిదారీ విధానం నిరాటంకంగా సోషలిజంలోనికి పరివర్తన చెందదు. ఒక దేశాన్నొక దేశం దోచుకుంటాయి. సామ్రాజ్యవాద యుద్ధంలో మొదట ఓడిపోయినదేశాలను, ప్రాచ్యదేశాలను దోచుకోవడం జరుగుతుంది. పైగా మొదటి సామ్రాజ్యవాద యుద్ధం ఫలితంగా ప్రాచ్యదేశాలు విప్లవోద్యమంలో ప్రవేశించాయి; ప్రపంచ విప్లవోద్యమం అనే సుడిగుండంలోనికి అవి లాగబడ్డాయి."

క్లుప్తంలో చెప్పాలంటే, సామ్రాజ్యవాద సంఘటన అనే గొలుసు బలహీనమైన లింకుల దగ్గరమాత్రమే తెగుతుంది. పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి అయినచోటనో, లేదా జనాభాలో ఇంతమంది కార్మికులు, ఇంతమంది రైతులు ఉండాలనే నిష్పత్తిపై ఆధారపడో మాత్రం కాదు.

అందుచేత కార్మికవర్గ విప్లవసమస్యను గురించి ఒక నిర్ణయానికి వచ్చేటప్పుడు ఒక దేశంలోని కార్మికవర్గం జనాభాలో ఎంతశాతమున్నదనే గణాంక సమాచారానికి అంతప్రాముఖ్యత ఉండదు. రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన పిడివాదులు (doctrinaires) ఈ విషయానికి ఎంతో ప్రాముఖ్యతనిచ్చారు. వారు సామ్రాజ్యవాదాన్ని అర్థం చేసుకోలేకపోయారు. విప్లవమంటేనే గడగడలాడిపోయారు.

అక్టోబరు మహావిప్లవం – బోల్షివిక్ పార్టీ విజయం – స్టాలిన్

1925లో స్టాలిన్ "రోడ్ టు అక్టోబర్" అనే పుస్తకానికి రాసిన పీఠికలో అక్టోబర్ మహావిప్లవం నుంచి నేర్చుకోవలసిన పాఠాల గురించి మాత్రమేగాక ట్రాట్స్కీస్టులను అప్రతిభుల్ని చేసే సిద్ధాంత చర్చకూడ చేసాడు.

ఈ పుస్తకంలో స్టాలిన్ అక్టోబర్ మహావిప్లవ పాఠాలుగా చెప్పినవివి.

1. కార్మికవర్గానికి, కష్టించే రైతాంగానికి మధ్య పొత్తు ప్రాతిపదికగా కార్మికవర్గం నాయకత్వంకింద శ్రామికవర్గ నియంతృత్వం (dictatorship of the proletariat) స్థాపించబడ్డది. అందువల్ల శ్రామికవర్గ నియంతృత్వం అంటే కార్మికవర్గానికి – కష్టించే రైతాంగానికి మధ్య, కార్మికవర్గ నాయకత్వం కింద ఏర్పడే వర్గపొత్తు అని అర్థం.
2. ఇతర దేశాల్లో పెట్టుబడిదారీ విధానం కాపాడబడి వుండగాకూడ ఒక్కదేశంలోనే కార్మికవర్గ విజయంవల్ల అక్టోబర్ విప్లవం ద్వారా శ్రామికవర్గ నియంతృత్వం స్థాపించబడ్డది.
3. ఒకేపార్టీ, బోల్షివిక్‌పార్టీ ఐక్యనాయకత్వం కింద విప్లవం నిర్వహించబడ్డది.
4. రాజీధోరణి వహించే పార్టీలన్నింటినీ ఏకాకులనుచేసి విప్లవానికి నాయకత్వం వహించడంలో బోల్షివిక్ పార్టీ విజయవంతమైంది.
5. విప్లవానికి నాయకత్వంవహించడంలో, పార్టీ తన నినాదాలను ప్రజల స్వంత నినాదాలుగా రూపొందించగలిగింది. ప్రజలు తమ స్వంత అనుభవంవల్ల యీ నినాదాలు సరియైనవని గ్రహించారు.
6. అక్టోబర్ మహావిప్లవం పెట్టుబడిదారీ విధానం చూపిన మొదటి పగులు. కాబట్టి ప్రపంచ విప్లవంలో మొదటిదశ.

విద్యావేదిక:

విద్యావిప్లవంలో పీకింగ్ యూనివర్సిటీ ముందడుగు

ప్రజా సాంస్కృతిక మహావిప్లవంలో రాటుదేలిన పీకింగ్ యూనివర్సిటీ విద్యా విప్లవంలో ముందడుగు వేస్తూంది. ఉన్నతవిద్యకు ఒక కొత్తతరహా సామ్యవాద సంస్థగా రూపొందుతూంది.

చైనీస్, చరిత్ర, తత్వశాస్త్రము, విదేశభాషలు, పదార్థవిజ్ఞానశాస్త్రము, రసాయనశాస్త్రము తదితర పదకొండురంగాల్లో ప్రస్తుతము పనిచేస్తున్న 2,000 మంది అధ్యాపకులు 60 శాఖలకుపైగా బోధనావిషయాలు చెప్తున్నారు.

చైనాలో ఆఖరి పాలకవంశాన్ని కూలదోసిన 1911 విప్లవం తరువాత, చింగ్ వంశం ఏలుబడికాలంలో(1898లో)స్థాపించబడిన ఈ సంస్థకు 'పీకింగ్ విశ్వవిద్యాలయం' గా మళ్లీ పేరుపెట్టడం జరిగింది.

ఇంతకుపూర్వం ఇది పాతచైనాలోని విప్లవ ప్రతీఘాతపాలకుల అభిరుచులకు లోబడి వారి కనుసన్నల్లో మెలిగేది. విమోచనంతరువాత ప్రజలచేజిక్కి, విద్యావిధానంలో ప్రాథమిక మార్పులను పొందింది.

విప్లవప్రతీఘాతకుడు, ముసుగులో ద్రోహిఅయిన లియూషావోచీ, అతడి ఏజంట్లు విద్యారంగంలోకి రివిజనిస్టుపద్ధతులను బలవంతంగా చొప్పించి పాత బూర్జువా విద్యావిధానాన్నే కాపాడాలని నానాగడ్డికరిచారు. ఇది చైర్మన్ మావోచెప్పిన "విద్య ఉత్పాదక శ్రమతో ప్రజారాజకీయాలకు లోబడి ఉపయోగకారిగా ఉండాలి" అనే ప్రజా విధానాన్ని అమలులోపెట్టడానికి అడ్డంకిగా నిలిచింది. అయితే సాంస్కృతిక విప్లవ కాలంలో విప్లవచేవగల యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు ఈ రివిజనిస్టు విధానాలకు ఎదురుతిరిగారు. శ్రామికులు, ప్రజావిమోచన సైనికులతో ఏర్పాటైన మావో-సే-టుంగ్ ఆలోచనా ప్రచారకదళం 1968 లో యూనివర్సిటీలో ప్రవేశించి బూజుపట్టిన పాతవిద్యావిధానాన్నివిమర్శించడంలో అధ్యాపకులకు విద్యార్థులకు నేతృత్వంవహించింది.

1971లో నూతన కమ్యూనిస్టుపార్టీ కమిటీ ఏర్పాటైంది. ఇది చైర్మన్ మావో చెప్పిన ప్రజా విద్యావిధానాన్ని అమలుపరచడంలో అధ్యాపకులకూ, విద్యార్థులకు దారి చూపుతూంది.

అధ్యాపకుల కొత్తదృష్టి కోణం (ధోరణి)

"విద్యావిధానం మార్పుసమస్యలో అధ్యాపకులే ప్రధాన సమస్య" అన్నాడు చైర్మన్ మావో. ప్రజావిద్యావిధానాన్ని బాగా అమలుపరచి ప్రజారాజకీయాలకు సేవచేయటానికి అధ్యాపకులను తిరిగి తీర్చిదిద్దటమనేదే ముఖ్యవిషయం.

యూనివర్సిటీ పార్టీ కమిటీ మేధావుల విషయంలో పార్టీవిధానాన్ని ఉద్దేశపూర్వకంగానే అనుసరించింది. ఏకంచేయడం, తెలియజెప్పడం, తీర్చిదిద్దడం అనే సూత్రాలకు కట్టుబడివుంది. పార్టీకమిటీ మార్క్సు, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్ మరియు చైర్మన్ మావో రచనల అధ్యయనంలో వారికి సహకరిస్తుంది. ప్రధానంగా ఎదుర్కొనే సమస్య ప్రజారాజకీయాలు, కర్షక కార్మికులు, నిర్మాణాత్మక శ్రమనుండి వేర్పాటుచేయడం కావడంవలన ఇది వీరు శ్రామికులు, కర్షకులు, సైనికులవద్ద తిరిగి శిక్షణపొందడానికి వీలుగా ఫ్యాక్టరీలకు గ్రామసీమలకు, సైనికస్థావరాలకువెళ్ళే ఏర్పాటుకూడా చేస్తుంది. విద్యావిధానంలో విప్లవం తీసుకురావడానికి వీరిని ప్రోత్సహిస్తుంది. దీనివల్ల అధ్యాపకుల ప్రపంచదృక్పథం, విద్యావిషయక ఆలోచనావిధానాల్లో పెద్దమార్పు వచ్చింది.

ముప్పైసంవత్సరాల అనుభవంగల గణితశాస్త్రాచార్యుడు లెంగ్ షెంగ్-మింగ్ అనేమాటలివి: "నా పాఠాలు (ఉపన్యాసాలు) అర్థం చేసుకోవడానికి బహుకష్టంగా ఉండేవి. యూనివర్సిటీకంతటికీ తెలుసినవిషయం. దీన్ని నేను అర్థంచేసుకున్న తీరు వేరు; 'ఇది నా విస్తృతమైన గహనమైన జ్ఞానానికి నిదర్శనం.' పేరుప్రఖ్యాతులు గడించటానికీ ధనార్జనకూ యిదే నా మూలధనం అనుకునేవాణ్ణి. చాలకాలానికి పూర్వమే చైర్మన్ మావో కొత్తదృష్టికోణాన్నేర్పరచుకోమని చెప్పినప్పటికీ అది నాకు ఎంతకూ బుర్రకెక్కలేదు. కాని సాంస్కృతిక విప్లవం నా పూర్వపు ప్రపంచ దృక్పథాన్ని మార్చుకోవాలనే భావం; నా జ్ఞానాన్నంతనీ శ్రామికులకు, నా సామ్యవాద మాతృభూమి ప్రజావిప్లవానికీగాను తరువాతి తరాలకు శిక్షణ నివ్వడానికి అంకితం చేయాలనే సంకల్పం కలిగించింది." శ్రామిక కర్షకవర్గాలనుండి వచ్చిన విద్యార్థులకు ఉచ్చగణితపాఠాలను బోధించేటప్పుడు అపార జీవితానుభవంఉన్నా వారివారి అవగాహనాశక్తుల్లో మార్పు ఉన్నట్లు గమనించాడు. తన పాఠాలను బాగా అర్థంఅయ్యేట్లు చేయడానికిగాను వారివారి అభిరుచులను అర్థం చేసుకున్నాడు. సూత్రాన్ని ఆచరణతో సంధించి, నిరూపమైన తార్కికయోచనతో విజ్ఞానశాస్త్రాన్ని అర్థంచేసుకోవడానికి దోహదంచేశాడు. వారీవిధంగా క్రమక్రమంగా అభివృద్ధి సాధించడమేకాకుండా ఇప్పుడాయన పాఠాలను మెచ్చుకుంటారు.

ఈ అధ్యాపకవర్గంలోని చాలమంది ఆచార్యులు బోధనలోను వైజ్ఞానిక పరిశోధనలోను బహుప్రముఖులు ప్రఖ్యాతులు. వీరిలో యూనివర్సిటీ విప్లవకమిటీ ఉపాధ్యక్షులు చౌపెయి-యువాన్, చైనీస్ భాషా సాహిత్యాచార్యుడు వెయి చీన్-కుంగ్ తత్త్వశాస్త్ర విభాగపు ఫెంగ్ యు-లాన్, జీవశాస్త్ర విభాగపు లిజు-చి, ఆర్థికశాస్త్రవిభాగపు చెన్ తై-సున్ ఉన్నారు. వీరందరూ 70 ఏండ్లకు పైబడ్డవారే. అయినా వారు ఎంతో ఉత్సాహంగా వారి సైద్ధాంతిక పునర్నిర్మాణవిషయంలో జాగ్రత్తవహిస్తూ విద్యా విప్లవరంగంలో తమపాత్ర బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నారు.

బోధనా, వైజ్ఞానిక పరిశోధనారంగాలకు యువకులు మధ్యవయస్కులైన అధ్యాపకులు వెన్నెముకగా ఉన్నారు. పె యుంగ్-పు అనే భూగర్భ-భూగోళశాస్త్రాలకు చెందిన యువఅధ్యాపకురాలొకామె కేవలం రిఫరెన్సు పుస్తకాలు మాత్ర మేచూసి పాఠాలు తయారుచేసుకొనే పాత పద్ధతిని పూర్తిగా విడనాడింది. "వివిధ పొరల్లోగల ఖనిజ నిధులు" (Mineral Deposits in Various Strata) అనే పాఠానికి అవసరమైన సమాచారం సేకరించడానికి గనిప్రాంతాలకేవెళ్ళింది. మరొకసారి ముడిపదార్థాల నమూనాలు, పొరల నిర్మాణాన్ని గురించిన సమాచారము సేకరించడానికిగాను ఒక గనిలో 1300 మీటర్ల ఎత్తు ఎక్కింది. విద్యార్థులీవిధంగా చెప్పిన పాఠాలనెంతో ఉత్సాహంగా నేర్చుకున్నారు.

శ్రామికులు రైతులు సైనికులనుండి కొత్త విద్యార్థులు

ఆగస్టు 1970 నుండి యూనివర్సిటీ శ్రామికులు, రైతులు, సైనికులనుండి 4,000 మంది విద్యార్థులకుపైగా చేర్చుకుంది. ఇదివరకెప్పుడూ ఎరగని విషయమిది.

సగటున 20 ఏండ్ల వయసుగల యీ విద్యార్థులు సామాన్య విద్యా (General Education) కాలముకాక కనీసం రెండుసంవత్సరాల పని అనుభవమున్నవారు; యెనిమిది సంవత్సరాల అనుభవం వున్నవారుకూడా కొందరున్నారు. ఎక్కువమంది ఉచ్ఛస్థాయి శ్రామికులే. వీరు తమ పనిస్థలాల్లోనే దరఖాస్తు పెట్టుకుంటారు. దాన్ని తోడి శ్రామికులు యూనిట్ నాయకత్వానికి ఆమోదానికై సిఫారసుచేస్తారు, అంతిమ నిర్ణయం మాత్రం యూనివర్సిటీదే.

ఈ విధంగా ఎన్నికైన యువకులు విప్లవంనిమిత్తం అధ్యయనంచేస్తారు. వీరు రివిజనిస్టు పంథాను తిప్పికొట్టటంలో చాల చురుకుగా పాల్గొంటూ, విద్యావిధానం, బోధనావిషయమూ పద్ధతులగురించి చాల ప్రయోజనకరమైన సూచనలిస్తూ ఉంటారు. చదువులోను తదితర కార్యక్రమాల్లోను చాల ఆదర్శప్రాయమైనపాత్ర నిర్వహించిన,

టాచింగ్ నూనెగనులకుచెందిన వాంగ్ లి-మెయి అనే ఒక శ్రామికురాలు యూనివర్సిటీ పరిపాలనను పర్యవేక్షించే యూనివర్సిటీ పార్టీ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైంది.

యూనివర్సిటీలో ప్రవేశించగానే ఒకపక్క పట్టుదలతో చదువుకుంటూనే శ్రామిక-రైతు-సైనిక-విద్యార్థులు ప్రజారాజకీయాలను అగ్రగామిగాఉంచి తమ ప్రపంచదృక్పథ పునర్నిర్మాణాన్ని త్వరితం చేస్తారు.

హు యి-లింగ్ అనే ప్రాచ్యభాషాశాఖ విద్యార్థినికి మొదట్లో అధ్యయనం కొంత కష్టమనిపించింది. కాని చెయిర్మన్ మావో విప్లవాత్మక వైదేశిక విధానంవల్ల ప్రపంచ మంతటా మిత్రులసంఖ్య దినదినానికి పెరుగుతున్న విషయం ఆమెకు తెలుసు. అందుకే ఇతర దేశాలతో మైత్రీ సంబంధాలను మరింత పటిష్ఠం చేసుకోవాలనే నిశ్చయంతో ఆమె పట్టుదల వహించి విజయాన్ని సాధించగలిగింది.

శ్రామిక-రైతు-సైనిక విద్యార్థులకు వసతి భోజనం వైద్య సదుపాయాలకయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుంది. ఐదు సంవత్సరాలు అంతకుపైగా పనిచేసినవారికి పూర్వంవలెనే పూర్తి జీతాలు వస్తాయి.

బోధనలో కొత్తపుంత

సాంస్కృతిక విప్లవ కాలంలో యూనివర్సిటీలో విద్యాకాలం, విద్యాప్రణాళిక, విద్యావిషయం, బోధనా పద్ధతుల్లో చాలా మార్పులు వచ్చాయి. కాలేజీ విద్యకు విద్యార్థి వెచ్చించవలసిన కాలాన్ని తాత్కాలికంగా 3 నుండి 4 సంవత్సరాలుగా నిర్ణయించబడింది. పట్టభద్రులైన తరువాత కూడా కొందరు విద్యార్థులు దేశ వైజ్ఞానిక ప్రగతి దృష్ట్యా పరిశోధనా రంగంలో కొనసాగుతారు.

ప్రకృతిశాస్త్ర శాఖల్లో బోధన, వైజ్ఞానిక పరిశోధన, ఉత్పత్తి కలిసి ఉంటాయి. విద్యార్థులు విద్యా సంవత్సరంలో పావుభాగం తమ ప్రత్యేక శాఖలకుచెందిన ఫ్యాక్టరీల్లో ఉత్పత్తికై శ్రమచేస్తారు. రసాయనశాస్త్రశాఖ High Polymer విద్యార్థులు సిద్ధాంతజ్ఞానం వచ్చిన తరువాత ప్రయోగశాలలో పనిచేస్తారు. తరువాత ప్లాస్టిక్ దారాలు, రసాయనవస్త్రాల కర్మాగారాలు రబ్బరు కర్మాగారాలు చూడటానికి, అధ్యయనం చేయడానికి మరియు పనిచేయడానికి కొద్దికాలంపాటువెళ్తారు. ఈవిధంగా వారు సంపాదించిన వివిధ రంగాల High Polymer Chemistry సిద్ధాంతజ్ఞాన అన్వయము అవగాహన చేసుకొని సమగ్రమైన విజ్ఞానాన్ని సంపాదిస్తారు.

కళలశాఖలకు చెందిన విద్యార్థులు మార్క్సిజం-లెనినిజం మరియు తమ ప్రత్యేక కోర్సుల అధ్యయనంతోపాటు, సంవత్సరానికి దాదాపు రెండునెలలు శ్రామికులు-రైతుల

మధ్య నివసించడానికీ, వర్తమాన వర్గపోరాటంలోనూ, ఉత్పత్తిశ్రమలోనూ పాల్గొన డానికీ,పల్లెసీమలకూ ఫ్యాక్టరీలకూ పోతారు. ఈ విషయం "కళాశాఖలన్నీ మొత్తం సమాజాన్ని తమ ఫ్యాక్టరీగా భావించాలి" అనే చైర్మన్ మావో ఆదేశానికి అనుగుణంగా ఉంది.

బోధనా విధానంలో బట్టీపట్టే పద్ధతిస్థానే విశదీకరణ విధానం (Enlightening Method) ప్రవేశపెట్టబడింది. విద్యార్థులు ఇదివరకుమాదిరిగా యాంత్రికంగా నోట్సు రాసుకోరు. ముందుగానే నోట్సు పంచుతారు. విద్యార్థులు అవి చదివి అందులోని చిక్కుసమస్యలు అధ్యాపకులనడిగి లేదా సామూహిక చర్చలుచేసి అర్థంచేసుకుంటారు. ఈవిధంగా చదివిన తరువాత బోధనాపద్ధతులను మెరుగుపరిచేవిధానాలగురించి విద్యార్థులు బాగా అధ్యయనంచేసే విషయమై అధ్యాపకులు తమ తమ సలహాలు సూచనలుఇస్తారు. ఇట్లా విద్యార్థుల అధ్యాపకులమధ్య ప్రజాస్వామిక వాతావరణం నెలకొంటుంది.

పరీక్షాపద్ధతులు విద్యార్థులు తాము నేర్చుకున్నదానిని సమీక్షించుకోవడానికీ, బోధనాపద్ధతులు ప్రయోజకతను పరీక్షించడానికీ సహాయపడతాయి. పూర్వవిధానం విద్యార్థిని చిక్కుసమస్యలు అయోమయ ప్రశ్నలతో తికమకపెట్టడానికి కొంతవరకు వారి జ్ఞానాన్ని పరీక్షించడానికి అధ్యాపకునికి ఒక అవకాశమాత్రంగా పనికివచ్చేది.

గత కొద్దిసంవత్సరాల్లో యూనివర్సిటీ అధ్యాపకులకూ విద్యార్థులకు పెట్టుపుస్తకాలను సరిదిద్దటానికీ పరిష్కరించటానికి, సామ్యవాదప్రగతికి అవసరాలకు అనుగుణమైన విషయాన్ని చేర్చడానికీ అవకాశం కల్పించింది. గడచిన రెండేండ్లకాలంలో వివిధశాఖల్లో వారు కొన్ని వందల ప్రయోగాత్మక పాఠ్యప్రణాళికలను సిద్ధం చేశారు. చెయిర్మన్ మావో చెప్పిన విద్యలో ప్రజాపంథా, విద్యా విప్లవం, ఈ విద్యాసంస్థను కొత్త సామ్యవాద విశ్వవిద్యాలయంగా రూపొందించడం మొదలైన కార్యక్రమాల ఆచరణలో యింకా ఎంతో చేయవలసి ఉందని పీకింగ్ యూనివర్సిటీ పార్టీకమిటీ ఉద్దేశం. విద్యావిధానాన్ని, బోధనాపద్ధతులను విషయాన్నీ మెరుగుపరచడానికి అనుభవాన్నంతటినీ క్రోడీకరించడానికి ఆచరణద్వారా దీన్ని మరింత ఉన్నతస్థాయికి చేర్చడానికి ప్రయత్నం జరుగుతున్నది.

పీకింగ్ యూనివర్సిటీ కళల విద్యార్థులు సమాజాన్నంతటినీ ఫ్యాక్టరీగా భావిస్తున్నారు.

ప్రజాసాంస్కృతిక మహా విప్లవకాలంలో కళావిభాగాలను చెయిర్మన్ మావో చెప్పిన విద్యలో ప్రజాపంథాకు అనుగుణంగా మలచడానికి చేసిన ప్రయత్నంద్వారా పీకింగ్ యూనివర్సిటీకిచెందిన విప్లవకారులైన అధ్యాపకులు, కళావిద్యార్థులు కొంత అనుభవాన్ని గడించారు.

"కళలశాఖలన్నీ సమాజాన్నంతటినీ తమ ఫ్యాక్టరీగా పరిగణించాలి" అని చెయిర్మన్ మావో ఒకసారి అన్నాడు. సైన్సు మరియు ఇంజనీరింగ్ అధ్యాపకులు విద్యార్థులు (తమ విద్యాకాలంలో) కొంతకాలం ఫ్యాక్టరీలలో పనిచేస్తారు. అట్లాగే కళావిద్యార్థులు వర్గపోరాటం, ఫ్యాక్టరీల్లో ఉత్పాదకశ్రమ, సామాజిక పరిశోధనలు, గ్రామసీమలు, ప్రజావిమోచన సైనికదళాలు మరియు దుకాణాల్లో కొంతకాలం గడుపుతారు. వీరు తరగతి చదువును సామ్యవాద విప్లవం మరియు నిర్మాణంతో అనుసంధిస్తారు.

పీకింగ్ యూనివర్సిటీలో చైనీస్‌భాషా సాహిత్యాలు, చరిత్ర, తత్త్వశాస్త్రము, రాజకీయ అర్థశాస్త్రాలతో కలుపుకొని ఏడు కళాశాఖలున్నాయి. ప్రజా సాంస్కృతిక మహా విప్లవానికిపూర్వం లియూషావో-చీ అతడి ఏజంట్లు విద్యారంగంలోనికి చేర్మెన్ మావో విప్లవపంథాకు వ్యతిరేకంగా రివిజనిస్టుపంథాను నెట్టారు. "విద్య ఉత్పాదక శ్రమతో సంధింపబడి ప్రజారాజకీయాలకులోబడి ఉపయోగకారిగా ఉండాలి"అని చేర్మెన్ మావో అన్నాడు. వారు క్రిందివర్గాన్ని దోచుకొనే పాతవిద్యావిధానాన్ని నిలుపడానికి, యూనివర్సిటీని సమాజాన్నుండి పూర్తిగా వేరుచేయడానికి అన్నివిధాలా ప్రయత్నించారు. అంతేకాదు, అధ్యాపకులకు విద్యార్థులకు ప్రజా రాజకీయాలు, శ్రామికులు రైతులు మరియు ఉత్పాదకశ్రమలతో ఎలాంటిసంబంధం ఉండకుండా తెగదెంపులుచేసే ప్రయత్నం చేశారు.

సాంస్కృతికవిప్లవకాలంలో విప్లవకారులైన అధ్యాపకులు విద్యార్థులు రివిజనిస్టు విద్యాపంథాను తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు చేయిర్మన్ మావో సమర్థవంతమైన బోధనల నేతృత్వంలో చిత్తశుద్ధితో కళావిద్యల్లో విప్లవాన్ని ఆచరణలోపెడుతున్నారు.

ఇప్పుడు అధ్యయనం తరగతిలోపలా బయటా చాల క్రమరీతిలో పరస్పర దోహదకరిగా నడుస్తున్నది. తరగతుల్లో అధ్యాపకులు విద్యార్థులు మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతము, చరిత్ర, సాహిత్యము తదితరకోర్సులపైన కేంద్రీకరిస్తారు. సంవత్సరానికి దాదాపు 3 నెలలు (శ్రామికులు మరియు రైతుల గురుత్వాన్ని స్వీకరించి) ఫ్యాక్టరీల్లోను గ్రామసీమల్లోను గడుపుతారు. దీంట్లో మహత్తర వర్గపోరాటవాస్తవం ఉత్పత్తికై జరిపే పోరాటము బోధనావస్తువులు. వీరు సిద్ధాంతజ్ఞానాన్ని వాస్తవ పోరాటాల్తో సమన్వయించడంతో కేవలం పుస్తకాల్లోమునిగి మురగడం మానుతారు. దీనివల్ల విద్యార్థుల్లో మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతజ్ఞానాన్ని సమస్యలను విశ్లేషించడానికీ, పరిష్కరించడానికీ అన్వయించగల శక్తిసామర్థ్యాలస్థాయి పెరిగింది.

పాతపీకింగ్ యూనివర్సిటీ తత్త్వశాస్త్ర విద్యార్థులు తత్త్వవిషయాలు కేవలం పుస్తకాల్లో ఉన్నవి ఉన్నట్లుగానే అర్థంచేసుకున్నారు తప్ప రాజకీయాదర్శరంగాల్లో వర్గ

పోరాటాన్ని తెలుసుకోలేకపోయారు. సాంస్కృతిక విప్లవానికి పూర్వం అధ్యాపకులు విద్యార్థులు ప్రధానపోరాటాల్లో యెప్పుడూ తాత్త్వికస్థాయిలో పాల్గొనలేదు. కాని ఇప్పుడు వారు అధ్యయనాన్ని వర్గపోరాటంలో పాల్గొనడంతో జోడిస్తున్నారు; ఈరెండు విరుద్ధపంథాలమధ్య జరిగే పోరాటంలో పాల్గొంటున్నారు. విద్యార్థులు "Ludwig Feuerbach and the End of Classical German Philosophy", "Anti-Duhring", "Materialism and Empirio Criticism", "On Practice", "Where Do Correct Ideas come From?" లాంటి మార్క్సిస్టు–లెనినిస్టు రచనలను క్రమమైన పద్ధతిలో చదువుతున్నారు. దీంతోపాటు లియూషావో-చీ అతడి తొత్తులు చైనాలో ధనస్వామ్యాన్ని పునఃప్రతిష్ఠ చేయడానికి ప్రచారంచేసే సాధారణ ప్రతిపాదనల ఆధారంగా ప్రత్యేక విషయ నిరూపణంచేసేపద్ధతి (Idealist Apriorism) ని విమర్శిస్తున్నారు. అధ్యాపకులు మార్క్సిస్టు-లెనినిస్టు తాత్త్వికవిషయాలపై కేవలం ఉపన్యాసాలివ్వడమేకాక వివిధ సైద్ధాంతిక దృక్పథాలను విద్యార్థులు విమర్శించేట్లు ప్రోత్సహిస్తారు. తరువాత వారంతా పరిశోధనలు చేయడానికి, శ్రామికులు మరియు రైతులతోకలిసి రివిజనిజం, భావవాదం, మార్మికవాదా (Metaphysics)లను విమర్శించడానికీ ఫ్యాక్టరీలకు పల్లెసీమలకు వెళ్తారు. ఈవిధంగా తత్వశాస్త్రం వీరిచేతుల్లో ఒక పదునైన ఆయుధంగా పరిణమిస్తుంది. వాస్తవపోరాటాల్లో పాల్గొనే సమయంలో వారి సైద్ధాంతికజ్ఞానాన్ని అవగాహనను మరింత నిశితపరచుకుంటారు. తత్ఫలితంగా అసలు మార్క్సిజానికీ నకిలీ మార్క్సిజానికీగల తేడాను పసికట్టేశక్తిని పెంపొందించుకున్నవారౌతారు. వీరిలో చాలమంది స్పష్టమైన దృక్పథంతో మహత్తరవిషయాల్తో ఎన్నో సైద్ధాంతిక వ్యాసాలు రాస్తారు. ఒకసారి ఒక యువఅధ్యాపకుడన్నాడు. "నేను ఐదేండ్లపాటు పాతపీకింగ్ యూనివర్సిటీలో తత్త్వశాస్త్రం చదువుకున్నాను. అప్పుడు నేనురాసిన పరిశోధనావ్యాసాలన్నీ వాస్తవానికెంతోదూరం. కాని ఇప్పుడు కేవలం ఒక సంవత్సరంమాత్రమే చదువుకొని విద్యార్థులు మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంతాన్ని మధ్య వర్గీయుల (Bourgeoisie) ను విమర్శించటానికి అన్వయించగలుగుతున్నారు."

సామ్యవాద వ్యవసాయాన్ని అభివృద్ధిపరచడానికి మార్గం (The Road for Developing Socialist Agriculture) గురించి పరిశీలన అధ్యయనంచేయడానికి రాజకీయ అర్థశాస్త్ర విద్యార్థులు ఎంగెల్స్ రాసిన "ఫ్రాన్సు జర్మనీల్లో రైతు సమస్య" (The Peasant Questions in France & Germany), లెనిన్‌రాసిన 'సహకారం' (on Co-operation) మరియు చేయిర్మన్ మావో వ్యావసాయిక సహకారం గురించి రాసిన రచనలు చదివారు. ప్రజాకమ్యూన్లలో అధ్యాపకుల పర్యవేక్షణకింద పరిశోధనలుచేశారు. చేయిర్మన్ మావో వ్యావసాయిక సహకారోద్యమాన్ని "యాభై కోట్ల రైతులనుసరించవలసిన మార్గం" అని చెప్పిన సందర్భంలో పేర్కొన్న హోపెయి రాష్ట్రంలోని చీన్‌మింగ్ ప్రజాకమ్యూన్‌కుచెందిన సిపు ఉత్పాదకదళం (Hsipu Pro-

duction Brigade) లో ముసలి రైతులు విప్లవకారుడర్లు ఒక గాడిద నాలుగు నాగళ్ళ యాజమాన్యంలో ముప్పావువంతు భాగంగల సహకారసంస్థనుండి మౌలికంగా యాంత్రికంగా నడుస్తున్న ప్రస్తుత దశంగా ఏవిధంగా వృద్ధిచెందిందీ తెలియజేశారు.

చరిత్రశాఖ అధ్యాపకులు విద్యార్థులు మింగ్ మరియు చింగ్‌వంశాల అధ్యయనం చేసేటప్పుడు పీకింగ్ పొలిమేరల్లోఉన్న మింగ్ సమాధులను దర్శించారు. వీరు మింగ్ సమాధులకు సమీపంగా బతుకులుఈడ్చిన పూర్వీకులకు సంబంధించిన పేద మరియు కింది మధ్యతరగతికిచెందిన రైతుల కుటుంబ చరిత్రలను తెలుసుకొనడానికి అనేక చారిత్రికాంశాలను పరిశోధించారు. తత్ఫలితంగా భూస్వాములు రైతులను క్రూరంగా దోచుకున్నవైనం, సలిపిన దమనకాండ, వాటిని ఎదుర్కొనడానికి రైతులుచేసిన పోరాట వివరాలు బయటపడ్డాయి. ఇది విద్యార్థులకు అధ్యాపకులకు మార్క్సిస్టు చారిత్రిక భౌతికవాదాన్ని స్వయంగా బోధపర్చుకోవడానికీ, వర్గపోరాట సిద్ధాంతంతో చరిత్రను గూర్చిన భావవాద అవగాహనను విమర్శించడానికి ఎంతో తోడ్పడింది.

ఇంతకుపూర్వపురోజుల్లో వాస్తవాన్నుండి తెగదెంపులుచేసుకొని వేరుపడ్డకారణంగా చైనీస్ భాషాసాహిత్యాల పట్టభద్రులు వర్గపోరాటాన్ని ప్రతిబింబించే రచనలుచేయలేకపోయారు. గతసంవత్సరం సాహిత్యాధ్యాపకులు విద్యార్థులు రాజధాని పొలిమేరల్లోని లియువాన్ ఉత్పాదకజట్టువద్ద పరిశోధనలుచేశారు. (అందులో తేలిన) పార్టీశాఖ కార్యదర్శి మరిఎంతో మంది కమ్యూన్ సభ్యులు సామ్యవాద పల్లెప్రాంత నిర్మాణానికై చేసిన సాహసోపేతమైన కృత్యాలతో వీరు ఎంతగానో ఉత్తేజం పొందారు. వీరు ఆకృత్యాల గురించి రాసుకుంటున్నప్పుడు అధ్యాపకులు సాహిత్యం, కళ, సాహిత్య రచనాసృష్టి, అలంకారశాస్త్రాలగురించిన మార్క్సిస్టు-లెనినిస్టుసిద్ధాంతాలపై ఉపన్యసించేవారు. విద్యార్థులు ప్రాచీన సమకాలీన రచనలను విశ్లేషించారు. వీరి సాహిత్య సృష్టి చిన్నకథలను సంకలనంచేయడంగా పరిణమించింది. ఒక ముసలి ప్రొఫెసర్ అన్నాడు: "ఇలాంటిది ఇదివరకు ఊహకందనివిషయం. ఆరోజుల్లో వివేచనలేకుండా అందరు ప్రాచీన రచయితలను మెచ్చుకోవడం నేర్పాము. ఇది విద్యార్థులభావాలనూ అనుభూతులనూ ఎంతగానో ప్రభావితం చేసింది. అందుకే వారు సాహిత్య కళావారసత్వాలను విమర్శనాత్మకంగా పొందజాలకపోవడమూ, గతాన్ని వర్తమానానికి సహాయకంగా ఉండేట్లు చేయజాలకపోవడమూ జరిగింది. ఇప్పుడు మేము విద్యార్థులతోపాటు శ్రామికులు, రైతులు మరియు సైనికుల్లోనికి, వారినుండి నేర్చుకోవడానికి ప్రపంచదృక్పథాన్ని తిరిగి రూపొందించుకోవడానికి, వారి జీవితపోరాటాల గురించి రాయడానికి, చొచ్చుకొనిపోతాము. ఈ పద్ధతిలోనైతేనే మనం విద్యార్థులకు ప్రజల కవసరమైన సాహిత్యం మరియు కళాశ్రామికులు రూపొందగల శిక్షణనివ్వగలం."

సరైన ఆలోచనలు ఎక్కడినుండి వస్తాయి?

[మే 1963] — చైర్మన్ మావో త్సే-టుంగ్

సరైన ఆలోచనలు యెక్కడినుండి వస్తాయి? ఆకాశంనుండి ఊడిపడ్తాయా? లేదు. పుట్టుకతోనే అవి మన మనసులో జొరబడ్డాయా? లేదు. సామాజిక ఆచరణనుండే అవి వస్తాయి. కేవలం దానినుండి మాత్రమే వస్తాయి. అవి మూడు రకాల సామాజిక ఆచరణలనుండి వస్తాయి. ఉత్పత్తి కోసం పోరాటం, వర్గపోరాటం, శాస్త్రీయప్రయోగం. మానవుని సామాజిక జీవితమే అతని ఆలోచనావిధానాన్ని నిర్దేశిస్తుంది. పురోగామి(ఎడ్వాన్స్‌డ్)వర్గానికి స్వాభావికమయిన సరైన ఆలోచనను ప్రజానీకం ఒకసారి గ్రహిస్తే, ఆ ఆలోచనలు భౌతికశక్తిగా మారుతాయి. అవి సమాజాన్ని మారుస్తాయి, ప్రపంచాన్ని మారుస్తాయి; తమ సామాజికఆచరణలో మనుష్యులు వివిధరకాల పోరాటాలలో నిమగ్నమౌతారు. వారి విజయాలనుండీ, వైఫల్యాలనుండీ రెండింటిద్వారాకూడా వారు అమూల్యమయిన అనుభవాన్ని సంపాదిస్తారు. తమ పంచేంద్రియాలద్వారా-అంటే కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మంద్వారా-భౌతిక బాహ్య ప్రపంచంయొక్క అంతర్దృగ్విషయాలు (ఫినోమినా) మానవుని మెదడులో ప్రతి ఫలిస్తాయి. మొదట జ్ఞానం (నాలెజ్) గ్రహింపబడ్తుంది (పర్ సెప్చ్వల్). ఈ గ్రహింపబడిన (పర్ సెప్చ్వల్)జ్ఞానం చాలినంత చేకూరినప్పుడు. భావనా (కన్ సెప్చ్వల్) జ్ఞానానికి అంటే ఆలోచనలకు ఎగరటం జరుగుతుంది. తెలుసుకొనుటలో యిది ఒక క్రమం. తెలుసుకొనే మొత్తం క్రమంలో ఇది మొదటిదశ. ఇది భౌతిక పదార్థం నుండి స్వీయ చైతన్యానికి, అస్తిత్వం నుండి ఆలోచనలకు దారితీసే దశ. వ్యక్తి, చైతన్యం, లేక ఆలోచనలు (సిద్ధాంతాలు, విధానాలు, ప్రణాళికలు, చర్యలతోసహా) భౌతిక బాహ్య ప్రపంచం సూత్రాలను సరిగ్గా ప్రతిఫలింపజేస్తాయా లేదా అనేది ఈ దశలో యింకా నిరూపింపబడదు. అవి సరైనవో కావో నిర్ధారించు కోవటం ఈ దశలో యింకా సాధ్యపడదు. అప్పుడు తెలుసుకొనేక్రమంలో రెండవదశవస్తుంది. చైతన్యంనుండి మళ్ళీ పదార్థానికీ, ఆలోచనలనుండి మళ్ళీ అస్తిత్వానికి దారితీసేదశయిది. సిద్ధాంతాలు, విధానాలు, ప్రణాళికలు. లేక చర్యలు ఆశించిన విజయాన్ని ఇస్తవా లేవా అని నిర్ధారించుకోవటానికి మొదటిదశలో సంపాదించిన జ్ఞానాన్ని ఈ దశలో సామాజిక ఆచరణకు పెట్టబడ్తుంది. సాధారణంగా చెప్పాలంటే జయప్రదమయినవి సరైనవి విఫలమయినవి సరైనవికావు. ప్రత్యేకించి ప్రకృతితో మానవుడు జరిపే పోరాటంలో

ఇది యదార్థం. సామాజిక పోరాటంలో పురోగామివర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శక్తులు కొన్నిసార్లు ఓటమి పొందవచ్చు. అయితే అది వారి ఆలోచనలు సరైనవికాక పోవటం వలనకాదు. కాని పోరాటంలో నిమగ్నమైనశక్తుల బలాబలాల తూకంలో వారు తాత్కాలికంగా అభివృద్ధి నిరోధకులంత శక్తివంతులు కాకపోవటమే కారణం. కాబట్టే వారు తాత్కాలికంగా పరాజయం పొందారు. ఐతే వారు కొంచెం ఆలస్యం గానో త్వరగానో విజయం పొందటం ఖాయం. ఆచరణయొక్క అగ్నిపరీక్ష ద్వారా మానవుని విజ్ఞానం మరొక ముందంజ వేస్తుంది. ఈ ముందంజ వెనుకటి దానికంటె మరింత ముఖ్యమయినది. ఎందుకంటే కేవలం ఈ ముందంజ మాత్రమే మొదటి ముందంజ. అంటే భౌతిక బాహ్య ప్రపంచాన్ని ప్రతిఫలింపజేసే క్రమంలో సూత్రీ కరించబడిన ఆలోచనలు, సిద్ధాంతాలు, విధానాలు, ప్రణాళికలు, చర్యలు ముందంజ యొక్క సత్యాసత్యాలను నిరూపిస్తాయి. నిజాన్ని పరీక్షించటానికి యింతకంటే మార్గంలేదు, అంతేకాక ప్రపంచాన్ని తెలుసుకోవటంలో శ్రామికవర్గం ఏకైక ఉద్దే శం కేవలం దానిని మార్చటం మాత్రమే. పదార్థం నుండి చైతన్యానికి, అక్కడి నుండి తిరిగి పదార్థానికి దారితీసేక్రమం- అంటే ఆచరణనుండి జ్ఞానానికి, అచ్చటినుండి తిరిగి ఆచరణకు దారితీసే క్రమం పదేపదే పలుమార్లు జరిగిన తర్వాతనే, తరుచుగా సరియైన ఆలోచనకు రావటం జరుగుతుంది. అట్లాంటిది మార్క్సిస్టు జ్ఞానసిద్ధాంతం. గతితార్కిక భౌతికవాద జ్ఞానసిద్ధాంతం.

ఈ జ్ఞాన సిద్ధాంతాన్ని యింకా అర్థంచేసుకోనివారు మన కామ్రేడ్స్‌లో చాలా మంది వున్నారు. తమ ఆలోచనలకు అభిప్రాయాలకు, విధానాలకు పద్ధతులకు, ప్రణా ళికలకుగానీ, తమ సూత్రీకరణలకు, గంభీరోపన్యాసాలకు, సుదీర్ఘ వ్యాసాలకుగల ఆధారమేమిటని అడిగితే, వారాప్రశ్నను విచిత్రకరంగా పరిగణిస్తారు. కాని దానికి జవాబు చెప్పలేరు. పదార్థం చైతన్యంలోకి, చైతన్యం మళ్ళీ పదార్థంలోకి రూపాంత రీకరించబడ్తుందని వారు గ్రహించలేరు. అలాంటి మార్పులు నిత్య జీవితంలో నిరంత రం జరుగుతున్నప్పటికి వారు అర్థంచేసుకోలేరు. కాబట్టి గతి తార్కిక భౌతికవాద సిద్ధాంతంలో మన కమ్రేడ్స్‌కు విద్యగరిపి చైతన్యవంతులను చేయాల్సిన ఆవశ్యకత ఉంది. తద్వారావారు తమ ఆలోచనావిధానాన్ని సరిగ్గా మలుచుకోగలరు. పరిశోధన, అధ్యయనం చేయుటలో వారు మంచి నేర్పరులౌతారు. అనుభవాన్ని సమీక్షించుకొని కష్టాలను అధిగమించుటలో చాలా తక్కువ పొరపాట్లు పడటానికి వీలు కలుగుతుంది. చైనాను మహత్తర శక్తివంతమయిన దేశంగా నిర్మించేందులకై వారు తమ పనిని మెరుగ్గా, మెలకువగా చేస్తారు, దృఢంగా పోరాడ్తారు. మన మహత్తర అంతర్జాతీయ

కర్తవ్యాన్ని నెరవేర్చుటలో ప్రపంచ పరివ్యాప్తంగా, దోపిడీకి గురౌతోన్న అసంఖ్యాక పీడిత, తాడిత ప్రజారాశులకు తోడ్పడుతారు.

["గ్రామీణ కార్యకలాపాలలోని సమస్యలపై చైనా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీయొక్క ముసాయిదా తీర్మానం"లోనిది ఈ వ్యాస భాగం. కామ్రేడ్ మావో ఆదేశానుసారం అది రాయబడింది. ఈ వ్యాసభాగం కామ్రేడ్ మావోచే స్వయంగా రాయబడింది.]

(మావో రచనలు, 5వ సంపుటం. 726, 27 పుటలు)

తెనుగుసేత : క్రాంతిదర్శి

సాంస్కృతిక రంగంలో ఐక్య సంఘటన

షెన్సీ-కాన్సూ-నింగ్సియా సరిహద్దు మండలంయొక్క సాంస్కృతిక, విద్యా విషయిక కార్యకర్తల మహాసభలో కామ్రేడ్ మావో త్సే-టుంగ్ చేసిన ప్రసంగం.

[అక్టోబర్ 30, 1944] **మావో త్సే-టుంగ్**

జపాన్ సామ్రాజ్యవాదాన్ని కూలదోయడమే మన సమస్తకృషియొక్కలక్ష్యం. హిట్లర్‌లాగానే జపాన్ సామ్రాజ్యవాదంకూడా తన సర్వనాశనానికి దగ్గరౌతోంది. మన ప్రయత్నాలను మనం కొనసాగించాలి. ఎందుకంటే. ఆవిధంగా మాత్రమే దాని అంత్యపతనాన్ని మనం సాధించగలం. మనపనిలో యుద్ధకార్యం ప్రధమ ప్రాధాన్యత వహిస్తుంది. తర్వాత ఉత్పత్తి పని వస్తుంది. ఆ తర్వాతనే సాంస్కృతిక కార్యకలాపాలువస్తాయి. సంస్కృతిలేని సైన్యం వివేకహీనమైన సైన్యం శత్రువును ఓడించలేదు.

విముక్తిప్రాంతాల సంస్కృతి ఇప్పటికే ప్రగతిశీలమైన అంశమునుకల్గియుంది. ఐతే దానికి వెనుకబాటు అంశం యింకావుంది. విముక్తిప్రాంతాలకప్పుడే ఒక నూతన సంస్కృతి, ప్రజల సంస్కృతి ఏర్పాటయింది. ఐతే భూస్వామ్య విధానం (ఫ్యూడలిజం)యొక్క అవశేషాలు మాత్రం అధికసంఖ్యలో బతికేవున్నాయి. షెన్సీ-కాన్సూ-నింగ్సియా సరిహద్దుమండలి(రీజియన్)యొక్క 15 లక్షల జనాభాలో 10 లక్షలమందికి పైగా ద్లొక్కశుద్ధిలేనివారు(నిరక్షరాస్యులు). అక్కడ మంత్రతంత్రాలను ఉపాసించేవాళ్లు రెండువేలమంది వున్నారు. అసంఖ్యాక ప్రజానీకం మూఢనమ్మకాల ప్రభావానికి

లోనై వున్నారు. ఇవి ప్రజల మనసుల్లోని శతృవులు. జపాన్ సామ్రాజ్యవాదంతో పోరాడ్డంకంటే ఈ ప్రజల మనసుల్లోని శతృవుతో పోరాడ్డం తరచుగా ఎక్కువ కష్టమౌతుంది. తమ చదువురానితనానికీ, మూఢనమ్మకాలకూ, అనారోగ్యకరమైన అలవాట్లకు వ్యతిరేకంగా నిల్చిపోరాడాల్సివుందని ప్రజాబాహుళ్యానికి మనం పిలుపివ్వాలి. ఈ పోరాటంకోసం విశాలమయిన ఐక్యసంఘటన ఆవశ్యకమైనది. ముఖ్యంగా జనాభా అతిపలచగానూ, వార్తాప్రసార, రవాణాసౌకర్యాలు తక్కువగానూ, సాంస్కృతికపునాది హీనస్థితిలోనువున్న షెన్సీ-కాన్సూ-నింగ్సియా సరిహద్దుమండల ప్రాంతాలలో మొదట ఈఐక్యసంఘటన ప్రత్యేకించి విశాలతరంగా వుండాలి. దానితోపాటే యుద్ధంచేయటం కూడా. కనుకనే మన విద్యావిధానంలో కేవలం క్రమబద్ధమైన(రెగ్యులర్) ప్రాథమిక, సెకండరీ పాఠశాలలేకాక క్రమరహితమైన(రెగ్యులర్‌కాని) పల్లెటూరి బడులు, వార్తాపత్రికపఠన బృందాలు, అక్షరాస్యతా తరగతులుకూడా అక్కడక్కడవుండాలి. కేవలం ఆధునికపాఠశాలలు నిర్వహించటమేకాక, పాతపద్ధతులలో పనిచేసే పల్లెటూరిబడులనుగూడా వినియోగించుకోవాలి. వాటిలో మార్పుతేవాలి. కళారూపాలలో, మనంకేవలం ఆధునిక నాటకప్రక్రియను చేపట్టటమేకాక, షెన్సీ సంగీత-నాటకం(ఒపేరా), యాంకో నృత్యాలనుకూడా మన స్వంతం చేసుకోవాలి. కేవలం నూతన షెన్సీ సంగీత-నాటకాలను (ఒపేరాలు)నూతన యాంకో నృత్యాలను నిర్వహించటమేకాక, పాతసంగీత-నాటకకంపెనీలను, యాంకో నృత్య బృందాలనుకూడా మనం వినియోగించుకోవాలి. వాటిని క్రమక్రమేణా మార్చుకోవాలి. మొత్తం యాంకో నృత్యబృందాలలో ఇవి 90శాతం వరకూ వుంటాయి. ఇదే దృక్పథం వైద్యరంగంలో మరింత ఎక్కువగా ఆవశ్యకమైనది. షెన్సీ-కాన్సూ-నింగ్సియా సరిహద్దుమండలంలో మనుష్యుల, పశువులమరణాలసంఖ్యలు అత్యధికస్థాయిలో వున్నాయి. అదేసమయంలో చాలామంది జనానికి మంత్రతంత్రాలలో మహిమలలో మూఢనమ్మకాలు యింకా వున్నాయి. ఇట్టి పరిస్థితులలో, కేవలం ఆధునిక వైద్యులమీదనే ఆధారపడినందువలన ప్రయోజనంలేదు. పురాతన విధానాన్ని అవలంబించే వైద్యులకంటే ఆధునికవైద్యులకు సానుకూలతలు హెచ్చుగావుండటం నిజమేకాని వారు (ఆధునిక వైద్యులు) ప్రజల యిక్కట్లను పట్టించుకోక ప్రజలకోసం వైద్యులకు శిక్షణగరపక పోయినట్లయితే, సరిహద్దుమండలంలోని వేలాది నాటు వైద్యులతోను, పశువైద్యులతోను ఐక్యంకాక, అభివృద్ధిచెందటానికి వారికి తోడ్పడనట్లయితే, అప్పుడు వారు నిజంగా మంత్ర-తంత్ర వైద్యులకుపయోగపడనివారే అవుతారు. అత్యధిక సంఖ్యలో మృతిచెందుతున్న పశువులపట్ల, మానవులపట్ల ఉపేక్షించినవారే అవుతారు. ఐక్యసంఘటనకు రెండుసూత్రాలున్నాయి. ఐక్యంకావటం మొదటిది. విమర్శించి చైతన్యం కలుగజేసి మార్చటం రెండవది. ఐక్యసంఘటనలో లొంగుబాటు

వాదం తప్పుడుపంథా. అలాగే యితరులయెడ తిరస్కారం, తనపట్ల ఔన్నత్యం, ప్రత్యేకత ప్రదర్శించుకొనే ఒంటెత్తువాదం (సెక్టేరియనిజం)కూడా తప్పుడుపంథాయే. ఉపయోగకరమైన యావత్తు పాతతరహా వైద్యులతోను, కళాకారులతోను మేధావులతోనూ ఐక్యంకావాలి. వారిని మార్చుకొని, కొత్తవారిగాచేసి, మనలో కలుపుకోవడానికి మనం తోడ్పడాలి. వారిని మార్చేందులకై మొదట మనం వారితో ఐక్యంకావాలి. మనం దీనిని సవ్యంగాచేస్తే, వారు మన సహాయాన్ని తప్పక ఆహ్వానిస్తారు.

మన సంస్కృతి ప్రజల సంస్కృతి. మన సాంస్కృతిక కార్యకర్తలు అత్యుత్సాహంతో, ఉత్తేజకరంగా దీక్షబట్టి ప్రజలకు సేవచేయాలి. వారే స్వయంగా ప్రజారాశులతో సంబంధం పెట్టుకోవాలిగాని ప్రజాబాహుళ్యంనుండి వారు వేరుపడిపోకూడదు. ఆవిధంగా చేసేందులకై వారు ప్రజానీకం యొక్క అభిరుచులకు అవసరాలకు అనుగుణ్యంగా ఆచరించాలి. జనసామాన్యంకోసం చేసేపని సాంతం వారి అవసరాలనిమిత్తమే జరగాలికాని అదెంత సదుద్దేశంతో కూడుకున్నదైనప్పటికి, ఏ వ్యక్తి యొక్క యిష్టాయిష్టాల ప్రకారం జరుగకూడదు. ఇది తరచుగా జరుగుతూ వుంటుంది— భౌతికంగా ప్రజాబాహుళ్యం కొంతమార్పు చెందాల్సిన అవసరం వుంది కానీ, స్వీయాత్మకంగా (సబ్జెక్టివ్‌లీ)వారింకా అవసరాన్నిగుర్తించే చైతన్యం వారిలోలేదు. మార్పుచెందటానికి వారింకా కృతనిశ్చయులుకాలేదు, సమ్మతించలేదు, అట్టి సందర్భాలలో, మనం ఓపిక పట్టి నిరీక్షించాలి. ప్రజాబాహుళ్యంలో అత్యధికభాగం మన కృషిద్వారా ఆ అవసరాన్ని గుర్తించేవరకూ, దానిని నిర్వర్తించటానికి సమ్మతించి, కృతనిశ్చయులయ్యేంతవరకు మనం మార్పుచేయకూడదు. తద్విరుద్ధంగా ప్రవర్తిస్తే మనం ప్రజలనుండి వేరుకావటం తథ్యం. <u>ప్రజానీకం పాల్గొనాల్సిన ఏ కార్యమైనా వారు చైతన్యపరులై</u> దానికి సమ్మతించకపోయినట్లయితే అది వట్టి లాంఛనప్రాయంగా తయారౌతుంది. అది వైఫల్యం చెందుతుందికూడా. "తొందరపాటు విజయాన్ని తీసుకరా"దనే సామెత యొక్క అర్థం మనం తొందరపడి చేయకూడదనికాదు. కాని మనం ఉద్రేకపడకూడదనే చెప్తుంది. ఎందుకంటే ఉద్రేకం వైఫల్యానికిమాత్రమే దారితీస్తుంది. ఏరకమైన పనిలోనైనాసరే విశేషించి ప్రజాబాహుళ్యంయొక్క ఆలోచనా విధానాన్ని మార్పుచేసే లక్ష్యంగల ఏ పనిలోనైనాసరే ఇది నిజం. ఇక్కడ రెండుసూత్రాలున్నాయి. ఒకటి— ప్రజాబాహుళ్యానికేమిగావాలో మనం ఊహించేవాటికంటే ప్రజానీకంయొక్క నిజమైన అవసరాలు. రెండవది— ప్రజానీకంయొక్క వాంఛలు. వారికోసం మనం నిర్ణయాన్ని చేసేబదులు వారి నిర్ణయాలను వారే నిశ్చయించుకోవాలి.

తెనుగుసేత : క్రాంతిదర్శి

గద్దర్ పాటలు:

నిర్మల కథ

(కోలాటంపాట)

ఏనియాలో ఏనియాలో   ఏనియాలోగోపి (,,)
నిర్మలమ్మ కథవినరే   ఏనియాలో (-)

అమ్మలార అక్కలార   ,,   ,,
మమ్ముగన్న తల్లులార   -   -
అన్నలార తమ్ములార   ,,   ,,
మమ్ముగన్న తండ్రులార   -   -
మంచి మనసుతోమీరు   ,,   ,,
మాపాట వినరె తల్లి   -   -   ॥ఏనియాలో॥

నిర్మలమ్మ పుట్టినపుడు   ,,   ,,
తినబోతె తిండిలేదు   -   -
కట్టబోతె బట్టలేదు   ,,   ,,
గంజినీళ్ళు కరువాయె   -   -
ఈలాంటి కరువులోన   ,,   ,,
నిర్మలమ్మ పుట్టినది   -   -   ॥ఏనియాలో॥

పాలులేక కన్నతల్లి   ,,   ,,
కన్నీరు పెట్టసాగె   -   -
పాలివాని ఇంటికెళ్ళి   ,,   ,,
పావుసేరు బియ్యమడిగె   -   -
పావుసేరు బియ్యంగాదు   ,,   ,,
పది ఇత్తులు లేవనిరి   -   -   ॥ఏనియాలో॥

తిండిలేక కన్నతండ్రి   ,,   ,,
గుండె గుద్దుకున్నాడు   -   -

సేటువద్ద కెళ్ళినాదె ఏనియాలోగోపి (,,)
వొంగి సలాం జేసినాదె ఏనియాలా (-)
గొంతెత్తి పలికినాదే ,, ,,
తనగోడు చెప్పినాదె - -
కరువులొ నన్నాదుకుంటె ,, ,,
కాళ్ళసేవ చేస్తనండు - -
బతికుంటే నేను బాబు ,, ,,
బాకి తీర్చి వేస్తననే - - ॥ఏనియాలొ॥

పాతబాకి కట్టెదాక ,, ,,
పైస పొదలేదనెనె - -
నీవు సస్తె బతికితే ,, ,,
నాదేమీ పోదనెను - -
నీయబ్బసొమ్మ అమ్మసొమ్మ ,, ,,
ఇందాక తిన్నదండు - - ॥ఏనియాలొ॥

ఏడ్చుకుంటు తండేర్రిమో ,, ,,
దొర ఇంటి కొచ్చెనమ్మ - -
తన కథ అంతను చెప్పెనమ్మ ,, ,,
వెతనంత చెప్పెనమ్మ - -
దొంగ లంజకొడక అని ,, ,,
దొర తిట్టి ఎల్లగొట్టె - -
మేక మనసులోని బాధ ,, ,,
కటికోనికేమి తెలుసు - -
కడుపునిండ తిన్నోనికి ,, ,,
ఆకలి బాధేమి తెలుసు - -
సుఖాలల్లో మునిగెటోన్కి ,, ,,
కష్టమంటె యేమితెలుసు - - ॥ఏనియాలొ॥

ఇల్లు ఇల్లు తిరుగుకుంటు	ఏనియాలోగోపి (,,)		
లీడరింటి కొచ్చెనమ్మ	ఏనియాలొ (-)		
ఖద్దరు బట్టలలోన	,,	,,	
లీడరు కూర్చున్నాడు	-	-	
కల్లు సార దాగుకుంట	,,	,,	
గాంధిపాట పాడుతుండు	-	-	॥ఏనియాలొ॥
అరేయ్ తురేయాని	,,	,,	
అదిరించి పెట్టిండు	-	-	
పోయిన యెన్నికల్లో	,,	,,	
వోటెయ్య లేదన్నడు	-	-	
కమ్మినిస్టులదంతా	,,	,,	
కావురమెల్లాలన్నడు	-	-	
మెడపట్టి నూకేసి	,,	,,	
మేడమీది కెళ్ళిండు	-	-	॥ఏనియాలొ॥
గునుసుకుంటు తండ్రేమో	,,	,,	
గుడిసెకొచ్చినాడమ్మా	-	-	
గుండె నొప్పితోనేమో	,,	,,	
గుడిసంత పొర్లిండు	-	-	
దోసెడు రక్తం కక్కి	,,	,,	
కన్ను మూసినాడమ్మా	-	-	
మొగని చావుచూచి తల్లి	,,	,,	
మూర్ఛపోయిందమ్మా	-	-	॥ఏనియాలొ॥
ఎట్టిచేసి కూలిచేసి	,,	,,	
నిర్మలను సాదినాది	-	-	
గంజినీళ్ళు తానుదాగి	,,	,,	
నిర్మలను పెంచినాది	-	-	

చూడచూడ నిర్మలమ్మ	ఏనియాలోగోపి	(,,)	
పదియేండ్ల బిడ్డాయె	ఏనియాలొ	(-)	॥ఏనియాలొ॥
ఒకనాడు బిడ్డనేమో	,,	,,	
తల్లివాడిలోకి తీసుకుంది	-	-	
కండ్లనిండ నీరు నింపి	,,	,,	
తండ్రి కథను చెప్పినాది	-	-	
తండ్రి కథచెప్పి తల్లి	,,	,,	
కూలికెల్లి పోయినాది	-	-	
కూలికెళ్ళిన తల్లి	,,	,,	
తిరిగిరాలేదమ్మా	-	-	॥ఏనియాలొ॥
కూలికాడ తల్లిమీద	,,	,,	
రాయికూలి సచ్చెనమ్మ	-	-	
నిర్మలను తలుచుకుంటు	,,	,,	
ప్రాణాలు వొదిలినాది	-	-	
చచ్చిన తల్లిని చూచి	,,	,,	
చిన్నారి నిర్మలమ్మ	-	-	
తల్లి గుండెపైవాలి	,,	,,	
గోడుగోడు నేడ్చిందే	-	-	॥ఏనియాలొ॥
అయిలేదు బాయిలేదు	,,	,,	
ఆదుకునేవారులేరు	-	-	
దిక్కులేని పక్షిలాగ	,,	,,	
వెక్కివెక్కి నేడ్చిందే	-	-	
తల్లి దండ్రి లేని బిడ్డ	,,	,,	
ఇల్లు ఇల్లు తిరిగినాది	-	-	
కూటికోసం గుడ్డకోసం	,,	,,	
ఎట్టిచేయ సాగిందమ్మ	-	-	॥ఏనియాలొ॥

చూడచూడ నిర్మలమ్మ	ఏనియాలోగోపి	(,,)	
పద్దెనిమిదేండ్ల బిడ్డాయె	ఏనియాలో	(-)	
కూలినాలి చేసుకుంటు	,,	,,	
బతుక సాగిందమ్మ	-	-	
బీద బిక్కతో కలిసి	,,	,,	
బతుక సాగిందమ్మ	-	-	
ఈదేశంల కూలినాలీలకు	,,	,,	
కూడు దొరకదనుకుంది	-	-	॥ఏనియాలో॥
రాజ్యము యేలెటోళ్ళ	,,	,,	
రంకంతా తెలుసుకుంది	-	-	
గరీబోళ్ళను దోచెటోళ్ళ	,,	,,	
గుట్టంతా తెలుసుకుంది	-	-	
భూస్వాములు దొరలంత	,,	,,	
డోక బాజులను కుంది	-	-	
ఆఊర్లె ఇదువరకు	,,	,,	
తిరగబడ్డోళ్ళ కథలింది	-	-	॥ఏనియాలో॥
ఒకనాడు రాత్రి పూట	,,	,,	
నిర్మలమ్మ గుడిసెలోకి	-	-	
మెరుపులాగాతల్లి	,,	,,	
ఎరుపు మనిషి వొచ్చిండు	-	-	
చేతిలోన కత్తుంది	,,	,,	
పెయ్యంత రక్తముంది	-	-	
ఆ మనిషి ఆపదను	,,	,,	
నిర్మలమ్మ ఆదుకుంది	-	-	॥ఏనియాలో॥
నీపేరు ఏమిటంటే	,,	,,	
నాపేరు మూర్తన్నడు	-	-	

నీఊరు యేదంటే ఏనియాలోగోపి (,,)
అడివని చెప్పినాడు ఏనియాలో (-)
తల్లితండ్రి యెవరంటే ,, ,,
ఎరుపని చెప్పినాడె - -
నీవేమి చేస్తవంటె ,, ,,
ఒక గడియా ఊరుకుండు - -
దోపిడి వర్గాలకోసె ,, ,,
కటికోన్ని అన్నాడే - -
భూస్వాముల గుండెల్లో ,, ,,
సింహరాజు నన్నాడె - -
కూలినాలి పేదోళ్ళకు ,, ,,
సేవకుణ్ణి అన్నాడు - - ॥ఏనియాలో॥

ఈ మాట విన్న నిర్మలకు ,, ,,
మనసునిండి పోయింది - -
మూర్తిలోకి చూసింది ,, ,,
కళ్ళనిండ చూసింది - -
మూర్తిలోన నిర్మల ,, ,,
నిర్మలలో మూర్తిగారు - -
ఒకరిలోన ఒకరుకలిసి ,, ,,
అడివికెళ్ళి నారమ్మ - - ॥ఏనియాలో॥

శ్రీకాకుళ అడివమ్మ ,, ,,
చీమలు దూరని అడివి - -
అడివిలోకి వెళ్ళినారు ,, ,,
అన్నలను కలిసినారె - -
హరిజనులను కలిసినారు ,, ,,
గిరిజనులను కలిసినారు - -
సత్యం భాస్కరుల గలిసి ,, ,,
కైలాసం పాణిగ్రాహిల - - ॥ఏనియాలో॥

వీరందరిని కలిసి నిర్మల   ఏనియాలోగోపి (,,)
ఎఱ్ఱసేనల చేరినాదె   ఏనియాలో (-)
ఊరూర ఎఱ్ఱసేన   ,,   ,,
మారుమ్రోగ సాగిందే   -   -
నిర్మ మ్మ పేరువింటె   ,,   ,,
దుర్మార్గులు భయపడిరి   -   -
కొంగు నడుముకుచుట్టి   ,,   ,,
కొడవలందు కున్నదమ్మ   -   -   ॥ఏనియాలో॥

సత్యమన్న దగ్గరేమో   ,,   ,,
సాధన నేర్చుకున్నది   -   -
భాస్కరుని చేతినుండి   ,,   ,,
బందూకు తీసుకుంది   -   -
పాణిగ్రాహి నుండి   ,,   ,,
పాటలెన్నొ నేర్చుకుంది   -   -
ప్లానువేసుకోని తల్లి   ,,   ,,
పల్లె పల్లె తిరిగినాది   -   -   ॥ఏనియాలో॥

పల్లెప్రజలతో కలిసి   ,,   ,,
తల్లేమి చెబుతుంది   -   -
మీసమున్న అన్నలార   ,,   ,,
రోషమున్న తమ్ములార   -   -
ఇంక ఎన్ని రోజులు   ,,   ,,
తిండిలేక చస్తారు   -   -
ఇంక ఎన్ని రోజులు   ,,   ,,
ఎట్టిచేసి బ్రతుకుతారు   -   -   ॥ఏనియాలో॥

పుట్టింది ఒకనాడు   ,,   ,,
సచ్చేటందుకె నన్నది   -   -

ఎర్రజెండ కిందనే ఏనియాలో గోపి (,,)
సస్తే ఫలమన్నాది ఏనియాలో (-)
సావుకు భయపడెటోళ్ళు ,, ,,
పిరికిపందలన్నాది - -
ఈ మాటలు విన్నప్రజలు ,, ,,
నిప్పులాగ ఇప్పుకొనిరి - - ॥ఏనియాలొ॥

ఈ మాటలు విన్న ప్రజలు ,, ,,
మంటలై లేసినారు - -
నిర్మలతో కలిసినారు ,, ,,
ఎరుపుబాట నడిచినారు - -
నిర్మలమ్మ పేరువింటె ,, ,,
ఇందిరమ్మ గుండెలదిరె - -
దొంగ మంత్రులందరు ,, ,,
భయంపుట్టి వొణికినారు - - ॥ఏనియాలొ॥
నిర్మల తల్లినిబట్టి ,, ,,
నిలదీసి కాల్చుమనిరి - -
నిర్మల తల్లికొరకు ,, ,,
దొంగ పోలీసోళ్ళు - -
ఆంబోతుల మాదిరిగా ,, ,,
అడివంతా వెతికినారు - -
ఎర్రసేనలో తల్లి ,, ,,
మెరువ సాగిందమ్మ - - ॥ఏనియాలొ॥

తుపాకుల తూటాల ,, ,,
సంక కేసుకున్నాది - -
కొడవండ్లతొ గొడ్డండ్లతో ,, ,,
తల్లి కదుల సాగింది - -

పగబట్టిన పోలీసుల ఏనియాలోగోపి (..)
పట్టుకొని పొడిచినాది ఏనియాలో (-)
భూస్వాముల రక్తంతో " "
రంగులాడిందమ్మా - - ॥ఏనియాలో॥

ఈ దెబ్బతొ సర్కారుకు " "
గుండె బద్దలైనాదె - -
వేలకొలది పోలీసోళ్ళు " "
తల్లి నెతకసాగినారు - -
అలసటతో నిర్మలమ్మ " "
తన దళంతో విశ్రమించ - -
పోలీసోళ్ళు చూసినారు " "
ఆ తల్లిని పట్టుకొనిరి - - ॥ఏనియాలో॥

ఆ తల్లి నె పట్టుకొనిరె " "
ఆ దళమునె పట్టుకొనిరె - -
నిర్మలను తీసుకెళ్ళి " "
అడవిలోక చెట్టుకు కట్టినారె - -
అంతలోన నిర్మలమ్మ " "
ఇటుల పలుక సాగెనమ్మ - -
నీవు పేద వాడివే " "
నేను పేద దానినే - -
పేద ప్రజల కొరకె నేను " "
ఎర్ర జండ పట్టినాను - - ॥ఏనియాలో॥

భూస్వాముల పట్టినాను " "
బరిశెలతో పొడిసినాను - -
ప్రజలను పీడించెటోళ్ళ .. ..
పారలతో నరికినాను - -

గెరిల్లాల సంపినోళ్ళ ఏనియాలోగోపి (,,)
గొడ్డండ్లతో నరికినాను ఏనియాలో (-) ॥ఏనియాలో॥

బాలనాగమ్మలాగ ,, ,,
బతిమలాడినాదమ్మ – –
సీతమ్మలాగ తల్లి ,, ,,
ఏడుకొన్నదమ్మో – –
దొంగ పోలీసోళ్ళు ,, ,,
తల్లి మాట వినలేదు – –
వొలలబడ్డ పిట్టవె ,, ,,
నిన్ను వొదిలివేస్తాము – –
నీవొల్ల జాడ జెప్పితే ,, ,,
నిన్ను వొదిలివేస్తమూ – – ॥ఏనియాలో॥

పట్టపగలే తల్లిని ,, ,,
చెట్టుకు గట్టారమ్మో – –
బలవంతంగ తల్లివి ,, ,,
బట్టలిడవ సాగిండ్రే – –
ఒకరెనుక ఒకరేమో ,, ,,
నిర్మలాను చెర్చిండూ్రి – – ॥ఏనియాలో॥

ఆకరి గడియల్లోన ,, ,,
తల్లేమి పల్కిందా – –
నన్ను మీరు చెర్చిన ,, ,,
నా ఆశయమ్ము చెర్చబోరు – –
నన్ను కాల్చి చంపిన ,, ,,
నావొల్ల జాడచెప్ప – –
అంటు పోలీసోల్ల నోట్ల ,, ,,
కాకరించి ఉంచిందే – – ॥ఏనియాలో॥

ఇది ఇన్న ఇన్‌స్పెక్టరు	ఏనియాలోగోపి (,,)		
చంపమని ఆర్డరిచ్చె	ఏనియాలో	(-)	
ఆ తల్లిని హింసలకు	,,	,,	
గురిచేసినారమ్మ	-	-	
నిర్మలమ్మ గొంతెత్తి	,,	,,	
విప్లవం వర్ధిల్లాలంది	-	-	
తూటమీద తూటపేల్చి	,,	,,	
ఆ తల్లిని చంపిరమ్మ	-	-	॥ఏనియాలో॥
చచ్చిన పీనుగుదీసి	,,	,,	
చెట్టుకేలాడేసినారు	-	-	
రక్తం బొట్లతో భూమి	,,	,,	
తడువ సాగిందమ్మ	-	-	
కారేడు రక్తమంత	,,	,,	
కాలువలై పారింది	-	-	
ఈ మాట శ్రీకాకుళ	,,	,,	
తుఫానులా వీచింది	-	-	॥ఏనియాలో॥
ప్రజలు గెరిల్లాలు	,,	,,	
బందూకులు పట్టిండ్రు	-	-	
నిర్మలమ్మ ఆశయము	,,	,,	
తీర్చబూనుకున్నారు	-	-	
నీ ఆశయము సాధించువరకు	,,	,,	
నిదురబోము అన్నారు	-	-	
భూస్వాముల పోలీసుల	,,	,,	
ఖతం ఖాతం చేస్తమనిరి	-	-	॥ఏనియాలో॥
నీ రక్తం వృథాకాదు	,,	,,	
నీ త్యాగం వృథాపోదు	-	-	

భారతదేశ చరిత్రలో ఏనియాలోగోపి (..)
ఎరుపుతోన రాస్తారే ఏనియాలొ (-)
సూర్యుడున్నంతవరకు .. ..
నీ పేరు నిలుస్తుందె - -
నీ గుండెలోని ఎర్రజెండ .. ..
ఎగురుతూనె ఉంటదమ్మ - - ॥ఏనియాలొ॥

నీ అక్క చెల్లెళ్ళము .. ..
నీ అన్న దమ్ములము - -
నీ లాంటి రక్తంనే .. ..
మాకంద జేయవమ్మ - -
నీ కథను విన్నవారి .. ..
రక్తం ఉప్పొంగునే - -
నీ కథను చదివినచో .. ..
రక్తం ఎరుపెక్కునమ్మ - - ॥ఏనియాలొ॥

నీ తోవన నడిచెవారు .. ..
నిజమైన మనుషులమ్మ - -
వర్గ పోరాటమమ్మ .. ..
వర్ధిల్లి తీరుతుంది - -
పూరూర ఎర్రజెండ .. ..
ఎగిరి తీరుతుందమ్మ - -
నీ తోవలోనె మేము .. ..
నడుంగట్టి నడుస్తాము - - ॥ఏనియాలొ॥

(నిర్మల ఒక విప్లవ నాయకురాలు. పేద స్త్రీ. స్త్రీల త్యాగధనానికి సంకేతం. భారత పీడిత ప్రజలకు ఆదర్శమూర్తి).

విప్లవ కాలంలో చైనా సాహిత్యం - లూసన్ పాత్ర

1

1917 లో నవయువక (న్యూయూత్) అనే పత్రికలో పాత ఫ్యూడల్ పద్ధతిలో చైనా సాహిత్య రచన అంతమొందాలనీ, ప్రజా జీవితాన్ని, సామాజిక పరిస్థితులను వాస్తవికంగా చిత్రించుతూ సజీవమైన వ్యావహారిక భాషలో నూతన సాహిత్యం వెలువడాలనీ చాలా వ్యాసాలు ప్రకటించబడ్డాయి. ఆధునిక చైనాలో సాహిత్య విప్లవానికి యిదే నాంది. "పిచ్చివానిడైరీ"అనే లూసన్ వ్రాసిన చిన్న కథ మొదటి సృజనాత్మక రచన, సాహిత్య విప్లవానికి ఎంతో తోడ్పడింది.

మే 4 వుద్యమానంతరం అభివృద్ధిచెందిన నూతన సంస్కృతీ వుద్యమంఫలితంగా చైనా భాషలో అనేక వార్తా పత్రికలు వెలిశాయి ; కొత్తరకపు సాహిత్య రచన ప్రారంభమయింది. సాహిత్య విప్లవానికి దేశవ్యాపిత ప్రజాపునాది ఏర్పడింది. చైనా కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించడం, విప్లవ తుఫాను చెలరేగడం ఫలితంగా సాహిత్య విప్లవానికి నూతన బలం చేకూరింది. ప్రజావెల్లువ ప్రభావంవల్ల అనేకమంది పెటీబూర్జువా (మధ్యతరగతి) మేధావులు సాహిత్య విప్లవంలో పాల్గొన్నారు. పాత సమాజంలోని చెడుగులను వివిధ కళారూపాలలో చిత్రించుటద్వారా తమ హృదయావేదనను, బాధను వ్యక్తంచేయసాగారు. 1921 తరువాత ఆరు సంవత్సరాలలో దేశమంతటా నూతన సాహిత్యాన్ని, కళలను ప్రోత్సహించే సంస్థలు 130 కి పైగా నిర్మించబడ్డాయి. వాటి తరపున దాదాపు 300 పత్రికలు ప్రకటించబడేవి.

కొత్తరకపు సాహిత్య సంస్థలలో మొట్టమొదటి వాటిలో సాహిత్య పరిశోధక మండలి, సృజనాత్మక సాహిత్య సమితి ముఖ్యమైనవి. షేన్ ఎన్-పింగ్(మావొటున్) చెంగ్ చెన్-టు, ఎహ్ షెంగ్-టావొ తదితరుల నిరంతర కృషివల్ల సాహిత్య పరిశోధక మండలి, ఆ రోజుల్లో చైనా సమాజ పరిస్థితులను ప్రతిబింబించే అనేక రచనలను ప్రకటించ గలిగింది. ఆధునిక చైనా సాహిత్య అభివృద్ధిపై దీని ప్రభావం చాలవుంది. సృజనాత్మక సాహిత్య సమితి సభ్యులలో కూమో-జో, యుటా-ఫూ, చెంగ్ ఫాంగ్-వూ అత్యంత ప్రముఖ పాత్ర నిర్వహించారు. శిధిలమౌతున్న ఫ్యూడల్ శక్తులకు వ్యతిరేకంగా జరిగే ప్రతిఘటనను కీర్తించుతూ వారు వ్రాసిన

రచనలు, తమ మాతృభూమికి దివ్యమైన భవిష్యత్తును ఆశించే యువక మేధావులందరినీ ఆకర్షించాయి.

1924 లో పెకింగ్ నగరంలో స్థాపించబడిన 'టాట్లర్ సొసైటీ' (వదరుబోతుల సమితి)లో లూసన్ సభ్యుడుగా వుండేవారు. మరుసటి సంవత్సరం లూసన్ కొంత మంది యువకులతోకలసి విల్డ్‌ర్‌నెస్ సొసైటీ (కాటి సమితి)ని స్థాపించాడు. అకుంఠిత దీక్షతోనూ, రచనాసామర్థ్యం ద్వారాను సాహిత్య రంగంలో నూతన శక్తుల పాదుర్భావానికి లూసన్ కారకుడయ్యాడు.

మే 30 వుద్యమం చెలరేపిన విప్లవతుఫాన్‌లో చాలమంది రచయితలు పోరాటం లోకి వచ్చారు. ఇందువల్ల కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన వృద్ధిపొందుతున్న విప్లవోద్యమంతో సాహిత్య విప్లవానికి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి.

1918–1925 సంవత్సరాల మధ్య లూసన్ 20 కథలకుపైగా వ్రాశాడు. అవి "ఆయుధాలకు పిలుపు" "తిరగబడు" అనే పేర్లతో రెండు సంపుటాలుగా ప్రకటించబడ్డాయి.

మొదటి సంపుటిలోవున్న "ఎహ్‌క్యూ నిజమైన కథ" యాసన్ కృషికి ప్రాతినిధ్యం వహించే చక్కని రచన. 1911 విప్లవ సంఘటనలను ఆధారంగా చేసుకుని, కాందిశీకుడుగా తిరుగుతున్న అలసిపోయిన రైతు జీవితాన్ని యీ కథలో చిత్రించాడు. అర్ధవలస అర్ధబానిస సమాజంలో రైతులు అనుభవించే బానిసత్వం, దారిద్ర్యాలను వర్ణించాడు. భూస్వామ్యవర్గ క్రూరత్వాన్ని, కుళ్ళుకంపును బట్టబయలుచేశాడు. 1911 విప్లవంలో తగు సన్నాహాలు జరుగనందుకు విమర్శించాడు.

"ఆయుధాలకు పిలుపు" "తిరుగబడు" అనే రెండు సంపుటాలలోని లూసన్ రచనలు ఆధునిక చైనాలో వాస్తవిక సాహిత్యానికి పునాదులువేశాయి.

1921 లో కూ మో-జో వ్రాసిన పద్యాలు "దేవతలు"అనే పేరుతో ఒక సంపుటిగా మొదటిసారి ప్రకటితమయ్యాయి,

2

మొదటి విప్లవ అంతర్యుద్ధం తరువాత సాహిత్యోద్యమం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన అభివృద్ధి చెందింది. అపుడు చైనాలోని రచయితలు, కళాకారుల్లోరెండు గ్రూపులు వుండేవి. ఎర్రసైన్యంతోపాటు విప్లవ కేంద్రాలలోని ప్రజలలోవుండి పనిచేసే

వారు ఒక గ్రూపు. కొమింటాంగ్ ప్రాంతాలలో లూసన్ నాయకత్వాన పనిజేసే వామ పక్ష రచయితల సంఘం రెండోది.

చైనా వామపక్ష రచయితల సంఘం 1930 మార్చిలో షాంఘైనగరంలో స్థాపించ బడింది. దీనిలో లూసన్, మావో టున్‌లతోసహా 50 మందికిపైగా విప్లవరచయితలు సభ్యులుగా వుండేవారు. ఈ సంఘ ప్రారంభ సమావేశంలో "సిద్ధాంత కార్యక్రమా"న్ని ఆమోదించింది. శ్రామిక ప్రజల విమోచనానికి తోడ్పడటం విధ్యుక్త కర్తవ్యంగా స్వీకరించాలని యిందులో స్పష్టంగా ప్రకటించింది. సంస్కృతీ విప్లవంలో యిది మరొక ముందడుగును ద్యోతకం చేస్తుంది.

కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన వామపక్ష రచయితలు లూసన్ చుట్టూ సమీక రించబడి, తమ కార్యక్రమానికి అనుగుణంగా పోరాటాన్ని పెంపొందించారు. జపాన్ దురాక్రమణ ప్రతిఘటన కొరకు, ప్రజాస్వామ్యం కొరకు జరిగే ప్రజాపుద్యమంలో రచ యితల సంఘం పాల్గొన్నది. కళలు, సాహిత్యాన్ని గురించి మార్క్సిస్టు సిద్ధాంతాలు ఏమి చెబుతున్నాయో అధ్యయనం చేయడానికి గ్రూపులను ఏర్పరచింది. సాహిత్యదీపిక (గైడ్ టు లిటరేచర్), స్ప్రౌట్స్(మొలకలు), పయినీర్స్, లోడ్‌స్టార్(ధృవతార) వగైరా సాహిత్యపత్రికలను నడిపారు. వరుసగా నవలలను, గేయాలను, నాటకాలను ప్రకటించారు, యువక రచయితలను చాలమందిని తర్ఫీదు చేశారు.

వామపక్ష రచయితల సంఘం కొమింటాంగ్ ప్రభుత్వ నిర్బంధ విధానానికి గుర యింది. సంస్కృతీ కార్యకలాపాలలో విప్లవ కృషిని కించపరచడానికి కొమింటాంగ్ శాయశక్తులా ప్రయత్నించింది. సంఘం ప్రకటించే పత్రికలను ఆపుజేయవలసిందిగా అధికారులు ఉత్తర్వులిచ్చారు. వామపక్ష రచయితల గ్రంథాలను నిషేధించారు. చాల మంది విప్లవ రచయితలను నిర్బంధంలో వుంచారు. మరికొందరిని రహస్యంగా చంపారు. లూసన్ చివరి సంవత్సరాలలో అరెస్టుచేసే ప్రమాదమో చంపే ప్రమాదమో సంభవించుతుందని ఎదురుచూస్తూ ప్రతిరోజూ గడుపవలసి వచ్చింది.

ఐనప్పటికీ రచయితల సంఘం పోరాటాన్ని సాగించింది. సభ్యుల సంఖ్యను పెంచుకోగలిగింది. శ్రామిక విప్లవ సాహిత్యాన్ని అభివృద్ధి చేసింది.

1936 లో కమ్యూనిస్టుపార్టీ పిలుపునందుకుని, ఈ సంఘం తనంతట తానే స్వయంగా రద్దుచేసుకుంది. [తన సహచరులందరినీ కలుపుకొని, జపాన్ వ్యతిరేక జాతీయ ఐక్య సంఘటన ఉద్యమాన్ని బలపరచింది.

3

మొదటి విప్లవం అంతర్యుద్ధం అనుభవాలు లూసన్ కళ్లు తెరిచాయి. శ్రామిక విమోచనం యెడల ఆయన విశ్వాసం బలపడింది. ప్రజాతంత్ర విప్లవకారుడు త్వరలో కమ్యూనిస్టు వీరుడుగా మార్పుచెందాడు.

తన పోరాటంలో లూసన్‌కు కమ్యూనిస్టుపార్టీ తోడ్పాటువుంది. 1931 లో చు చియు-పాయ్ అను ప్రముఖ విప్లవకారుడు, సాహిత్యవేత్త, కమ్యూనిస్టు షాంఘై నగరం చేరాడు. వామపక్ష రచయితల సంఘాన్ని ఎలా నడపాలో లూసన్ ఆయనతో చర్చించాడు. రచనలు సాగించడంలోనూ, విదేశ సాహిత్య గ్రంథాలను అనువదించ డంలోనూ చూ సహకారం తీసుకున్నాడు. వారుభయులూ పరస్పరం సహాయం చేసుకున్నారు. ఇద్దరిమధ్య గొప్ప ధృఢమైన స్నేహం ఏర్పడింది.

కమ్యూనిస్టుపార్టీ తోడ్పాటుతో లూసన్ బలం సమీకరించుకున్నాడు. ప్రతీఘాతుక పరిపాలనక్రింద కటిక చీకటి రోజుల్లో ప్రాణాపాయం యెదుర్కొంటున్నప్పటికీ విప్లవ సాహిత్య జెండా ప్రతిష్ఠను కాపాడాడు. కొమింటాంగ్ పరిపాలనను నిశితంగా విమర్శించుతూ వ్యాసాలు వ్రాశాడు. సోవియట్ యూనియన్ సాధించిన విజయాలను ప్రశంసించాడు. సృజనాత్మక రచనల్లోనూ, పోరాటంలోనూ యువరచయితలకు మార్గదర్శిగా సహాయపడేవారు. 1928 నుంచి 1936 వరకు లూసన్ వ్రాసిన అనేక వ్యాసాలు తొమ్మిది సంపుటాలుగా ప్రకటించబడ్డాయి.

ఆ దశలో **కమ్యూనిస్టు పార్టీ చొరవతో జరిగిన రాజకీయ పోరాటాల్లో లూసన్ ఆతురతతో పాల్గొన్నాడు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని బేషరతుగా బలపరచేవాడు.** చైనా విప్లవ విజయంపై పూర్తి విశ్వాసం ఆయనకు వుంది. సుదీర్ఘ యాత్రను పూర్తిచేసి ఎర్రసైన్యం ఉత్తర షెన్సీకి చేరినపుడు ఆయన వెంటనే తన అభివందనాలను తంతిద్వారా మావో త్సే-టుంగ్‌కు పంపాడు.

1936 అక్టోబరు 19వ తేదీన షాంఘైలో లూసన్ మరణించినపుడు చైనా ప్రజలు చాల విచారపడ్డారు. చైనా జాతీయ సంస్కృతికి యుగపురుషుడైన ఆయనకు అన్నితరగతుల ప్రజలు జోహారులర్పించారు. "జాతి అంతరాత్మ" అనే శీర్షికతో కీర్తిశేషుని శవపేటకను అలంకరించారు.

వామపక్ష రచయితల సంఘ సృజనాత్మక కృషికి, మావో టున్ రచించిన "అర్థరాత్రి"అనే నవల ప్రాతినిధ్యం వహించుతుంది. 1932 లో పూర్తయిన యీ నవల్లో షాంఘైలో నివసించుతున్న జాతీయ పెట్టుబడిదారీ యితివృత్తానికంతటికి కేంద్ర పాత్రగా వుంటుంది. సామ్రాజ్యవాదుల దురాక్రమణ ఫలితంగానూ, అర్థవలస అర్థ

ఫ్యూడల్ పరిస్థితులవల్లనూ చైనాదేశం పెట్టుబడిదారీ పద్ధతిలో అభివృద్ధిచెందడంలేదనీ, క్రిమక్రిమంగా మరింత వలస బానిసత్వంలోకి దిగజారిపోతూందని, జాతీయపెట్టుబడి దారీ వర్గాన్ని అంధకారబంధురమైన భవిష్యత్తు ఎదుర్కొంటూందనీ రచయిత నిరూపించాడు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన కార్మికులు, రైతులు, సామ్రాజ్యవాదాన్ని ఫ్యూడలిజాన్ని, ఓడించి, చైనా విప్లవ విజయాన్ని సాధించి తీరుతారనీ నవల ద్వారా మావో టున్ నిరూపించగలిగాడు.

4

చైనా కళాకారులు, సాహిత్యవేత్తలు ప్రతిఘటన యుద్ధాన్ని అత్యంత వుత్సాహంతో బలపరచారు. యుద్ధరంగాలకు, పల్లెటూళ్లకు వెళ్ళి, యుద్ధకాలపు ప్రజా సంస్థలలో చేరారు. జపాన్ దురాక్రమణను ప్రతిఘటించాలనీ, జాతీయ విమోచనకు కృషిచేయాలనీ, ప్రచారంచేశారు. షాంఘైనగరాన్ని యుద్ధజ్వాలలు అలముకొన్నపుడు స్థానిక నాట్యకారులు 13 దళాలుగా ఏర్పడి, జాతీయ విమోచన వుద్యమాన్ని బలపరుస్తూ ప్రదర్శన లిచ్చారు. ఊహాన్ నగరం పతనానికిముందు నటకులు, యువరచయితలు, పది నాట్యసంఘాలుగాను, ఐదు ప్రచారక దళాలుగాను సంఘటిత మయ్యారు. తీవ్రమైన చిక్కులు, ప్రమాదాలు ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని అధిగమించి, వివిధ యుద్ధరంగాలకు వెళ్ళి, సైన్యాలముందు, ప్రజలముందు ప్రదర్శనలిచ్చారు.

1938 వ సంవత్సరం మార్చి నెలలో కళాకారుల, సాహిత్యవేత్తల అఖిల చైనా ప్రతిఘటన సంఘం హాన్‌కౌ నగరంలో ఏర్పడింది. ఈ సంఘం కోమో-జో, మావొటున్‌లతో సహా 45 మంది సభ్యులుగల కార్యనిర్వాహకవర్గాన్ని ఎన్నుకొంది. ఇది ప్రతిఘటనయుద్ధాన్ని బలపరచే రచయితలందరినీ సమీకరించింది. "**రైతులు, సైనికులవద్దకు సాహిత్యాన్ని తీసుకువెళ్ళండి**" అన్న నినాదాలతో రచయితలను యుద్ధరంగానికి పంపింది. **సైనికులతోనూ ప్రజలతోనూ** సాహిత్య కారులు సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకోవాలని కార్యక్రమం యిచ్చింది. "ప్రతిఘటనా సాహిత్యం" అనే పత్రికతో సహా చాలా సాహిత్య పత్రికలను ఈ సంఘం ప్రకటించింది. ప్రతిఘటన యుద్ధాన్ని కీర్తించుతూ, రాజీబేరాలను, లొంగుబాటును వ్యతిరేకించుతూ, అభివృద్ధి నిరోధకుల దుర్మార్గపాలనను ఏవగించుతూ అనేక పుస్తకాలను ప్రకటించింది. కొమింటాంగ్ ప్రభుత్వం అనేక ఆటంకాలను పెడుతున్నప్పటికీ, రచయితల సంఘం చైనా ప్రజా విప్లవం జయప్రదమయ్యేవరకు నిరంతర పోరాటం సాగించింది.

ప్రతిఘటన యుద్ధం మొదటి సంవత్సరాలలో చైనా కళాకారులు, సాహిత్య వేత్తలు అనేక కథానికలను, రిపోర్టులను, ప్రచార నాటకాలను, గేయాలను, జపాన్ వ్యతిరేక పాటలను తయారు చేశారు. ప్రజామోదకరమైన రచనలతో సైన్యాన్ని ప్రజలను ఉత్తేజపరచారు. యుద్ధం కొనసాగేకొలదీ చియాంగ్ కై-షేక్ ముఠా జపాన్ యెడల ఉపేక్షాభావాన్ని, కమ్యూనిస్టుపార్టీపై తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శించసాగింది. ఈ పరిస్థితులలో కొమింటాంగ్ పాలితప్రాంతాలలో అభివృద్ధి నిరోధకుల దేశద్రోహ పాత్రను బట్టబయలుచేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రతిఘటన సాహిత్యం తీసుకుంది.

'బంగారు వృక్షం', తదితర నవలల్లో షాటింగ్ అనే రచయిత కొమింటాంగ్ పరిపాలనక్రింద వున్న పల్లెప్రాంతాల్లోని ఘోర పరిస్థితులను చిత్రించాడు. "శిథిలం" (corrosion) అనే నవల్లో మావోటున్ కొమింటాంగ్ ప్రభుత్వంలో పోలీసు హింసా కాండను బయటపెట్టి, యువకులను కళ్మలం చేయడాన్ని నిరసించాడు.

1942 ప్రాంతంలో కోమో-జో ఆరు చారిత్రక నాటకాలను వ్రాశాడు. అందులో ముఖ్యమైన "చు యువాన్", "పెద్దపులి ఆట" అను నాటకాలద్వారా లొంగుబాటు తత్వాన్ని, జాతి విచ్ఛిత్తిని తీవ్రంగా నిరసించి, జాతీయైక్యతను న్యాయంకొరకు పోరాటాన్ని కీర్తించాడు,

కమ్యూనిస్టు పార్టీ సర్వతోముఖ సహాయంతో విముక్తి ప్రాంతాలలో ప్రతిఘటన సాహిత్యం చాల తయారయి ప్రజలను అద్భుతంగా ఉత్సాహపరిచింది.

1942 మే నెలలో ఎనాన్ వేదికనుంచి కళలు సాహిత్యంపై మావోత్సే-టుంగ్ ఉపన్యాసాలిచ్చాడు. కార్మికులను, రైతులను, సైనికులను ఉత్తేజపరచే విప్లవ సాహిత్యం ఏవిధంగా వుండాలో నిర్వచించాడు. విప్లవకారులైన కళావేత్తలు, సాహితీపరులు, మేధావులు నూతన దృక్పథాన్ని అలవరచుకోవాలనీ, కార్మికుల, రైతుల, సైనికుల సేవలో నిమగ్నులు కావాలనీ గుర్తుచేశాడు. చైనా కళలు, సాహిత్యం పెంపొందడంలో మావో ఉపన్యాసాల్లో చారిత్రిక ప్రాముఖ్యతవుంది. నూతనదశలో సోషలిస్టు వాస్తవికతపై ఆధారపడిన సాహిత్యసృష్టికి ప్రాతిపదిక వేశాయి. ఈ గ్రంథ ప్రచురణవల్ల విముక్తప్రాంతాలలో కళారూపాలు, సాహిత్యసృష్టి ఎంతో వికసించాయి.

1943-45 సంవత్సరాల మధ్య చావో-షూలీ మూడు నవలలు వ్రాశాడు. "హ్సియోహా ఎర్‌హీయి వివాహం" అను నవల్లో రైతు దంపతుల ప్రేమను వర్ణిం

చాడు. కమ్యూనిస్టుపార్టీ కృషి ఫలితంగా ఏర్పడిన సుఖప్రదమైన స్వతంత్ర జీవితాన్ని ప్రజలెంత అభిమానించాలో తెలియజేశాడు. లీయు-ట్సాట్ వ్రాసిన గేయాలలోనూ, "లీ గ్రామంలో మార్పులు" అనే నవల్లోను భూస్వాములకు వ్యతిరేకంగా రైతుల పోరాటాలు చిత్రించబడ్డాయి. కళలు, సాహిత్యంపైన మావో సిద్ధాంతాలను అమలు జరుపుటద్వారా సాధించిన ప్రథమ విజయాలను ఈ గ్రంథాలు సూచించుతాయి.

1945 వ సంవత్సరంలో హోచింగ్-చిహ్, టింగ్-ఈ అను రచయితలు వ్రాసిన "జుట్టు నెరసిన బాలిక" అనే గేయనాటకాన్ని మొదటిసారి ప్రదర్శించారు. బీద రైతు బాలిక విషాదగాథను చిత్రించి, ఆమెను కమ్యూనిస్టు పార్టీ ఎలా విముక్తి చేస్తుందో ఈనాటకం తెలియజేస్తుంది. "పాత సమాజం మనుష్యులను దెయ్యాలుగా చేస్తే, నూతన సమాజం దెయ్యాలను మనుష్యులుగా మారుస్తుంది" అన్న సత్యాన్ని ఈ నాటకం హృదయాన్ని కరిగించే దృశ్యాలతో నిరూపించుతుంది. జాతీయ కళా రూపాన్ని ప్రతిభావంతంగా చిత్రించిన ఈ గేయనాటకం దేశమంతటా ప్రదర్శించబడి, ప్రజలందరిని ఉత్తేజపరిచింది.

‘క్షతగాత్రుల చికిత్సలో అడ్డంకి లేకుండా తొలగించు’ డాక్టర్ నార్మన్

బెతూన్ చైనాలో ఒక బేస్ ఆస్పత్రిని వదిలి మరోచోటికి వెళ్తున్న సందర్భంలో రాళ్ళతోకట్టిన మెట్ల వరుసలో చివరి భాగంలో ఒక చోట రాళ్ళు వూడిపోయి ఖాళీ యేర్పడివుందట; ఆయన దానిమీద నుంచి దూకి అవతలకు చేరాడట; అప్పుడు అక్కడున్న సిబ్బందిలో ఒకర్ని పిలిచి.. "నువ్వు దీనిమీద నుంచి అవతలకి దూకేయటానికి యేమీ అనుకోవు కదా!" అని ప్రశ్నించాడు.

అతను తేలిగ్గా "ఓ! యెంతమాత్రం అనుకోను" అన్నాడు నవ్వుతూ

"మరి చికిత్స పొందుతున్న రోగులమాటో? యిది దూకటానికి వాళ్ళేమయినా అనుకుంటారా?"

అతగాడి పెదాలమీద చిరునవ్వు వెంటనే మాయమైంది. వాళ్ళిద్దరూ కలసి ఒక రాయి మోసితెచ్చి ఆ ఖాళీని పూడ్చారు. ఆ సంఘటన సైనిక వైద్యశాఖలో ఆ నోటా ఆ నోటా పాకి అల్లుకుపోయింది. ఆ సంఘటన ఆధారంగా ఆయన చెప్పిన నీతివాక్యం బహుళవ్యాప్తమైంది. "క్షతగాత్రుల చికిత్సలో అడ్డంకిలేకుండా తొలగించు."

— "రక్తాశ్రువులు" పేజి 230



(గత సంచిక తరువాయి)

9

కువోని కలుసుకునేందుకు చిన్నవాంగ్, చావో బయల్దేరేరు. అతను లీచెన్ చియాంగ్ నూతిదగ్గర ఓ గుర్రానికి నీళ్లు పెడుతున్నాడు. చావోని చూడగానే కువో పళ్ళన్నీ కనిపించేలా నవ్వేడు. అతని కాళ్ళకి జోళ్లులేవు. ఒంటిమీద అతుకులచొక్కా వుంది అతను నీళ్లుతోడుతూంటే చిన్నవాంగ్ గిలకతిప్పడంలో సాయంచేసేడు.

వాళ్లు ఒకళ్ళనొకళ్లు పరిచయంచేసుకున్నాక, పనుందనిచెప్పి ఛావోవెళ్ళిపోయేడు

నీళ్ళన్నీ ఓ తొట్లో పోసేడు కువో. గుర్రంజూలునవరిస్తూ చిన్నవాంగ్‌తో కత్తు కలిపేడు.

ఇంతలో ఒకతను ఓ ఆడగుర్రాన్ని అటుపక్కగా తోలుకెళ్ళేడు. దాంతో కువో గుర్రం సకిలించి తాడు తెంపుకుని, ఆడగుర్రం వైపు పువురికింది. దానివెనకే కువో పరుగెత్తేడు. దాని నున్నటి వీపుమీదికి ఉరికి, రెండుచేతులతో జూలుపట్టుకుని, దాని పొట్టని కాళ్ళతో నొక్కిపట్టేడు. ఆ గుర్రంకాసేపు ఎగిరింది, తన్నింది, సకిలించింది. కానీ చివరికి అలిసిపోయి నీళ్ళతొట్టివైపు నడిచింది.

కువో కిందికిదూకి గుర్రాన్ని నడిపిస్తూ వాంగ్‌తో “దీన్ని మచ్చికసెయ్యడం కాస్త కస్టంగాని బాబూ, కుర్రది అవటాన మాసెడ్డపనిసేస్తది. దీని కాళ్ళు సూద్దూ—సున్నగా, నిటారుగా యెలాగున్నాయో. ఇయ్యాలో రేపో దీని ఇత్తులు తియ్యాల” అన్నాడు.

గుర్రాన్నిగురించే చెప్పుకుంటూ, లీచెన్-చియాంగ్ ఇంటికివచ్చేరు వాళ్ళిద్దరూ. ఇంటిచుట్టూ కంచెవుంది. ఇల్లు చాలా శుభ్రంగా వుంది. ఆ పెద్ద యింటి వుత్తరం

వైపున అయిదు గదులున్నాయి. వాటికి కుడివైపున ఒక మిల్లు, ఒక ధాన్యం కొట్టు, ఎడంవైపున వంటగది, గుఱ్ఱపుసాల వున్నాయి. గుఱ్ఱాన్ని సాలలోకట్టేసి, ఆపక్కనే వున్న తన గదిలోకి తీసుకెళ్లేడు కువో, కాంగ్‌మీద కొంచెం గడ్డీ, రెండు చిరిగిన గోనెసంచులూ తప్ప మరేఁవీలేవు. కువో ఆస్తంతాకలిసి అవే.

"నేనుకూడా వచ్చి నీతో యిక్కడ వుండేదా ?"అన్నాడు చిన్నవాంగ్.

"ఈ గూట్లో సదురుకోగలనంటేరా,"

ఆ మధ్యాహ్నం తన సామాను తెచ్చుకున్నాడు చిన్నవాంగ్. ఆరోజు మొదలు యిద్దరూ కలిసేవున్నారు. చిన్నవాంగ్ మాత్రం భోజనానికి స్కూలుకే వెళ్ళేవాడు. ఇద్దరూ ఒకేవయసు వాళ్ళవటంచేతా, చాలా విషయాల్లో కలవటంవల్లా, తొందర్లోనే మంచిస్నేహితులయ్యేరు. చిన్నవాంగ్ కువోకి చాలా సాయంచేసేవాడు— ఛేలోనూ, కూరగాయల తోటలోనూకూడా రాత్రింబవళ్లు కలిసి వుండడంచేత కువోగురించి చాలా తెల్సుకున్నాడు చిన్నవాంగ్.

పాతికేళ్ళుకూడా నిండని కువోముఖం అప్పుడే ముడతలుపడిపోయింది. పన్నెండేళ్ళ వయసువరకు అతనికి కట్టుకునేందుకు గుడ్డముక్కలేదు. అతని ఎనిమిదోయేటనే తల్లిపోయింది. హాన్‌దగ్గర కంబారిగా కుదురుకున్న అతని తండ్రి కువోని పదమూడేళ్ళకే గుర్రపుసాలపనికోసం తీసుకెళ్ళేడు.

* ఇదంతా పదమూడేళ్ళనాటిమాట. ఆ సంవత్సరాదికి హాన్ పేకాడుతూ, కువో తండ్రిని కూడా ఆటలో చెయ్యికలపమని అడిగేడు. "నానాడలేను" అన్నాడు కువో తండ్రి మర్యాదగా. కాని హాన్ వూరుకోలేదు. కాంగ్ దిగి కువోతో కోపంగా—

"ఏరా, ఒళ్ళు తిమ్మిరిగావుందా ? నేను కావాలని అడుగుతూంటే కాదనటానికి నీకెన్ని గుండెల్రా ?" అన్నాడు.

"బాబయ్యా తఁవర్ని ఏటనాలని కాదు. నాకు సత్తె ప్రమానంగా ఆటరాదు" అన్నాడు కువో తండ్రి నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"నీకెందుకు, నువ్వు ఓడిపోవవి నేను హామీ యిస్తాను. నీకు కొత్తకాబట్టి అదృష్టం బాగుంటుంది. రా, రారా తమ్ముడూ !"

కువో తండ్రికి ఆడక తప్పలేదు. మొదట్లో అంతా బాగానేవుంది. అతను కొంచెం గెలుచుకున్నాడుకూడాను. కాని రోజంతా పనిచేసి అలిసిపోవడంవల్ల తెల్లారు

* 1934 సం॥

తూండగా అతనికి తల తిరిగినట్టయింది. కళ్ళు మూతలు పడసాగేయి. ఇక లాభం లేదని ఆట ఆపి లేచేడు.

"ఏఁవిటీ, డబ్బుచేసుకు పోదామనుకుంటున్నావా? నీ ఎత్తులు యిక్కడసాగవు. నీకే చెప్పేది, కూర్చో. పూర్తిగా తెల్లవారేవరకు ఆడాల్సిందే" అంటూ మండి పడ్డాడు హాన్.

తలతిరుగుతూంటే ఏదో ఆడేసేడు కువో తండ్రి. తను గెలుచుకున్నదంతా ఓడిపోయేడు. ఇంకాపైన తనూ, తన కొడుకు ఏడాదంతా కష్టపడి సంపాదించిన డబ్బు కూడా ఓడిపోయేడు.

తనమీద తనకే కోపం, అసహ్యం పెరుగుతూండగా ఇంటికి వెళ్ళేడు కువో తండ్రి. మర్నాటికి బాగా జబ్బుచేసింది. విపరీతమైన ఆయాసం, దగ్గు, గుండె నొప్పితో చాలా బాధపడ్డాడు.

ఇదంతావిని "ఇతను సంవత్సరాదికే ఎందుకు జబ్బుపడాలో నాకర్థంకావడంలా. ఆ మూలగటం ఆపమని చెప్పు" అన్నాడు హాన్ లీ చింగ్-షాన్‌తో.

మరో రెండు వారాలకు కువో తండ్రి పరిస్థితి క్షీణించింది. ఆరోజు- విపరీతమైన చలిగా వుంది. మంచు ఎక్కువగా కురుస్తోంది. కుర్రాళ్ళు తప్ప అందరూ చలికాచుకుంటున్నారు.

తన వియ్యంకుడు 'తు'*తో కూచుని హాన్ చలికాచుకుంటూండగా, లీ చింగ్-షాన్ గభాలున లోపలికి వచ్చేడు.

"కువో తండ్రి చచ్చిపోతున్నాడు".

"అయితే వెంటనే వాణ్ణి బైటకీడ్చి పారెయ్యండి. ఊఁ, తొందరగా. లోపల చావకుండా చూడండి" అన్నాడు హాన్.

"అవును, లోపల చావకుండాచూడండి" వంతపాడేడు తు. "లేకపోతే ఆ జబ్బు గాలి ఇంటిల్లపాది పీల్చాల్సివస్తుంది."

"తొందరగా పో, వాణ్ణా గదిలోంచి ఇవతలికి లాగెయ్యండి. పోరా, ఇంకా ఏంటి చూస్తున్నావ్?" అని అరిచేడు హాన్.

లీ వెంటనే ఆ పని మరొకడికి పురమాయించేడు.

---

* దుష్టత్రయంలో 'తు' ఒకడు.

కాంగ్‌మీద కూచుంటూ కిటికీ అద్దంమీద వూదేడు హాన్. ఆ వేడిగాలికి అద్దం మీద మంచుకరిగింది. అద్దంలోంచి భవనం ముందున్న ఖాళీజాగా కనిపిస్తోంది.

మంచు చాలా ఎక్కువగా పడుతోంది. గాలికూడా ఎప్పటికంటె తీవ్రంగావీస్తోంది.

"ఏఁవర్రా, ఇంకా లాగరేం బైటికీ?" కిటికీ అద్దంమీద కొడుతూ గట్టిగా అరిచేడు హాన్.

వాళ్ళగదిలో– కువో తండ్రిమీదికి ఒంగి ఛాతీరుద్దుతున్నాడు. తండ్రి కళ్ళుతెరిచి.

"బాబోరే, నా పనయిపోనాదిరా" అని గొణిగేడు. ఇంకా ఏదో చెప్పాలను కున్నాడు గాని అతనికి గొంతు పెగల్లేదు.

కువోని పక్కకి తోసేస్తూ "తప్పుకోరా" అని కసిరేడు లీ. కాంగ్ చివర్న ఓ బల్ల పెట్టేరు– లీ, మరో కంబారి.

"ఏటి బాబూ తఁవరు సేస్తాంది?" అన్నాడు కువో కళ్ళు తుడుచుకుంటూ. అతని మాటలు ఎవరూ పట్టించుకోలేదు.

"భుజాలుపట్టి వాణ్ణి పైకిలేపు" అన్నాడు లీ, వచ్చిన మనిషితో. వెంటనే కువో తండ్రిని బల్లమీదికెక్కించి, బైటికి తీసుకుపోయేరు. అంతసేపూ కువో ఏడుస్తూనే వున్నాడు.

"బాబ్బాబు, పైకి ఒట్టుకుపోకండిబాబూ. సలిలో సస్తాడు. కనికరించండిబాబూ"

"పోయి హాన్‌బాబుని దేబిరించు" అన్నాడు లీ, తనకేమీ పట్టనట్టుగా.

కువో తండ్రిని ప్రహరీ గోడబైట పడేసేరు. కొద్దిసేపటికే అతను చలికి గడ్డకట్టుకు పోయేడు.

కువో ఏడుస్తూ తండ్రి గుండెలు రుద్దుతూనే వున్నాడు. అతని వేడి కన్నీళ్ళు పడి, మంచులో రెండు కన్నాలు పడ్డాయి.

"అయ్యా, నన్నొగ్గేసి ఇలాగ దిక్కులేని సావుసచ్చావేట్రయ్యా! నానేటి సేస్తున్రా?" అంటున్నాడు తండ్రి ఛాతీని యింకా రుద్దుతూనే.

చుట్టుపక్కల వున్నపనివాళ్ళు అంతా వచ్చి శవంచుట్టూ నిల్చున్నారు. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. కానీ కొందరు కళ్ళు తుడుచుకున్నారు; మరికొందరు "వూరుకోరా బాబూ, వూరుకో" అన్నారు.

అంతకంటె ఏఁవనాలో ఎవరికీ తెలీలేదు.

హాన్ మళ్ళీ మొరగసాగేడు "వాణ్ణి బైటికి గెంటెయ్యండి. ఇక్కడ ఏడవ టానికి వీల్లేదు."

కువో ఏడుపు ఆపేడు. అంత్యక్రియలకోసం కొంత డబ్బు పోగుచేసేరు పని వాళ్ళంతా. శవాన్ని తీసుకుపోయి వూరికి వుత్తరాన పాతిపెట్టేరు.

ఉగాది పండగ అయిపోయిందో లేదో కువోని బైటికిగెంటేసేరు. ఏవో చిన్న చిన్న పనులుచేస్తూ తనపొట్ట పోషించుకున్నాడు. మరో ఆరేళ్ళకి కంబారిగా కుదురు కున్నాడు. పొద్దస్తమానం అదేపనిగా రెక్కలు ముక్కలు చేసుకునేవాడు.

కువో మళ్ళీ హాన్ కంటబడ్డాడు.

"కువో చాలా మంచివాడు. వాడిని చిన్నప్పుడే నేనెరుగుదును. 'అయ్యే చెట్టు ఆకులే చెప్తాయి' అన్నట్టు ఎవడు ఎలాంటివాడవుతాడో చిన్నప్పుడే చెప్పలేమా !" అన్నాడు హాన్ నవ్వుతూ. అవునుమరి, అది హాన్‌కే తగును. నీతో అక్కరవుంటే, నిన్ను పీల్చి పిప్పిచేయాలంటే ఓ చల్లని చిరునవ్వు పారేస్తాడు. అక్కర తీరిపోయేక అవ తారమే మార్చేస్తాడు. చిరునవ్వు చెరిపేసుకుని, నీ పాటికి నిన్నొదిలేస్తాడు.

కువోకి హాన్ సంగతి బాగా తెలుసు. పైగా తన తండ్రి ఎలాగ చచ్చిపోయేడో కూడా మర్చిపోలేదు. కానీ అప్పుడే తాంగ్‌దగ్గర ఒస్తుందనుకున్న పని రాలేదు. ఉన్న జానెడు పొట్ట ఎలాగో ఒకలాగ నింపాలికదా ;

హాన్ అదును కనిపెట్టేడు :

"మనం పాతనేస్తాలమేగా బాబూ. నువ్వు నాదగ్గరపనికి కుదురుకో. నీకు పని తక్కువ, జీతం ఎక్కువ ఇస్తాను. నీకెంతకావాలో అడుగు."

"ఏడాదికి ఆరొందలు" అన్నాడు కువో, హాన్ ఎలాగూ ఒప్పుకోడు అనుకుంటూ.

"సరే, నువ్వడిగేక నేను కాదనటమా ? నీకు ఏడాదికి ఆరొందలు ఖాయం" అన్నాడు హాన్ ఎంతో మంచిగా :

"అంతా ఒక్కసారే ముట్టజెప్పాల" అన్నాడు కువో మళ్ళీ.

"అదంతా తర్వాత చూసుకుందాం లేవయ్యా" అన్నాడు జిత్తులమారి హాన్.

కువో మళ్ళీ హాన్‌కి వూడిగం మొదలెట్టేడు. తన తండ్రి గుర్తొచ్చే ప్రదేశా లన్నీ తప్పించుకుతిరిగేడు— ఆ చిన్నగదివైపుకి వెళ్ళేవాడుకాదు, తనతండ్రి చచ్చిపోయిన తలుపుదగ్గర నిల్చునేవాడుకాదు. కోడికూతకి ముందే పొలంవెళ్ళేవాడు, బాగా పొద్దు పోయేక తిరిగివచ్చేవాడు. ఎండనక, వాననక కష్టపడి పనిచేసేవాడు.

కానీ ఆ ఏడాది చివర్న ఏఁవయింది. హాన్ కువోకి యివ్వాల్సిన జీతం యివ్వలేదు. ఓ మాంచి పందినేసి అందులో సగం కంబార్లందరికి పంచిపెట్టేడు. కువో వాటాకి ఐదుకిలోలు వచ్చింది.

"తీస్కోండి, తీస్కోండి. సంవత్సరాదికి సంకటి ఒండుకోవచ్చు. ఇది ఎంత బాగుందోచూడు. ఇలాంటిది నీకు బజార్లో దొరుకుతుందా ? లేలే, ఏదో నిలవసరుకు కొడతాడు నీ ముఖాన."

నక్క కోడిపిల్లకాడికి మెల్లగా నడిచినట్టనిపించింది కువోకి. హాన్ యిచ్చేది పుచ్చుకోవద్దనుకున్నాడు.

"నువ్వు తీసుకోకపోతే నన్నుకాదన్నట్టే" పళ్లు బిగించి మరీ అన్నాడు హాన్.

"సరే బాబూ, తీసుకుంతాను"అన్నాడు కువో అయిష్టంగానే.

అలా మొదటి సంవత్సరం ఆయిపోయింది.

రెండోఏడు మొదలయింది. కువోకి యిదేమి నచ్చలేదు. కాని పూటగడవని వాడికి యిష్టాయిష్టాలుకూడానా ?

కువో చొక్కా బొత్తిగా పీలికలై పోయింది. కొత్త చొక్కా కుట్టించుకోవాలి. మొదటేటిజీతం అడగడానికి హాన్‌దగ్గరకు వెళ్ళేడు.

"ఏఁ, ఇంకేంకావాలి ?"అన్నాడు హాన్ ఓరగాచూస్తూ.

"కిందటేడంతా నీకాడ ఎండా వానా అనక పన్జేసేను"కోపంగా అన్నాడు కువో.

"నేనిచ్చిన పందిమాంసం మెక్కలేదూ ? ఇంకా డబ్బు కావాల్రా, డబ్బు ?"

కువోకి నోటమాటరాలా. వెంటనే గొడ్డలికోసం వంటింటివేపు పరుగెత్తేడు. కాని హాన్ అంగరక్షకుడు అడ్డుకున్నాడు.

"ఏట్రా కమ్యూనిస్టూ, ఏటి నువ్వు చేస్తోంది ?"

కీలుబొమ్మ మంచుకోప్రభుత్వం హయాంలో "కమ్యూనిస్టు"ని పిలిపించుకోవడ మంటే ఏదో మూడిందన్నమాటే.

ఇంతలో తుపాకితో హాన్ ముందుకొచ్చేడు.

"కదలకురా లంజికొడకా !"

"వెధవ !" అన్నాడు మొరిటాతారో, లోపల్నుంచివస్తూ, హాన్‌కి తోడుగా తిడుతూ నించున్నాడతను. కువో లోపలవుడికిపోతున్నా నిస్సహాయంగా చూస్తుండిపోయేడు

"బైటికిపో ! ఇంకా ఏటిచూస్తున్నావ్, తగలాలేట్రా ?"అన్నాడు అంగరక్షకుడు

పద్నాలుగు నెలలు గొడ్డుచాకిరీ చేసినందుకు కువోకి దక్కింది ఐదుకిలోల పంది మాంసం! మర్నాడే అతన్ని * లేబరుకేంపుకి పంపేసేరు. • నిరుడు జపానోళ్లులొంగిపోయేక కువో తిరిగి వచ్చేడు.

తనకథముగించి, చిన్నవాంగ్‌తో ఇలా అన్నాడు కువో:

"హాన్ మా నాయనకీ, నాకూకూడ చెరుపేచేసేడు. అంతే ఏటి? రెండుతరాల కాణ్ణించీ ఆడు మా శతుౖవే."

"మరయితే ఆరోజు మీటింగులో అంతా బైటపెట్టలేదేం?" అన్నాడు వాంగ్.

"ఆడితాలూకు అంతా దిగిపోనారుకదా మీటింగుకి— అన్నదమ్ములూ, ఆడిమంచి కోరేటోల్లు, ఆల్ల మంచి కోరుకునేటోల్లు, సుట్టాలు, పక్కాలు— ఒకలేటి, అంతా కళ్ళెరౖజేసేసినారు. ఒంటిగా ఏటిసేసీది బాబూ? బాజాకరౖలేందే బజింతీౖలు ఏటి సెయ్యగలవ్ బాబూ?"

"మీరంతా ఏకమై ఎందుకు ఎదిరించారూ? మీలో గట్టివాళ్ళనీ, లీ, హాన్‌లవల్ల దగాపడ్డవాళ్ళనీ కూడగట్టుకోవాలి. కలిసికట్టుగా వుంటేనే బలం తెలుసా?"

"మనం సెప్పేది నమ్మేవాళ్ళని నీకు చూపేదా? అందులో మొట్టమొదాటివాడు మా 'పాయి'. ఊరికి దక్సినాన వుంటాడు" అన్నాడు కువో, తన స్నేహితుణ్ణి తల్చుకుంటూ.

"పద, పద. తప్పకుండా కల్సుకుందాం" అన్నాడు చిన్నవాంగ్ ఎంతో ఉత్సాహంగా. కాంగ్‌మీదినుంచీ దూకి కువోని వెంట లాక్కుపోయేడు.

పాయికి కొంత మెట్టవుంది. "ఈ బంజరు బూ(విలోకి చుంచులుకూడా రావు" అంటూంటాడతను. కీలుబొమ్మ ప్రభుత్వంలో పన్నులకిందే తన నేలంతా పోయింది. కాని తినేందుకూ, కట్టుకునేందుకూ చాలదని ఎప్పుడూ బాధపడలేదు. పాయి ఎంత మంచివాడో అంత బద్ధకస్తుడు. అతని నిదౖకి రోజంతా సరిపోయేదికాదు. వానాకాలంలో పని సాగదనీ, పంటపాడవుతుందేమోననీ రైతులందరూ భయపడితే, పాయి మాత్రం వానొస్తే నిదౖపోవచ్చు గదా అని సంబరపడేవాడు!

"నీకేటయ్యా, ఇప్పుడు తల్సుకుంటే నిద్రపోగలవు. నువ్ ఎవర్ని పట్టించుకుంటావులే" అని ఓసారి ఎవరో అన్నారు. కాని అతని భార్య వున్నగదిలోకి తొంగి చూసేడు పాయి.

---

* మిషాన్‌లో వున్న లేబరుకేంపు.

• ఆగస్ట్ 15, 1945

అతను ఎంత బద్ధకస్తుడో అతనిభార్య అంత చలాకీ మనిషి. అందుకే పాయికి ఆవిడంటే కొంచెం భయం. ఆవిడ ఇంటిపనులు ఎంతబాగా చూసుకోగలదో, పొలం పనులు అంతకన్నా బాగా చేయగలదు. నాట్లువెయ్యడంలోనూ, కోత కొయ్యడంలోను ఆవిడ మంచి నేర్పరి. తనచేతగానితనంవల్ల, ఆమె నేర్పరితనంవల్ల పాయి ఆమెతో మొదటి తగువులోనే ఓడిపోయేడు. తన పరువు నిలబెట్టుకోవడానికి ఎన్నిమార్లు ప్రయత్నిస్తే అన్నిమార్లూ దెబ్బతిన్నాడు. చివరికి ఆమెదే పైచేయి అయింది.

ఓరోజు పాయి, అతనిస్నేహితులు కూచుని పిచ్చాపాటీ మాటాడుకుంటూండగా ఎవరో కొంటెగా

"ఇక్కడ పెల్లానికి జడిసీది ఎవరాి ?" అన్నారు.

"సెప్పండెహె. నిజం సెప్పేందుకు సిగ్గేటి ? సెప్పండి"అన్నాడు మరొకడు.

"పాయొరే, నిజం సెప్పరా. పెల్లానికి నువ్ కాదట్రా జడిసీది ? ఏఁవరాి, మీరేటంతారు ? నానన్నది రైటేనా ?"అన్నాడు మొదటివాడు మళ్ళీ.

"ఏట్రా ఏటి ? మాటలు జాగర్తాగా రానీ. నానేటి, ఒకలకి జడిసీదేటి ?" అన్నాడు పాయి కొంగుమీంచి కిందికిదూకుతూ.

ఇంతలో ఎవరో అట్టకాడ పుచ్చుకొచ్చేరు. ఇంకెవరు, స్వయానా పాయి సతీమణిగారే.

"ఇక్కడనచ్చేవా ఎదవా ? పొయ్యిలోకి కట్టెముక్క నేదు, తొట్టిలోకి నీటిసుక్క నేదు. ఈడసేరి మజానేస్తన్నవ్రా, మజా ?"అంటూ దులపాల్సిన నాలుగూ దులిపేసిందావిడ. చిన్నగా గొణుగుతూ ఆమెవెంట నడిచేడు పాయి. అంతా గొల్లుమన్నారు.

పదేళ్ళకిత్రితం యీవూరొచ్చేడు పాయి. అప్పట్లో అతను బాగా కష్టపడేవాడు ఏభై ఎకరాల బంజరు సాగుచేసేడు. ఎకరానికి రెండుపుట్లదాకా రాలేది. ఆ ఏడాదే తను పెళ్ళిచేసుకున్నాడు. ఆ మరుసటిఏడాది పొలంమీదికి హాన్ గుర్రాలు దిగిపోయేయి. చాలావరకు పంట నాశనం చేసేయి. దాంతో పాయికి, హాన్‌నౌకరుకి పెద్ద తగువయిపోయింది.

అది విని పాయి యింటిమీద దిగబడిపోయేడు హాన్. తన పొన్నుగర్రితో అందిన కుండలూ, బొచ్చెలూ, జాడీలూ అన్నీ చితగ్గొట్టేసేడు. వచ్చినపనయిపోయేక మారుమాటలేకుండా గుర్రంమీద యింటికి పోయేడు. ఊరిపెద్దలతో ఫిర్యాదు చేసేడు పాయి. కాని పట్టించునే నాథుడే లేకపోయేడు. అందుకని జిల్లాకోర్టుదాకా వెళ్ళేడు పాయి.

నల్లమందుదీపం పక్కన కూచున్న హాన్ యిది విని నవ్వుతున్నాడు.

"ఓహో, నామీదికే కేసుతెచ్చేటంత మొనగాడయిపోయేడన్నమాట. సరే, కడుపులో చల్ల కదలకుండానే వాడిపని పట్టిస్తాను. నాకయితే మేస్త్రీటుకి పుత్తరం రాయటానికి ఖర్చేంఅవదు. కానీ యీ పాయిగాడిదగ్గర ఎంతడబ్బు మూలుగుతోందో చూద్దాం"

కీలుబొమ్మ మెజిస్ట్రేటు పాయిని పరువునష్టందావాకింద అరెస్టుచేసి, జిల్లాజైల్లోకి తోసేడు. అతన్ని విడిపించటానికి అతని భార్య నలభై ఎకరాలు అమ్మాల్సివచ్చింది. ఈ నలభై ఎకరాలూ హాన్‌చేతిలోకి పోయేయి పాయికి మిగిలిందల్లా పదెకరాలరాతినేల.

ఉన్నట్టుండి పాయి బద్ధకస్తుడై పోయేడు. "నాకు పేణం నిలిసేటంత వుంటే సాలును. మరేటి అక్కరనేదు"అనసాగేడు. బాగా పొద్దెక్కేదాకా కాంగ్‌మీంచి దిగే వాడుకాదు. వానాకాలం కోసం ఎదురుచూస్తూండేవాడు— ఎందుకు, నిద్రపోయేందుకు!

మధ్యాన్నాలు భోజనంవేళ తప్పించేసేవాడు. ఓరోజు అతనిభార్య భోజనంతెచ్చే సరికి నాగలిచాలులో నిద్రపోతూ కనిపించేడు. మరోరాత్రి పాయి ఎంతకీ యింటికి రాలేదు. అతనిభార్య కంగారుపడి అట్లకాడపుచ్చుకుని బయల్దేరింది— అతన్ని వెదికేం దుకు. మిగతా కూలీలనీ, పందులకాపరినీ, బండివాడినీ అందరినీ అడిగింది. కాని 'మాకుతెలీదం'టే 'మాకుతెలీద'న్నారు అందరూ. ఆవిడకి కంగారు పెరిగింది. ముందు అట్లకాడ కిందపారేసి పక్కవాళ్ళనికూడా తనకి సాయంరమ్మంది. భర్తని ఏ ఎలుగో తినేసిందేమో, లేకపోతే కాలుజారి నదిలోకి పడిపోయేడేమో అని ఆవిడ భయం. వెతికీ వెతికీ ఆవిడ విసిగి వేసారిపోయింది.

దీపాలుపెట్టేవేళ పొరుగింటతను వచ్చి పాయి ఏటిఒడ్డున నిద్రపోతున్నాడని చెప్పేడు. ఆమె వెంటనే వెళ్ళి అతన్ని యింటికి తీసుకొచ్చింది. ఆవిడకి ఏడవాలో నవ్వాలో అర్థంగాలేదు. కాని మొత్తానికి ఆరోజు పాయికి తిట్లు తగ్గేయి.

పాయి యిలా ఏమీ పట్టనట్టు తిరిగేవాడు. కాని అతని భార్య బియ్యం లేవనో, ఉప్పులేదనో, కట్టెలు లేవనో చాలా బాధపడిపోయేది. ఆవిడకి చాలా అందమైన కను బొమ్మలున్నాయి గాని ప్రతి చిన్నదానికి వాటిని చిట్లించేది. పాయికి తిండీ గుడ్డా అసలు పట్టవు. మాటి మాటికీ "నాకు పేణం నిలిసేటంతవుంటే మరేటక్కరనేదు" అనేవాడు. పస్తులుండడం. తగూలాడుకోవడం వాళ్ళకు పరిపాటయిపోయింది. వాళ్ళిద్దరికీ అసలు పొత్తు కుదిరేదేకాదు.

"నిన్ను మనువాడి, ఇలాగ బాదలుపడడం నా అదురుస్టం" అని ఆవిడ అంటే

"సుకపట్టం నీ జాతకంలోనే నేదే. మరోడికాడైనా నీకేటీ ఎక్కువుండదు" అని అతననేవాడు.

"నువ్వేమీ పాటుపడవ్. అందుకేగా యిలా పస్తులుండడం?"

"పోనీ నువ్వు అంతలా కష్టపడి సంపాయించింది ఏటుంది? నీ కోడి పిల్లల కేటయింది? తెల్లారేసరికి సచ్చినాయికదా? పోనీ నువ్వు మశాగత్తు సేసిన పందికేటయింది?" ఈ మాట అనగూడ దనుకుంటూనే అనేసేడు పాయి. అప్పటికే అతని భార్య కళ్ళు నీటితో నిండిపోయేయి.

ఆవిడ ఓ పంది పిల్లని కొన్నది. సంవత్సరంనాటికి దాన్ని బాగా మేపి, అమ్మిన డబ్బుతో కొత్త బట్టలు కుట్టించుకోవచ్చుననుకుంది. రోజూ తన పసిబిడ్డను ఎత్తుకునే పందిని మేపేది– ఆకులవీ తవుడుతోకలిపి మేత తయారుచేసేది. ఆవిడ శ్రమకి తగినట్టే అది బాగా బలిసింది.

కాని ఓరోజు ఆ పంది హాన్ తోటలోపడి కొన్ని పూలమొక్కలు తొక్కేసింది. వెంటనే హాన్ దానికేసి తుపాకి గురిచూసేడు. పాయి భార్య బిడ్డనెత్తుకునే అక్కడికి పరుగెత్తింది. తుపాకి పట్టుకొని ఈ ఒక్కసారికి వూరుకొమ్మని బతిమాలింది.

"ఊఁ, ఊరుకోవాలేఁ? ఎన్నిమాట్లు వూరుకోలేదు? నీ పంది నీక్కావాలంటే, నా పూలధరయిచ్చుకో"అంటూ తుపాకితో ఆమెనీ, ఆమె మూడేళ్ళబిడ్డనీ కిందికితోసేడు హాన్. బిడ్డ తల రాతికి కొట్టుకుని పెద్ద దెబ్బ తగిలింది. కణతలమీద తగలడంతో రక్తం బాగా పోయింది. ఆ తల్లి బిడ్డని వంటింట్లోకి తీసుకెళ్ళి దెబ్బకి ఇంత బూడిద అంటించింది. తర్వాత బిడ్డని గుండెలకు హత్తుకుని పెద్దపెట్టున శోకాలు పెట్టింది. హాన్ మళ్ళీ వచ్చేడు. ఈసారి "ధన్"మని పంది పని కానిచ్చేడు.

మరోరెండువారాలకి రక్తం మరీ ఎక్కువగాపోయి ఆబిడ్డ చచ్చిపోయేడు. హాన్ గారి పూలఖరీదు– ఓ బిడ్డా, ఓ పందీను.

ఇరుగు పొరుగు వారంతా ఓదార్చేందుకు వచ్చేరు. బిడ్డని చాపలో చుట్టేరు. గుండెలవిసిపోయేలా తల్లి ఏడుస్తూనేవుంది. వయసుమళ్ళిన ఆడవాళ్ళు ఆమెని ఓదారుస్తున్నారు "ఊరుకోమ్మా, నీకేటి వయసు నేదా? ముందుకి పిల్లలేపుట్టరా? అలాబెంబేలు పడకే తల్లీ, ఉప్పుడు నీ బాగునువ్వు సూసుకోవాల" అంటూ.

ఎందరెంత ఓదార్చినా పాయిభార్య తేరుకోలేకపోయింది. మూడురోజులు వరుసగా వాళ్ళపొయ్యిలో పిల్లి లేవలేదు. కాంగుకి యీ కొసన ఆమె ఏడుస్తూంటే, మరో కొసన పాయి బద్ధకంగా కూచునేవాడు. జల్సాలాతిరిగే పాయికూడా చిక్కిపోయేడు.

కీలుబొమ్మ ప్రభుత్వంలో పేదలంతా పడరానిపాట్లు పడ్డారు. అన్నిరకాల హింసలకీ గురయేరు.

పాయి కొడుకు చచ్చిపోయి నెలయింది. ఎవరిగొడవల్లో వాళ్లుండి పాయి కుటుంబానికి జరిగిన అన్యాయం మర్చిపోయేరు. కాని పాయి, అతని భార్య అంత వేగిరం ఎలాగ మర్చిపోగలరు? వాళ్ళకి తగిలినగాయం ఎప్పటికీ పచ్చిగానే మిగిలిపోయింది.

బొద్దుగా ముద్దుగా వున్నబిడ్డని వాళ్ళెంతో అపురూపంగా చూసుకున్నారు. అర్థరాత్రివేళ ఏడుస్తూ మొగుడు కోర్టుకెళ్ళి పగ తీర్చుకోలేదని సాధిస్తూండేది పాయిభార్య.

"నాను మరోసుట్టు బొక్కలోకి ఎల్లాలనుందేటి? కోరుటు కాసిపోతే మల్ల అదే అపుతాది."

'కాలమే అన్నిటికీ మందు'అన్నట్టు రోజులు దొర్లుతున్నకొద్దీ బాధని కొద్దికొద్దిగా మర్చిపోసాగేరు. కాని యీరోజు పాయి అనుకోకుండా అది గుర్తుచేయడంతో ఆబాధ తిరగతోడినట్లయింది. అది మర్చిపోటానికి పెరట్లో కట్టెలు కొట్టసాగేడు. మూడు, నాలుగు నెలలకి సరిపడ కొట్టేక అలిసిపోయేడు. నుదుటిచెమట తుడుచుకుని ఇంట్లోకి వచ్చేడు. ఇంకా అతని భార్య ఏడుస్తూనే వుంది. వెక్కిళ్ళకి ఆమె ఒళ్ళంతా కదిలిపోతోంది.

ఇంతలో బైటనుంచి ఎవరో పాయిని పిలిచేరు.

"ఆఁ, ఆఁ, ఉన్నాను. ఎవరదీ? కువో?"అంటూ బైటికివెళ్ళేడు. కువోతో పాటు ఓ కార్యకర్తనికూడా చూడగానే యిద్దరినీ యింట్లోకి తీసుకొచ్చేడు.

పాయి భార్య ఏడుపు ఆపి, కిటికీకేసి తలతిప్పి కళ్లు అద్దుకుంది. అది కువో చూసేడు.

"ఏటి మల్ల పాయితోగాని 'పోరాటం' అయినాదేటి?" అన్నాడు. ఈ మధ్య చిన్నవాంగ్‌తో నేస్తమయేక నేర్చుకున్న పార్టీ పదజాలం వాడుతున్నాడు కువో.

"అవన్నీ నీకెందుకు? నీ పనేటో నువ్ సూసుకో" అన్నాడు పాయి. వాళ్ళు కూచున్నాక, వాళ్ళ తోటలోని పొగాకు చుట్టిచ్చేడు వాంగ్‌కి. తర్వాత పాయి భార్య ఏవో పళ్ళుతెచ్చి చిన్నబల్లమీద పెట్టింది. తనో చింకి గుడ్డ తీసుకుని కుట్టసాగింది.

కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాక అసలు విషయంలోకి దిగేడు వాంగ్:

"మనమంతా కలిసికట్టుగా ఆరోనెంబరు హాన్‌మీద తిరగబడాలి. నువ్వుకూడా మాతో కలుస్తావా? నీకాదమ్ములున్నాయా".

"ఓ, నానురడీ" అన్నాడు పాయి. కాని అతని భార్య ఓ చూపు విసిరింది.

"ఏటే అలాగ సూస్తావ్? నీకేటి తెలుసుమా ఎవ్వారాలు?" అన్నాడు పాయి.

పాయిభార్య యిప్పటికి కొంత తేరుకుంది. అందుకే కువోతో

"మీరీణ్ణి నెక్కలోకి తీసుకున్నారేటి? ఈడు దేనికీ పనికిరాడు బాబూ. జాం పొద్దోయిందాకా కాంగ్ దిగడు. ఈడేనేటి బాబూ పనిసేసీది?"

"అలా తీసి పారెయ్యకు" అన్నాడు కువో

"ఏఁవయ్యా. హాన్ పనిపట్టాలా వద్దా?" అనడిగేడు చిన్నవాంగ్.

"దాన్నే అడగండి బాబూ" అన్నాడు పాయి, కాంగ్‌మీద ముడుచుకుపడుకుంటూ.

హాన్ పేరెత్తగానే తాచుపాములా తలెత్తింది పాయిభార్య.

"ఆడి తల తీసెయ్యాల. అలాగసేస్తేగాని నాబిడ్డకి ఆడు సేసిన అన్నేయం తీరదు".

"నీ బిడ్డకా?" అన్నాడు వాంగ్

జరిగినదంతా చెప్పింది పాయి భార్య.

"హాన్‌గాడి పని మేంపడతాం. మరి నువ్వు అందరిలోను హాన్‌ని జలకడిగేస్తావా?'' అనడిగేడువాంగ్.

"ఆపని మాత్రిం నాను సెయ్యలేను. నలుగురి మద్దైయితే నా నోరు పెగల్దు"

"పాయీ నువ్వూ పొద్దస్తమానూ సేసేదేటో" ఆన్నాడు కువో.

"దానికీ దీనికీ తేడా నేదా!"

"నువ్ సెప్పాల్సింది పాయిసేత సెప్పించు. మరక్కడితో సరి"

కువో, వాంగ్ లేచి ఇంటికొచ్చేసేరు. రాత్రి తెల్లవార్లూ మాట్టాడుకున్నారు.

(సశేషం)

నవల - ప్రజలు

సత్యము - వాస్తవికత

రాల్ఫ్ ఫాక్స్

అనువాదం : కొత్తపల్లి రవిబాబు

"దర్శనీయ ప్రపంచం ఎవరి కోసమో నేను వారి కోసమే" నని థియొఫిల్ గాషియర్ [1] గాన్‌కోర్టు సోదరులకు [2] కళాకారునిగా తన అంతర్గత భావాలను వివరిస్తూ చెప్పాడు. "ప్రపంచం ఎవరికోసమో, నేనూ వాళ్ళ కోసమే"నని గనుక చెప్పి వుంటే అతను రచయితగా తన సుగుణాలను, పరిమితులను వివరించలేకపోయేవాడు. కాని అలా చేసివుంటే, రచయితకూ వాస్తవికతకూ గల సంబంధాన్ని నిర్ణయించుకోడానికి పనికివచ్చే ప్రాథమిక పాఠాలు మనకు నేర్పి వుండేవాడు. అంతేగాక సత్యం పట్ల అతని దృక్పథం ఏదో మనం నిర్ణయించుకోడానికికూడ సహాయపడేవాడు.

ఈ ఆధునిక ప్రపంచంలో ప్రతి చిన్న విషయంలోనూ నానాటికీ పెరిగిపోతున్న ప్రత్యేకీకరణ (Specialisation), శ్రమ విభజన (division of labour) ఈరెండూ కలిసి రచయిత గొంతును నొక్కేసాయి. వాస్తవిక ప్రపంచాన్ని చూడనీయకుండా అంధుణ్ణి చేసివేసింది. దాని సంకుచిత వ్యక్తీకరణే రచయిత "నాపని రాయటం వరకే" అని అనటం, తన రచనలలోని నిరపాయకర గుణాన్ని దెబ్బకొడుతుందనుకునే జీవిత భాగాన్ని కవి తన దృష్టినుంచి బయటకు నెట్టివేసినట్లయితే, కవిత్వం చాల నిరపాయకరమైనదని బాల్డ్విన్ హామీ ఇచ్చాడు. కళాకారుని విధి గురించిన ఈ సంకుచితభావం ఆధునికమైనట్టిది. 19 వ శతాబ్దపు పూర్వభాగంలో, ప్రపంచ రచయితలలో మెజారిటీ వారికి ఈ భావం అంగీకార యోగ్యమయ్యేదికాదు. ఇక మార్లో (Marlowe) కాలం నుంచి ఫీల్డింగ్ కాలంవరకు ఈ భావం లేనేలేదు.

సాహిత్యానికి వున్న మహోన్నత సాంప్రదాయాన్ని పునరుద్ధరించడం, ఆత్మాశ్రయవాదపు సంకుచిత ప్రత్యేకీకరణపు సంకెళ్ళను తెంచివేయటం, సత్యము-వాస్తవికతకు సంబంధించిన జ్ఞానాన్ని సంపాదించడమనే ప్రధానబాధ్యత సృజనాత్మక రచయితలో గుర్తింపచేయటం నేటి సాహిత్యపు విప్లవవిధి. కళద్వారా మానవుడు వాస్తవంతో పెనగులాడుతాడు. వాస్తవాన్ని జీర్ణించుకుంటాడు. తన అంతర్ చైతన్యంపై ఆధారపడి రచయిత నగ్నవాస్తవికత తీసికొని దానిని తన ఉద్దేశాల కనుగుణంగా మల

చుకుంటాడు. ఉద్రేకపూరిత భావాల కనుగుణంగా రూపొందించుకుంటాడు. కళా సృష్టి అంతా, కళాకారుని వేదన అంతా, వాస్తవప్రపంచాన్ని చిత్రించే ప్రయత్నంలో వాస్తవికతతో జరిగే ఉద్రేకపూరిత సంఘర్షణలో కన్పడుతుంది.

"బహుముఖమైన జ్ఞానం నన్ను దేవుణ్ణి చేస్తోంది.
ఎన్నో పేర్లు, వీరగాథలు, భయానకఘటనలు, తిరుగుబాట్లు
రాజరికాలు, గంభీరవాణులు, వేదనలు
సృష్టి, లయ— అన్నీ ఒక్కసారే
నా ఖాళీ మెదడులోకి ప్రవహిస్తున్నాయ్
నాకు దైవత్వం ప్రసాదిస్తున్నాయ్
దివ్యమైన మత్తు పదార్థమో
లేక స్వచ్ఛమైన సాటిలేని అమృతం తాగినట్లు
నేను అమరుడినైనట్లు చేస్తున్నాయ్."

[కీట్సు— 'హైపీరియన్' (Hyperion)]

కీట్సుకంటె ఎన్నోరెట్లు విప్లవాత్మకంగా రాసిన బైరన్, షెల్లీల పట్ల చూపిన ద్వేషంకంటే, మరింత ఎక్కువ ద్వేషం అభివృద్ధినిరోధక విమర్శకులు కీట్సు పట్ల చూపారు. ఆ విధంగా ద్వేషింపబడిన కీట్సు తన అసంపూర్ణ కావ్యంలో (Hyperion) (2 a) ఉత్తమ సృజనాత్మక కళాకారుని విప్లవ పోరాటసారాన్ని వివరించడానికి ప్రయత్నించాడు. నిజానికి, ఉత్తమ కళాకారుడు తన రాజకీయ దృక్పథాల కతీతంగా, వాస్తవాన్ని మార్చడానికి విప్లవపోరాటంలో ఎప్పుడూ నిమగ్నుడై యుండాలి. అతని జీవితం, స్వర్గనరకాలమధ్య జరిగే పోరాటంలా, పదవీచ్యుతులైన దేవుళ్లు, పదవినలంకరించివున్న దేవుళ్ళమధ్య జరిగే పోరాటంలా వుంటుంది. మానవుడి ఆత్మకొరకుజరిగే పోరాటంలా వుంటుంది.

ఈ యుద్ధానికి మార్క్సిజం రచయితను తయారుచేయగలుగుతుందా? "ది టైమ్స్ సాహిత్యానుబంధం"లో ఈమధ్య వచ్చిన ఒక సంపాదకీయవ్యాసం, అమెరికన్ విప్లవ సాహిత్యాన్ని చర్చిస్తూ, ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ప్రయత్నించింది. "ఈ నూతన సాహిత్యం మానవానుభూతులన్నిటినీ లీనం చేసుకోగలదా? పిడివాదుల వాదం నెగ్గినన్నాళ్లు ఇది జరగదు. ఏ కళకైనా ప్రధాన లక్ష్యం అన్ని రూపాలనూ, అన్ని మార్గాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడమే. అంతేగాక కళకుగల స్వభావాన్ని బట్టి, అది మార్క్సిజంకంటే ఆచరణలో ఇంకా మరే ఉదార సామాజిక తత్త్వశాస్త్రపు పరిమితులకు లోబడి వుండదు. మార్క్సిజం తన ప్రగాఢ జ్ఞానంతో ఘర్షణపడనంత వరకు, కళాకారుడు సమాజంలో చిత్తశుద్ధిగల కళాకారునిగానూ, మార్క్సిస్టుగానూ

ఏ కాలంలో వుండకూడదనడానికి కారణం లేదు. ప్రతి మానవుడు అజ్ఞానంవల్ల అంధుడు కావచ్చు అతను ఎప్పుడూ అంతిమ వివరణకొరకు ప్రయత్నిస్తూ వుండ వచ్చు. మానసికంగానైనాసరే— ఏదో ఒకరకమైన రూపం (form) తప్పనిసరి. బాహ్యా త్మకంగా (objective) చూస్తే, మార్క్సిజం అట్టి అప్రధాన పాత్ర (Subordinate role) నిర్వహించలేదు అని అనుకోడానికి ఆస్కారంలేదు.

"ది టైమ్స్" సమీక్షకారుడు మార్క్సిజంపట్ల సుముఖత చూపాడుకాని దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోలేకపోయాడు. రచయితకు ఒక 'విశ్వాసం' వుండాలి కనుక దివ్యజ్ఞానం, ఫ్రాయిడిజం, ఏదో ఒక యిజంలాగా మార్క్సిజం సరిపోతుందా అని చూడటం కాదు ముఖ్యం. రూపం (Form) అనేది మనస్సుకు సంబంధించినది. మార్క్సిజం ఆ పాత్ర వహించడానికి చాల బాగ సరిపోతుంది అంటాడు. ఈ వాదన విన్నపుడు హైస్కూలు రోజుల్లో ప్రతి మీటింగ్‌లోనూ, ప్రాచీన కావ్యపఠనాన్ని సమ ర్థించే మా హెడ్‌మాస్టర్ గుర్తుకు వస్తాడు. మన వాణిజ్య సమాజంలో ప్రాచీనకావ్య పఠనాన్ని బలపరచడం అవసరం. ఈ కావ్యాల రూపం అనితర సాధ్యమైన 'మానసిక వ్యాయామం' (mental gymrastics) గనుక వాటిని పిల్లలకు నేర్పాలనేవాడు మా హెడ్‌మాస్టర్. నిజమే. ప్రాచీనకావ్యాలు (classics) 'మానసిక వ్యాయామం' కింద బోధింపబడ్డాయి. కాని అవి అనితరసాధ్యాలా అన్నవిషయం మాత్రం చర్చనీయాంశం. ఎరాస్మస్ (Erosmas) [3] ప్రాచీనకావ్య బోధనా లక్ష్యంగా దీనిని అంగీకరించేవాడా అని అనుమానం కలుగుతుంది.

సరిగ్గా ఇక్కడే అసలు అంశం వుంది. జీవిత సత్యాలను తెలుసుకోవాలనే పోరాటంలో, ప్రాచీన కావ్యాల పరిజ్ఞానమే సృజనాత్మక రచయితకు ప్రధాన సాధనంగా వున్న కాలంలో ఎరాస్మస్ జీవించాడు. మధ్యయుగాల పిడివాదాలనుండి, నిగూఢవాదం (Obscurantism) నుంచి బయటపడటానికి గ్రీసు, రోము దేశాల కవిత, ఆలోచనా విధానం అవసరమైంది. మానసిక వ్యాయామంకాదు- మానవుడి ఆత్మపై ఆధిపత్యం సంపాదించడం అనేది సమస్య. మన యుగానికీ, మార్క్సిజానికీ ఇదే వర్తిస్తుంది. మన కాలంలో మార్క్సిజం మానవాభ్యుదయ తత్త్వశాస్త్రంగావుంది. ఆధునిక ప్రపం చంలో మానవుడి ఆత్మను ఇంకా తన గుప్పిటిలో పెట్టుకున్న నిగూఢవాదం, కాల దోషం పట్టిన పిడివాదాలనుంచి బయట పడటానికి మన వసుధైక ప్రపంచ దృక్పథం వీలు కల్పిస్తోంది. మార్క్సిజం లేకుండా రచయితకు కావాల్సిన ప్రధానమైన సత్యాన్ని తెలుసుకోడానికి మార్గమేలేదు.

ఆ ప్రధాన పాత్ర వహించే రూపాన్ని వివిధ రకాలైన ఆకర్షణీయమైన తత్త్వ శాస్త్రాలనుండి స్వేచ్ఛగా ఏదో ఒక దాన్ని ఏరుకోవడం కాదు మనం చేయాల్సింది.

మన ప్రపంచం ఎరాస్మస్ కాలంలో లాగేనే, చారిత్రిక సంఘర్షణ వల్ల ముక్కలు ముక్కలై పోయింది. ఈ పోరాటంలో నాశనమైన ప్రపంచ శిథిలాలపై నూతన ప్రపంచ నిర్మాణానికై మార్క్సిజానికి చరిత్ర పిలుపు నిచ్చింది. ఫ్యూడలిజం అంత మొందిన తర్వాత ప్రపంచ నిర్మాణంలో మానవతావాదం నిర్వర్తించిన పాత్రనే, ఈ నాడు మార్క్సిజం నిర్వర్తిస్తోంది.

'ది టైమ్స్' రచయిత ప్రకారం రూపం అనేది తప్పనిసరి. కాని మార్క్సిజం ప్రకారం వస్తువుగానీ, రూపంగానీ జడాత్మకమైన విడి విడి విషయాలుకాదు. వస్తువునుబట్టి రూపం నిర్ణయమౌతుంది. రూపం ఆవస్తువులో లీనమౌతుంది. వస్తువుకు ప్రాధాన్యతవున్నా, రూపం వస్తువుపై ప్రభావాన్ని చూపిస్తుందేకాని, అచేతనంగా వుండదు. ఆధునిక రచయితకు మార్క్సిజం అనేది ప్రదర్శనీయమైన డాబుసరి డ్రెస్ కాదు. అది అతని జీవిత దృక్పథం, అతని వాస్తవికతకు గీటురాయి. అతని ప్రగాఢ విజ్ఞానం క్రమశిక్షణతో ఒక రూపం పొందటానికి అతనికి మార్క్సిజం తోడ్పడుతుంది. వాస్తవ ప్రపంచ పరిశీలన, అవగాహనే రచయిత అనుసరించే మార్క్సిజంగా వుండాలి.

"అంతిమంగా కళ లక్ష్యం... అన్ని రకాల రూపాలనూ, మార్గాలనూ అవగాహన చేసుకోవటం" నిజమే. కాని యీ అవగాహన గుడ్డిగా తన ముందున్న అన్ని రకాల రూపాలనూ, మార్గాలను అనుసరించడంద్వారా కానీ, సాహిత్య లేక తాత్త్విక వరణ పద్ధతి (Eelecticism) ద్వారా గానీ రాదు.

వాస్తవాన్ని తెలుసుకోవాలన్నా, అర్థం చేసుకోవాలన్నా సత్యానికి అనుగుణంగా వుండే జ్ఞానసిద్ధాంతం ఒకటి అవుసరం. సత్యం అనేది రూపరహితంకాదు. చలనరహితం కాదు. కనుక దానిని తర్కబద్ధంగా, ఆలోచనలద్వారా, సహజజ్ఞానం (intuition) ద్వారా తెలిసికోలేం.

ఆచరణద్వారానే సత్యాన్ని తెలుసుకోగలం. మానవుడు ఒక వస్తువువిషయమై చేసే తీవ్ర పరిశీలనయొక్క వ్యక్తీకరణే సత్యం. ఆ పరిశీలన మానవుడి సామాజిక, నిర్మాణాత్మక ఆచరణే.

కళాకారుడు సత్యం గురించి ఆలోచించాలి. "వాస్తవానికి సంబంధించిన అన్ని అంశాలనుంచీ, వాటి పరస్పర సంబంధాలనుంచి రూపొందినట్టిది సత్యం" అన్నాడు లెనిన్. అంతేకాదు. ప్రతి కళాకారుడు గమనించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే—

"ఒకవిషయమై తెలుసుకోవాలన్న అనంతమైన, అంతులేని ఆలోచనే జ్ఞానం. మానవుడి ఆలోచనావిధానపు వ్యక్తీకరణ మృతప్రాయమూ, రూపరహితమూ, చలన రహితమూ, వైరుధ్యరహితమూ అనుకోకూడదు. దానిని అనంతమైన చలనాన్ని, వైరుధ్యాలనూ ప్రవేశపెట్టి, ఆ వైరుధ్యాలకు పరిష్కారాన్ని సూచించేదానిగా అర్థం చేసుకోవాలి."

అటువంటి తత్వాన్ని అంగీకరించే కళ, తప్పక అన్నిరకాల రూపాలను, భేదాలను అవగాహన చేసికొని అర్థంచేసుకోగల స్థితిలో వుంటుంది. సోషలిస్టు కళ—ఒక నూతన వాస్తవికత మాత్రమే ఈనాడు సంపూర్ణమైన బాహ్యాత్మకత (objectivity) సాధించగలుగుతుందని యీ కారణంవల్లనే మార్క్సిస్టు రచయితలు వాదిస్తారు. ఈ బాహ్యాత్మకతే సృజనాత్మక రచయిత పట్టుదలతో వాస్తవికతతో జరిగే పోరాటంలో గెలుపొందే అవకాశం కలుగచేస్తుంది.

వివరణలు—వ్యాఖ్యలు.

1. Theophile Gantier : 1811-1872. ఫ్రెంచి రచయిత. కవి, వ్యాసకర్త, నవలాకారుడు. తన కలాన్ని పదునుకత్తిగా మార్చని రచయిత.

2. Goncourt Brothers : ఎడ్మండ్ గాన్‌కోర్ట్ 1822–1896
ఆల్‌ఫ్రెడ్ గాన్‌కోర్ట్ 1830–1870

ఆల్‌ఫ్రెడ్ మరణించేవరకూ ఇద్దరూ కలిసి రాసేవారు. ఒక కొత్తరకం నవలను సృష్టించారు. సమకాలీన జీవితాన్ని, గాఢంగా, సూక్ష్మంగా పరిశీలించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. గస్టావ్ ఫ్లాబర్ట్ నుండి కొంత నేర్చుకొని, ఎమిలీ జోలాకు యెంతో నేర్పుతూ, ఒక కొత్తరకం నవలను సృష్టించారు.

గాన్‌కోర్ట్ సోదరులు తమ నవలలలో ఉపయోగించిన భాష, సంప్రదాయ సిద్ధమైన ఫ్రెంచి భాషగా లేదని ఫ్రెంచి విమర్శకులు దాడి చేసారు. అది నిజమే. నూతన అనుభూతులను, నూతన దృష్టిని ప్రజలకు అందించే ప్రయత్నంలో వారు ఒక కొత్త భాషను సృష్టించారు.

8. Erasmus : 1466–1536. పునర్జాగృతి (Renaissance) కాలంనాటి గొప్ప మానవతావాది. ప్రతి విషయాన్నీ హేతుబద్ధంగా ఆలోచించినవాడు. 18 వ శతాబ్దపు హేతువాదులు గుర్తుకురాకుండా మనం ఎరాస్మస్‌ను చదవలేం. ఎరాస్మస్‌ను "పునర్జాగృతియుగానికి వోల్టేరు" వంటివాడని పిలిచేవారు.

జీవితానికి మార్గదర్శి హేతువాదమే. అన్ని సమస్యలను తీర్చే మధ్యవర్తి హేతువాదమేనని ఎరాస్మస్ నమ్మాడు.

2 (a) Hyperion : కీట్సు అసంపూర్ణ మహా కావ్యం (epic). గ్రీకు దేవతలలో హైపీరియన్ సూర్యదేవుడు. అతడు జ్ఞానానికి ప్రతీక. అతని నాయకత్వాన దేవతలు. దేవుడిపై తిరుగుబాటు చేస్తారు. చేసి ఓడిపోతారు. సూర్యుని పతనం వర్ణించడంతో కావ్యం ఆగిపోయింది.

కథ ముగియ లేదు

మరువాడ రాజేశ్వరరావు

ఈ కథ ఏ ఊళ్ళో జరిగిందని మీరడిగితే నేను చెప్పలేను. అప్పలమ్మా, అప్పల్సాంవి ఏ ఊళ్లో ఉన్నారో, ఆ ఊళ్ళోనే జరిగింది. వాళ్ళిద్దరికీ ముగ్గురు పిల్లలున్నారు కాని, వాళ్ళ కథ యిందులో లేదు. అది రేపటి కథ.

అప్పలమ్మ ఆడకూలి. అప్పల్సాంవి మగకూలి. రాళ్ళు మోసే కూలీలు. వాళ్ళిద్దరి మధ్యా రొమాన్స్ జరిగే ఉంటుంది కాని, ఆ కథా యిందులో లేదు.

ఇవేవీ కాకపోతే మిగిలేది ఆకలే కనక, యిది తప్పకుండా ఆకలికథే నంటారేమో. ఆకలేకాకుండా వాళ్ళలో మరోటికూడా వుంది. దాన్నిగురించే ఈ కథ.

అప్పల్సాంవి గురించీ, అప్పలమ్మ గురించీ కథ చెప్తానంటున్నాను గాని, మాష్టారూ ! నిజం చెప్తున్నాను. వాళ్ళ గురించి నాకేంవీ తెలీదు. కొంచెం పెద్ద గుమాస్తాగా నాలుగురాళ్లు సంపాయించుకుని, పెద్దవాళ్ళ దయవల్ల పస్తుల్లేకుండా అప్పుడప్పుడు పాలుకూడా తాగుతూ బతికేస్తున్నాను. నాకు వాళ్ళగురించి తెలుసుకునే అవకాశమూ లేదు, ఆ ఉత్సాహంకూడా తగినంతగా లేనట్టే అనిపిస్తోంది. ఆ ఉత్సాహం ఉంటే మరోలాగ బతకాల్సినవాడ్ని.

అందుకేనేమో, వాళ్ళ పేర్లు తల్చుకోగానే లక్షలాది జనం కళ్ళముందు నిలబడ్డారు— 'నేనే, నేనే అప్పల్సాంవి'నంటే, 'నేనే అప్పలమ్మ'నంటూ. నేను రాళ్లమోసి బతుకుతున్నానని కొందరంటే, రాళ్లే కాదు బస్తాలుకూడా మోసేనని కొందరు; రాళ్ళు మోసేకాదు రాళ్లు కొట్టికూడా బతుకుతున్నానని కొందరంటే, ఎప్పుడో రాళ్లమోసే ఉంటాను. ఇప్పుడు ఫేక్టరీలో, 'పర్కార్నై' బతుకుతున్నానని కొందరు... అంతమంది జనాన్ని, అంతమంది కాయకష్టంచేసే జనాన్ని, అందరూ ఒక్కరిలాగే కనబడుతూ ముందుకి తోసుకొస్తున్న జనాన్ని... నా బతుకు బతికే వాడెవడేనాచూస్తే భయపడిపోయి, గుంజాగి ఛస్తాడు. నేను మాత్రిం భయపడలేదు. అందుకే యీ కథ చెప్తున్నాను.

అప్పల్సాంవీ, అప్పలమ్మా కాకుండా మరో రెండు పేర్లు పెడదాంవంటే, ఆ పేరూ నాదేనంటూ ముందు కొస్తున్నారు జనం. అసలు విషయం ఏమిటంటే, మనం అప్పల్సాంవి గురించీ అప్పలమ్మ గురించీ వేరే చెప్పుకోడానికి వాళ్ళేం ఆస్తిపరులా,

ఆఫీసర్లూ, అధికారులూ, ఆర్టిస్టులూకాదు. వాళ్ళు కూలీలు, కూలీల గురించి ఏక వచనంలో చెప్పుకోవడం అసాధ్యం. అందుచేత,

రాళ్ళు మోసే కూలీలు!

రాళ్ళు మోసే కూలీలకి రాళ్ళుమోసిన్దాని విలువ,—మొగ కూలికి రెండు రూపాయలూ, ఆడ కూలికి రూపాయిన్నరా.

'బగ్‌మంతుడి'కి చేతులెత్తి మొక్కుతారు వాళ్ళు 'ఆ బాబుదయ'!– ఆ బాబు దయ అంతకన్న హీనంగా లేనందుకు వాళ్ళు సదా కృతజ్ఞులు.

'రోజంతా రాళ్ళు మోసిన్దానికీ, రెండు (మగ) రూపాయలు లేదా ఒకటిన్నర (ఆడ) రూపాయి జీవితపు విలువ సరిగ్గా సమానమని అర్థికశాస్త్రం చెప్తోంద'ని మనలో ఎకనమిక్సు చదువుకున్న వాళ్ళకి తెలుసు. మనుష్యులకి బతుకుమీద తీపి అంత(లో)గా ఉందిట. అంతకన్న తక్కువిస్తే మనుష్యులకి బతుక్కన్నా చావంటేనే ఎక్కువ యిష్టంగా ఉంటుందిట. వాళ్ళు చచ్చిపోతే రాళ్ళు మోయించుకునే పెద్దమనిషికి రాళ్ళు మోసే వాళ్ళు దొరకరుట.

అందుచేత 'న్యాయం' అక్కడే, అలాగ స్థిరపడి పోయింది. 'న్యాయం' వల్ల 'లాభం' పుడుతోంది. లాభాన్ని కాపాడ్డానికి ఎందరెందరో జీతగాళ్ళు... ఎన్నికలు, మంత్రులు, న్యాయస్థానాలు, పోలీసు ఠాణాలు, శాసనాలు, తుపాకులు...

యివన్నీ మనకి తెలుస్తాయి కాని, అప్పలమ్మకీ, అప్పలా్వమికీ తెలీవు. ...తెలియకుండా ఉండి పోతాయా? మనకి తెలిసినట్టు కాకపోతే మరో రకంగా తెలుస్తాయి. తెలిసినప్పుడు మనలాగ కాకుండా మరో రకంగా ప్రవర్తిస్తారేమో!

* * *

రాళ్ళు మోస్తున్నారు కూలీలు...

బజార్లో చవక రకం బియ్యం ఖరీదు పది పైసలు పెరిగింది... రెండు రూపాయల జీవితపు విలువ పది పైసలు తగ్గింది.

యివాళకన్న రేపు ధర పెరుగుతుందంటే యివాళ కొనుక్కొని రేపు అమ్మడం లాభం. రేపు ధర తగ్గుతుందంటే యివాళ అమ్మేసి రేపు కొనుక్కోవడం లాభం. యిది లాభాల వ్యాపారం. (లాభం లాభేన లభ్యతే!) ఈ వ్యాపారం ఎంత ఎక్కువగా జరిగితే ధరలు అంతగా పెరిగిపోతాయిట. ధరలు పెరుగుతున్న కొద్దీ వ్యాపారస్తులు సరుకు కొనేసి దాచేసుకుంటూ ఉంటే, బజార్లో సరుకు తగ్గిపోతూఉంటే, ఆ కారణం

చేత ధరలు మరింతగా పెరిగిపోతూ ఉంటే, వ్యాపారస్తులు మళ్ళీ సరుకుకొనేసి దాచేసు కుంటూ ఉంటే ఆకాశం అంత ఎత్తుగా ధరలు; బజార్లో సరుకు 'హూత్‌కాకీ'!

నల్లటి చీకటి గోదాముల్నిండా సరుకులుంటాయి, అవి కొనుక్కోవాలంటే, నువ్వు ఆకాశంకన్నా కొంచెం ఎక్కువధరే యివ్వాలి.

బజార్లో సరుకు దొరకదు కాని నల్లబజార్లోకన్నా ధర తక్కువే. ఆ ధరే పది పైసలు పెరిగింది.

'ఇప్పటి పరిస్థితుల్లో బియ్యం ధర పెరగడం ఆర్థికశాస్త్ర సమ్మతమే'నన్నాడు ఆర్థికశాస్త్రవేత్త.

అది కూలీలకి తెలియదు.

అప్పలమ్మా, అప్పల్నాఁవీ కళ్లు మూసుకుని చేతులు జోడించి 'బగమంతుడికి' మొక్కేరు. మూసుకున్నకళ్లు తెరిచేసరికి వాళ్ళ కంటి రెప్పలచుట్టూతడి. కళ్లు మసక మసగ్గా కనిపించేయి.

ఆ సాయంత్రమే కూరగాయలధర పది పైసలు పెరిగింది. గుడ్డముక్కలధర పాతికపైసలు పెరిగింది. ఉప్పుధర పెరిగింది. పప్పుధర పెరిగింది. చుట్టముక్కల ధర పెరిగింది. కుండలూ మండలూ ధర పెరిగిపోయేయి... ధరల చీకటి యెంతకీ తెల్లవారదనే భయంతో నిద్రధర పెరిగింది.

.. కూలీల నెత్తిమీద బరువు అంతగానూ పెరిగిపోయింది.

ఇదంతా అత్యంతసహజంగానూ, ప్రకృతిసిద్ధంగానూ జరిగిపోయిందని సూత్రీక రించిన ఆర్థిక శాస్త్రవేత్త జీతం పెరిగింది.

ఎండలు మంటలయేయి. మంటలు సెగలు గుప్పించేయి. ఆవిర్లెత్తించేయి ఆవిర్లు శరీరాన్ని ఉడకబెట్టేయి. రక్తాలు చెమటలై కూలీల శరీరాలు కట్టెలయేయి. కళ్ళుకాలి నిప్పుల కణికలే అయేయి. ఎండ పొగలు పొగలుగా కూలీల చెవుల్నీ, నాసికా రంధ్రాల్నీ ఆక్రమించుకుంది. చెప్పుల్లేని కాళ్ళలోంచి ఎండ విద్యుత్తులాగ ప్రవేశించి తలమీదుగా పైకి పోవాలని ప్రయత్నించి, పోలేక, తలలు బద్దలుకొట్టింది. బద్దలేకున్న తలలమీద బరువులు మరింత బరువెక్కిపోయేయి...గొంతుకెండినకూలీలు గుక్కెడు సోడానీళ్ళ కోసం— ఉప్పు, నిమ్మకాయ కలిపిన సోడా నీళ్ళ కోసం పరుగు లెత్తేరు...

సోడా నీళ్ళ ధర పెరిగిపోయింది!

ప్రాణాలు ఉస్సురన్నాయి. నీరసం చావులాగ నరనరాల్లోకీ పాకిపోయింది.

బరువు మరి భరించరానిదై పోయింది. నీతిలేని న్యాయం మరోచోట బీట వేసింది... కూలీల శరీరాల్లో రక్తం ఎండకన్న వేడి వేడిగా మరిగిపోయింది.

జీతాలు పెరగాలని సమ్మెచేసేరు కూలీలు.

ఏర్‌కండిషన్డ్ గదిలో, అప్పుడే నిద్రలేచిన, రాళ్ళు మోయించుకునే పెద్ద మనిషికి సమ్మె వార్త ఎర్రని ఎండలాగ చురుగ్గా తగిలింది.

* * *

అప్పలాస్వామి 'నిరాహారదీక్ష' లో కూర్చున్నాడు. అప్పలమ్మ కూలీల ప్రదర్శనలో పాల్గొంది.

సమ్మె 'శాంతియుతం'గా జరుగుతోంది. పని జరక్కపోతే పెద్దమనిషికి నష్టం వస్తుంది. నయాన చెప్పించేడు. కూలి జనం వినలేదు. భయాన చెప్పించేడు. చెప్పిన వాళ్ళ పళ్ళు రాలి పోయేయి. ...సమ్మె దౌర్జన్య కాండగామారిందని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించేరు. శాంతిని కాపాడమని పోలీసుల్ని పంపించేరు.

శాంతి కాముకుల లాఠీలు అశాంతుల తలలమీద విరిగేయి... శాంతి ధర పెరిగింది. అశాంతి బరువెక్కింది.

సమ్మె ఆగలేదు.

(కంటిమీద దెబ్బ తగిలిన అప్పలమ్మ ఆస్పత్రికెళ్ళింది. ఆకలికో, ఎండలకో శోషవచ్చి పడిపోయిన చంటి కూతురు చావు బతుకులమధ్య ఉంది. పిల్లల ఆకలి చూస్తూన్న అప్పలాస్వామికి తన ఆకలి తెలియలేదు. సాలెగూడుని ఛేదించకుండా సాలె పురుగుతో పోరాడ్డం నిష్ప్రయోజనం.)

కూలి జనం, యిక ముందు సమ్మె ఎలా జరగాలో నిర్ణయించుకునేందుకు మీటింగు జరిపేరు.

తెల్ల లాల్చీ, తెల్ల పైజామా వేసుకున్న చప్పిడిముక్కు నల్లమనిషి— కూలీల సంఘం నాయకుడు కంచు గంట లాంటి కంఠం విప్పి మాట్లాడేడు. 'దౌర్జన్యం నశించాలి' అని గర్జించేడు. 'మనం శాంతియుతంగానే పోరాడతాం' అని యింకా గట్టిగా గర్జించేడు. 'చర్చలు జరుపుకుందాం, ఢిల్లీ గాని, లేదా కనీసం హైదరాబాదుగాని వెళ్ళి మంత్రులతో మాట్లాడదాం' అని నొక్కి వక్కాణించేడు. అందుకు అయే ఖర్చులకిగాను ఒక్కొక్కరు పావలా పావలా యివ్వండని అర్థించేడు.

అతనలాగ మాట్లాడుతూ వుండగానే జనంలో ఏదో ధ్వని మొదలైంది. ఆధ్వని

లో ఉద్రిక్త తరంగాలు... యిటూ అటూ తిరిగే కూలీల తలలు... ఆవేశంగా ఏదో చెప్పుకుంటున్న పెదాలు... బిగించిన పిడికిళ్లు...

తన మాటలు యెవరూ వినడంలేదని తెలిసిపోయింది నాయకుడికి. 'భారత్ మాతాకీ జై, మహాత్మా గాంధీకీ జై 'అని మంత్రం చదివేడు. మంత్రం పని చెయ్య లేదు. జనం ఏదో నిశ్చయానికొచ్చి పరిగెడుతున్నారు. నాయకుడు చెప్పేది వినిపించుకోకుండా పరిగెడుతున్నారు.

బజార్లో సరుకుల్లేక పోయినప్పటికీ, నల్లగోదాముల్నిండా సరుకులేనట!— ఆ సరుకులు మోసిన వాళ్ళు చెప్పేరు. అది విన్న జనం పరిగెడుతుంటే నేల అదిరి పోయింది. నాయకుడు మరో దారంట పారిపోయేడు.

గోడల్ని పగల కొట్టేరు జనం.

చీకటి విరిగి పోయింది. బియ్యం, గోధుమలు... తిండి! తిండి!

పంచుకున్నారు జనం

'అయ్యయ్యో' రేపు పెరగాల్సిన ధరలు!'

'హయ్యయ్యో, వ్యాపారం !'

వర్తకులు కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చేరు.

'దుండగుల మూకలచే, ఆహారధాన్యాల దోపిడీ !'—వార్తా పత్రికలు.

'న్యాయం ! న్యాయం ?'...పత్రికల్లో, ప్రముఖుల హాహాకారాలు.

'బూటీ. లూటీ... దౌర్జన్యం'— ఆర్థిక శాస్త్రవేత్త.

శాంతికపోతం తుపాకుల్ని మీటింది. తుపాకులు కొందరి గుండెల్ని దూసుకు పోయి మరికొందరి గుండెల్ని 'మీటేయి' (అప్పల్నాయి చచ్చిపోయేడు. అది విన్న అప్పలమ్మ గోడుగోడుమంటూ ఆస్పత్రివాదిలి వీధిలో కొచ్చేసింది. చంటి కూతురు చచ్చిపోవడం చూసి ఆమెగుండె యినుములాగ కరిగి కరిగి, గట్టిపడిపోయింది.)ఆయుధాల్లేని జనం ఎదురు తీరగలేక పోయేరు. వాడ వాడనా 'న్యాయా'నికి తుపాకీలరక్షణ. అరెస్టులు... పత్రికలకెక్కని హింసాకాండ— జైళ్ళలో, పోలీసు ఠాణాల్లో...జనం— ఎవరిళ్ళలో వాళ్లు బందీలు... ఏం చెయ్యాలో తెలియని జనం...పరాయి దేశానివికావు. స్వదేశానివే— తుపాకులు, 'స్వ'జనంమీదికే యెందుకు తిరిగేయో అర్థంకాని జనం... ఆకలి వెయ్యడమే తప్పో, ఉన్న సరుకు 'లేద'ని దాచుకున్న వాళ్ళ గోడలు పగలకొట్టడమే తప్పో.— ఏది తప్పో, ఎందుకు తప్పో అర్థంకాని జనం... ప్రజాస్వామ్యంలో 'మెజారిటీ'జనం... 'వేడి' చల్లారుతోందని పత్రికల్లో ప్రకటన!

కూలీల తెల్లలాల్చీ నాయకుడు పెద్ద మనుష్యుల్తో చర్చలు జరిపేడు. బేరాలు జరిగి, కూలి ధర మరో పది పైసలు పెరిగింది.

'సమ్మె జయప్రదమైంద'న్నాడు నాయకుడు... కూలీల రక్తంతో తడిసినశాంతి కపోతం, ఎంత కడుక్కున్నా వొదలని రక్తపు మరకలమీద తెల్లరంగు వేయించుకోడానికి రాచకవుల్నీ, పత్రికలవాళ్ళనీ ఆశ్రయించింది.

సమ్మె ఆగిపోయింది.

*   *   *

ఆగండి మాష్టారూ, అక్కడితో అయిపోలేదు. జీతాలు పెరగడంతో కథ లెప్పుడూ అయిపోవు. కావాలంటే ప్రభుత్వాన్నడగండి. ఇలా పెరగడానికిగల కారణాలగురించి 'ఎంక్వయిరీ' జరుపుతామనీ, ఇకముందు యిటువంటివి జరక్కుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామనీ ప్రకటించేరు.

కాదంటే కూలీల తెల్లలాల్చీ నాయకుణ్నడగండి. ముందు ముందు జరగబోయే సమ్మెలు తన చెయ్యి జారిపోకుండా వుండాలంటే ఏం చెయ్యాలో పథకాలు వేసుకుంటున్నాడు.

సమ్మె జరగడానికి ముందు తమ బ్రతుకులెలాగుండేవో, తరువాతా అలాగే వున్నాయంటున్న కూలి జనాన్నే అడగండి.

ఈ బరువులిలా పెరుగుతాయేతప్ప తగ్గవు, తగ్గవని తెలిసినవాళ్ళు, ఈ జీవితం విలువ తగ్గుతుందే తప్ప పెరగదు పెరగదని అర్థం చేసుకున్నవాళ్లు...

శాంతి కపోతం మీటిన తుపాకులు మీటిన గుండెలవాళ్లు...

ఈ 'న్యాయం' అన్యాయమనీ, అన్యాయం చేతిలోని తుపాకుల్ని ఎదుర్కొనేందుకు, కొత్త సంగీతం ఆలపిస్తూ కొత్తసమాజం కోసం తుపాకులు పట్టిన వాళ్లు...

వాళ్ళనడగండి.

పిల్లలిద్దర్నీ తీసుకుని అప్పలమ్మ ఊరువిడిచి ఎక్కడికెళిపోయిందో, ఎందుకు వెళిపోయిందో, మళ్ళీ ఊళ్లోకెప్పుడొస్తుందో ,ఏం తీసుకు వస్తుందో...

మూకీ నాటిక :

విప్లవం వర్ధిల్లాలి

నిర్మల్

ఇందులోని పాత్రలు :

భూమిలేని రైతు
పేదరైతు
రైతు కొడుకు
రైతు మహిళ (అవకాశం వుంటే)
నిరుద్యోగి
కార్మికుడు
విప్లవ కార్యకర్త
భూస్వామి
ఇద్దరు గుండాలు
వడ్డీ వ్యాపారి
అతడి గుమస్తా
ఎం. ఎల్. ఎ.
సమితి ప్రెసిడెంటు

మొదటి రంగం

(వెంకన్న రంగంమీదికి ప్రవేశిస్తాడు. ఒక మూలగా కుక్కిమంచం, రెండు కుండలూ వుంటాయి. చేతిలో కర్రను గోడకు ఆనించి దిగాలు పడివుంటాడు)

వెంకన్నా! విచారిస్తున్నావా! కంటతడిపెడుతున్నావా? ఇంటిల్లపాదీ పస్తులతో నకనకలాడుతున్నారని ఎక్కడైనా పనిదొరికితే ఆ కాసిని కూలి డబ్బులతో పసిపిల్లల కన్నా గంజినీళ్ళు కాసి పోయవచ్చనుకున్నావు. కానీ కాలంగాని కాలంలో నీకు పనెక్కడ దొరుకుతుందనుకొన్నావయ్యా. చేద్దామంటే పనిలేదు. ఏడాదిలో ఏ నాలుగైదు నెలలో పని దొరుకుద్ది. పనుల రోజుల్లోనే చాలీచాలని కూలిడబ్బులతో, కలోగంజో కాచుకొని అర్ధాకలితో, కొన ప్రాణంతో జీవచ్ఛవంలా బతుకు వెళ్ళబోస్తున్నావు. పనుల కాలం దాటిపోయిందంటే పస్తులు మామూలే. కాలికి బలపం కట్టుకుతిరిగినా కూలి దొరకదు. ఒకవేళ ఎక్కడైనా దొరికినా రెక్కలు ముక్కలవటమేగాని ఒక్కనాడైనా తృప్తిగా తిని ఎరగని పరిస్థితి.

వెంకన్నా! రెండురోజులనుండీ ఇంటిలో పిడికెడు గింజలు లేవుకదూ! పసిబిడ్డలు ఆకలి బాధకు తట్టుకోలేక గుక్కపట్టి ఏడుస్తుంటే వాళ్ళకు గుక్కెడు గంజిపోయలేక పోయానే అని ఆ కన్నతల్లి పడే కడుపుకోతనుచూసి నువ్వూ కంటతడి పెట్టటంతప్ప ఏం చేయగలుగుతున్నావన్నా. నువ్వేం చేయగలుగుతున్నావు.

తన రెక్కల కష్టంతో సాకి నిన్నింతవాడిని చేసిన నీ తండ్రి మందూ మాకూ లేక చావుబతుకుల్లో వున్ననాడు నువ్వేం చేయగలిగావు. ఎక్కడైనా ఒక్క పాతిక రూపాయలు అప్పుతెచ్చి ఆ ముసలివాడిని ఎలాగన్నా బతికించుకోవాలనుకొన్నావుకదూ! అప్పుకోసమై మీ దొర దగ్గరకు వెళితే ఏమన్నాడు వెంకన్నా? ఏమన్నాడు. ఒక్కసారి గుర్తుకుతెచ్చుకో, 'డబ్బులు కావాలిరా...డబ్బులు అయినా సెంటూ కుంటా లేని నిష్టదరిద్రుడివి నువ్వెలా తీరుస్తావురా అప్పు. వెళ్ళు!' అని కసిరికొట్టాడు. కానీ అభిమానాన్నంతా చంపుకొని కాళ్ళపైన పడ్డావు. 'చావు బతుకుల్లో ఉన్న మా అయ్యను కాపాడండి బాబూ! బతికినంతకాలం మీ బానిసగా చాకిరీచేసి మీ రుణం తీర్చుకొంటాను. నా చర్మాన్ని మీకు చెప్పులుగా కుట్టి యిచ్చుకొంటాను బాబూ' అని మొరపెట్టుకొన్నావు. కానీ ఫలితం ఏమిటి? వెంకన్నా! వాడి పాషాణపుగుండెలు కరగలేదయ్యా, కరగలేదు. కాళ్లీడ్చుకొంటూ కొంపజేరితే అప్పటికే మీ తండ్రి ఈ లోకం విడిచి పోయాడు......

" ఎన్నాళ్ళు బ్రతికిన గానీ
కొన్నాళ్ళు సుఖమేలేదు
ఉన్నన్నాళ్ళు బాధల బ్రతుకు
కన్నీళ్ళే తప్పవు రన్నా "

వెంకన్నా! కుమిలి పోతున్నావా? బ్రతుకంటే భయపడుతున్నావా? వద్దు. బ్రతుకంటే భయపడవద్దు. బ్రతుకును బాగుచేసుకొనేందుకు దారి వెతకాలిగాని భయపడి, నిస్పృహచెంది నుయ్యో, గొయ్యో వెదకటం పిరికివాళ్ళ లక్షణం. చెమటోడ్చి, శ్రమకోర్చి పనిచేస్తున్న నీలాంటి కోట్లాది కష్టజీవుల ఆకలిమంటలకూ, శ్రమంటే ఏమిటో ఎరగని కొద్దిమంది సోమరిపోతుల భోగభాగ్యాలకూ కారణాన్ని వెదుకు. బ్రతుకును బాగుచేసుకొనేందుకు ప్రయత్నించు.

వెంకన్నా! నీచుట్టూ ఒక్కసారి కలియజూడు. వేకువనలేస్తే మళ్ళీ చీకటిపడే వరకూ వంచిన నడుం ఎత్తకుండా ఎద్దులా చాకిరీచేస్తున్నారు మీరు. మీ కండలను కరిగించి, నెత్తురును నీరుగామార్చి బంగారంలాంటి పంటలను పండిస్తున్నారు. కానీ పగలల్లా పనిచేసి కాళ్ళీడ్చుకొంటూ కొంపకుచేరితే పిడికెడు మెతుకులే మీకు కరువౌతున్నాయ్. పిల్లలు తింటే తల్లులు పస్తులుంటున్నారు. అన్నా! దుక్కి దున్నుతున్నది మీరు. విత్తు నాటేది మీరు. నీరుపోసేది పైరు సాకేది మీరు. పంట కోసేది మీరు. అయితే ఆ పంటంతా ఏమౌతోంది? ఒక్కసారి ఆలోచించు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట మీ ఇళ్ళకు చేరుతోందా? లేదు. అది కొద్దిమంది సోమరుల ఇళ్ళకు.

శ్రమంటే ఏమిటో ఎరుగని దొరల ఇళ్ళకు, భూస్వాముల ఇళ్ళకు చేరుతూవుంది. గ్రామాలలో వున్న భూములన్నిటినీ చాపలాచుట్టి చంకన పెట్టుకొన్న భూస్వాములు మట్టిలోపుట్టి, మట్టిపై బతికి, మట్టిలో కలిసిపోయే రైతుకు ఆ మట్టిపై ఎలాంటి హక్కు లేకుండా చేశారు. మిమ్ములను కూలీలుగా, పాలేర్లుగా మార్చివేసి మీ శ్రమ ఫలితాన్ని తిని తెగబలుస్తున్నారీ దొరలు. గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నారు. తమ పెత్తనాన్ని చెలాయించేందుకు వీలుగా మీ నికృష్టబ్రతుకులను కర్మ, ప్రాప్తాలతో సరిపెట్ట జూస్తున్నారు. అదంతా వట్టి దగా, పచ్చిమోసం వెంకన్నా! పచ్చిమోసం.

అన్నా! ఈ భూస్వాముల దోపిడి, దొరల పీడ- ఇవే మీ నికృష్ట జీవితాలకూ, నిత్య దారిద్ర్యానికీ కారణం. ఇవే మీ ఆకలి మంటలకుకారణం. గ్రామాలలో భూస్వాముల పెత్తనాన్ని పాతిపెట్టనిదే రైతుల రాజ్యాన్ని ఏర్పర్చుకొనందే మీ సమస్యలు పరిష్కారం కావు. దొరలపీడ, భూస్వాముల దోపిడి విరగడైననాడే, భూమిపై కష్ట పడే కష్టజీవులకు ఆ భూములు దక్కిననాడే, దున్నేవాడికే భూమి చెందిననాడే మీ బ్రతుకులు బాగుపడతాయి. దేశం బాగుపడుతుంది. అలాగాక ఎన్ని గాలికబుర్లు, వూకదంపుడు ఉపన్యాసాలు చెప్పినా వాటివల్ల మీకు వొరిగేది ఏమీలేదు వెంకన్నా! ఏమీలేదు.

అందుకే వెంకన్నా! నక్జల్‌బరిలో, శ్రీకాకుళంలో తెలంగాణలో నీలాంటి రైతు కూలీలు, బక్క రైతులు తిరగబడ్డారు. తమ దగ్గరున్న కర్ర, కత్తి, పలుగు, పార చేత పట్టారు. గ్రామాలలో ప్రజాకంటకులనూ, వర్గశత్రువులైన దుర్మార్గ భూస్వాములను అంతంచేసి రైతుల రాజ్యాన్ని ఏర్పర్చేందుకు పోరాటం సాగిస్తున్నారు. దోపిడి దొంగల రాజ్యాన్ని కూల్చి, నవలోకాన్ని నిర్మించేందుకు సాయుధ సమరం సాగిస్తూ భారతపీడిత ప్రజల విముక్తికి బ్రతుకుబాటను వేశారు.

వెంకన్నా! ఆ పోరాటంలో నీవు ఒక గెరిల్లాగా, ఆ ప్రజా సాయుధ సమరంలో నీవూ ఒక సైనికునిగా చేరు. అదే పరిష్కార మార్గం. వెళ్ళు. అదే పరిష్కార మార్గం— (వెళ్ళిపోతాడు.)

(తెర పడుతుంది.)

రెండవ రంగం

(ధాన్యం కళ్లం, రైతు కుటుంబం ధాన్యం కళ్లంలో పని చేస్తుంటుంది. నేపథ్యంలో పాట ప్రారంభమౌతుంది.)

ఒలియో ఒలియో
ఒలియో పొలీ
రావేలు గల వాడా
రారా పొలి గాడా

పంటనిచ్చే పంటతల్లీ
కళ్ళనింపే కల్పవల్లీ
గాదెనిండా గలగల లాడిందా
మా పాల వెల్లి–
పాల పొంగుతో ఉరకలు వేసిందా ॥ఒలియో॥

ఆరుగాలం కష్టకాలం
కాలమంతా గడిచిపోగా
మారుపలికే మాదుతల్లీ
ధాన్యలక్ష్మీ ధరణియిచ్చే ॥ఒలియో॥

ఏటికష్టం నేడుతీరె
నోటి కాడికి కూడు దొరికి
మాటి మాటికి వాదులేల
కోటి సంపద కలిగెనేడు ॥ఒలియో॥

రాజనాలూ పండినాయి
భోజనానికి నిండినాయి
కరడుగట్టిన కరువుదేవత
దరికివచ్చిన తరమగలము ॥ఒలియో॥

బలము గలిగినా బసవన్న లుండాయి
బంగారమైనా మాగాణి వుండాది
గలగలా పారేటి గంగమ్మ వుండాది
నిబ్బరించే జబ్బ సత్తువా వుండాది ॥ఒలియో॥

ఆస్తి కన్నను జాస్తి శిస్తులు
మొస్తరుగా మా యింట పస్తులు
కష్టమొకరిదీ ఫలితమొకరిదీ
దోపిడి దొంగలు దోచేస్తారు ॥ఒలియో॥

ఏం రామయ్యా! ఈ దినం ఎంతో ఆనందంగా వున్నావ్! ఓహో ఏడాది పొడుగునా కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిందని సంబర పడుతున్నావు కదూ. అవును ఎండలో, వానలో శ్రమపడి బంగారంవంటి పంటలను పండించావు. నీవూ...నీపిల్లలూ ఏచీకూచింతా లేకుండా కొన్నాళ్ళైనా హాయిగా అనుభవించాలనుకొంటున్నావు కదూ. అవును. ఈ పంటంతా నీ కష్టార్జితం. ఈ పంటంతా నీదే రామయ్యా. నీదే.

హహహ... ఎందుకు రామయ్యా ఆ ఆనందం? ఎందుకా ఉత్సాహం! అప్పుడే మర్చిపోయావా? అదిగో అటుచూడు (భూస్వామి, ఇద్దరు గూండాలు ప్రవేశిస్తారు.)

ఈ చుట్టు పట్ల గ్రామాల్లో నీలాంటి వందలాది పేదరైతుల రక్తాన్నితాగి ఎలా తెగబలుస్తున్నాడోచూడు, ఎవరైనా అతడికి ఎదురుతిరిగితే కిరాయి గూండాలను ఉసిగొలిపి ఎందరినో హత్య చేయించాడు. ఎన్నెన్నో...ఇంకెన్నో పచ్చని కాపురాల్లో చిచ్చుపెట్టాడు, వాడే భూస్వామి, నీవు పగలనకా, రేయనకా కష్టించి పండించిన పంటను కౌలుపేరుతో కాజేయటానికి వచ్చాడు... కాజేయటానికే వచ్చాడు.

(భూస్వామి ఆజ్ఞ ప్రకారం గూండాలు ధాన్యాన్ని మూటలలో ఎత్తుకొని వెళ్ళి పోతుంటారు. భూస్వామిని రైతు బతిమిలాడుతుంటాడు.

హు! ఎందుకు రామయ్యా బ్రతిమిలాడతావ్. నీవెంతగా బ్రతిమాలినా వారికి దయా దాక్షిణ్యాలులేవు. ఈ నరరూప రాక్షసుల రాతిగుండెలు కరుగవు రామయ్యా కరుగవు.

(భూస్వామి, గుండాలు వెళ్ళిపోతారు.)

రామయ్యా! పంట పండిందని ఎంతగానో సంబరపడ్డావ్, కొన్నాళ్ళైనా కడుపు నిండా తిండి దొరుకుతుందని ఎంతగానో ఆనందపడ్డావ్, కానీ జరిగిందేమిటి! ఈ మిగిలిన కొస్త ధాన్యంతో సంవత్సర కాలం ఎలా బ్రతుకటమా అని యోచిస్తున్నావా? అప్పుడే ఏమైంది ఇటుచూడు. ఆ వస్తున్నదెవరో చూడు.

(బొజ్జ నవరించుకొంటూ, వెకిలినవ్వుతో పెద్దిశెట్టి, అతడిగుమస్తా ప్రవేశిస్తారు)

అతడే పెద్దిశెట్టి. కొద్దిపాటి మొత్తాలు అప్పుగా యిచ్చి వడ్డీలకు వడ్డీలు, చక్రవడ్డీలు కట్టి, అమాయక పేద ప్రజల ఆస్తులన్నీ కొల్లగొట్టి తన బొజ్జను ఏ విధంగా పెంచాడో చూడు. అతడు దొంగ వ్యాపారంలో అందెవేసిన చెయ్యి. దళారీ వ్యాపారంలో పేరు మోసిన దిట్ట,

నాలుగు సం॥ క్రితం నీ పెద్ద కూతురు పెళ్ళికోసమని తెచ్చిన అప్పు రెండు వందల రూ॥లు ఆ బాకీ క్రింద ప్రతిఏడూ, నీవు ధాన్యాన్ని కొలుస్తూనే వున్నావ్. అయినా తప్పుడు లెక్కలురాసి, చక్రి వడ్డీలుకట్టి ఈ రోజుకీ 600 రూ॥ల అప్పు చూపెడుతూనేవున్నాడు. ఇప్పుడు ఆ డబ్బుకోసమే వచ్చాడు. పంట కొలుచుకు పోయేందుకే వచ్చాడు రామయ్యా, వచ్చాడు.

(పెద్దిశెట్టి, గుమస్తా ధాన్యం బలబంతంగా ఎత్తుకొని వెళ్ళి పోతారు.)

రామయ్యా! చివరకు నీకు మిగిలిందేమీలేదు కదూ. అవును. ఎంతగా కష్టపడి పండించినా నీలాంటి పేదరైతులను ఈ పంది కొక్కులు బ్రతకనివ్వవు. కౌలు

నాగులపేర్లతో, అప్పులూ, వడ్డీల పేర్లతో నీ యావదాస్తినీ దోచారీ దుర్మార్గులు. నీ రక్తమాంసాలను తిని నిన్ను ఎముకల గూడులా మార్చివేశారు.

అవును రామయ్యా! ఈ వ్యవస్థే దోపిడీ వ్యవస్థ. అనునిత్యం వందలాది రైతులనూ, నిరుద్యోగులనూ, కార్మిక ప్రజలనూ ఆకలి చావులకు గురిచేస్తూ తన పొట్టన పెట్టు కొంటున్న హంతక వ్యవస్థ. రాబందుల్లా ప్రజలను పీక్కుతింటున్న భూస్వాములదీ, పెట్టుబడిదార్లదీ వ్యవస్థ. ఈదుర్మార్గమైన దోపిడీ వ్యవస్థను కూల్చందే ఈ హంతక వ్యవస్థను సమాధి చేయనిదే నీకు విముక్తి లేదు. అందుకే సాగుతోంది సాయుధ పోరాటం. దేశంలో అనేక గ్రామాలలో రైతాంగ గెరిల్లాలు రైతాంగ యుద్ధాన్ని సాగిస్తున్నారు. అందులో నీవూ ఒక ప్రజా సైనికునిగా దుముకు. విప్లవ యోధునిగా ఉరుకు. అదే నీవిముక్తికి మార్గం. అదే పరిష్కార మార్గం వెళ్లు. వెళ్ళు.

మూడవ రంగం

(చేతిలో సర్టిఫికెట్లతో నిరుద్యోగి ప్రవేశిస్తాడు. నేపథ్యంలో)

"మదిలోని ఆశలన్నీ
పదిలంగ దాచకోయి
పదిలమౌ ఆశల కోసం
ఎదిరించి తీరాలోయీ"

నిరుద్యోగి......నిరుద్యోగీ!... ఎక్కడికి నీ ప్రయాణం! ఎందాక నీ నడక! ఆ... ఏమిటా చిరిగిన గుడ్డలూ. ఆ మాసిన గడ్డం. ఆ చింపిరితల? వెర్రివానిలా ఎక్కడికి నీ ప్రయాణం? మిత్రమా... చేతిలో ఫైళ్ళేమిటి? ఓహో! ఉద్యోగం కోసమా? బి. ఎ. పాసయ్యావుకదూ. ఆ కాగితాలు పట్టుకొని ఉద్యోగంకోసమై కాళ్ళ రిగేటట్లు తిరుగుతున్నావా? పంచాయితీ బోర్డు మొదలుకొని జిల్లా పరిషత్ ఆఫీసు వరకూ, ఎన్నిచోట్ల తిరిగినా ఈ 'పవిత్ర' భారత దేశంలో ఉద్యోగం దొరకలేదా? అదిగో వస్తున్నదెవరోచూడు. అతడే మీ ఎం. ఎల్. ఎ. ఇదిగో ఇటుచూడు. అతడు మీ సమితి ప్రెసిడెంటు. (వారికి తన సర్టిఫికెట్లు చూపిస్తాడు. వారు నిర్లక్ష్యంగా వెళ్ళిపోతారు)

వీరిద్దరి గెలుపుకోసమూ అహోరాత్రిలూ కష్టపడ్డావుకదూ? ఉద్యోగం ఇప్పిం చండని బ్రతిమాలితే తెలియదు పొమ్మన్నారా? అవును. వీరికి నీలాంటి అభాగ్యులు జ్ఞాపకముంటారా? ఎలక్షన్లలో తమ గెలుపుకోసం నీలాంటివారిని ఎందరినో ఉపయో గించు కొంటారు, అధికారం వచ్చాక వారి మిత్రులైన భూస్వాములకూ, ధనవంతు

లకూ వినియోగ పడతారే తప్ప నీలాంటి నిరుద్యోగులు వారికి కనిపిస్తారా? కనిపించరు మిత్రమా కనిపించరు.

మిత్రమా...!... ఉద్యోగం కావాలా? బి. ఎ. పాసయ్యానన్నావుకదూ? ఎక్కడున్నాయయ్యా ఈ దోపిడి పాలనలో ఉద్యోగాలు. దేశంలో విద్యావంతులైన లక్షలాది మంది యువకులు నిరుద్యోగ రక్కసి వాతబడ్డారు. కలకత్తా, బొంబాయిలాంటి పెద్దపెద్ద నగరాల్లో వేలాదిమంది పట్టభద్రులు ఉద్యోగాలు లేక రిక్షాలు లాగుతూ, రోడ్డు ప్రక్కనున్న పేవ్‌మెంట్లపైన బూట్‌పాలిష్ చేసుకొంటూ తమ బ్రతుకులు వెళ్ళబోస్తున్నారు. మరికొందరు హోటళ్ళలో వేటర్లుగా బ్రతుకుతున్నారు. వారందరికీ జీవనోపాధిని చూపలేని ప్రభుత్వం ప్రతిఏడూ విద్యాలయాలనుండి వేలాదిమంది యువకులను నిరుద్యోగులుగా తర్ఫీదునిచ్చి బయటకునెడుతూవుంది. నిరుద్యోగ సైన్యాన్ని రోజురోజుకూ పెంచుతూనేవుంది.

ఆ! ఎందుకా విచారం! ఏమిటా కన్నీరు? అవును. నీపై ఎన్నో ఆశలు పెట్టుకొని, తన రెక్కలు ముక్కలు చేసుకొని నిన్ను బి.ఎ. వరకూ చదివించి, నీవు ఉద్యోగంచేస్తే ఏ చీకూ చింతా లేకుండా హాయిగా బ్రతకవచ్చుననుకున్న మీ తండ్రి ఆశలు అడియాసలైనాయని బాధపడుతున్నావా? ఇంట్లో పెండ్లీడుకొచ్చిన చెల్లెలుకు కట్నం ఇవ్వలేక ఒక యింటిదాన్ని చేయలేక పోతున్నానే అని విచారిస్తున్నావా?

మిత్రమా... ఎన్నాళ్ళని కంటతడిపెడతావ్. ఎందాకని విచారిస్తావ్. నీ భవిష్యత్తుని నీ చేతిలోకి తీసుకో. బాధల బ్రతుకును బాగుచేసేందుకు బాటను వెదుకు. అందుకు పరిష్కారమార్గం ఏమిటో ఆలోచించు. ఏమిటా పరిష్కారమార్గం?

(నేపథ్యంలో)

నిదురించ కోయీ
ఓ విగత జీవి
ఎదిరించి జీవనజ్యోతి
వెలిగించ వోయి ॥ని॥

నిత్యం నీ దరిద్ర బ్రతుకూ
సత్యం అది పోనేపోదు
సత్యంలో త్యాగం కలిపీ
పోరాటం సాగించాలోయ్ ॥ని॥

ఈ వ్యవస్థ మారినగాని
నీ కష్టం పోనేపోదు

అస్త వ్యస్తమైన బ్రతుకులు
సుస్థిరమై పోనే పోవూ ॥ని॥

అదిగదిగో ఎర్రని కాంతి
నీ మదిలో నింపే క్రాంతి
వదలవోయి ఇంకను భ్రాంతి
చేకూరును సుస్థిర శాంతి ॥ని॥

అరుణ పతాకం అదిగో
శ్రమజీవుల కేతనం
అణగారిన జనానికి
అభయమిచ్చు నికేతనం
అంతా ఒకటై నిలచి
గొంతెత్తి గర్జించి
సర్వం త్యాగం చేస్తూ
ముమ్ముందుకు సాగిపొండి.

(తెర పడుతుంది)

నాలుగవ రంగం.

కార్మికుడా... కామ్రేడ్... ఏ ఫ్యాక్టరీలో నువ్ పనిచేస్తున్నావ్. నీవు చెప్ప నక్కర లేకుండానే అర్థమౌతుంది. నీ బట్టలూ, ఆ చింపిరితలా, వొంటినిండా కమ్మి కున్న ధూళి, అస్థిపంజరంగావున్న ఆ శరీరం చూస్తేనే అర్థమౌతుంది నీ వొక జూట్ మిల్లు కార్మికుడివని.

కామ్రేడ్... ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఓహో! నీవు పది సం॥లుగా ఈ ఫ్యాక్ట రీలో పనిచేస్తున్నావ్. ఆ యంత్రాలలో నీవూ ఒక యంత్రంగా పనిచేసి సంపదలను సృష్టిస్తున్నావ్. కానీ నీ శ్రమకుతగిన ఫలితం దొరకదు. పైగా కుటుంబం అర్ధాకలితో మలమలా మాడుతూవుంది. తింటానికా తిండిలేదు. వుంటానికా ఇల్లులేదు. కట్టటా నికా బట్టలేదు. చివరకు నీ భార్య జబ్బుతో బాధపడుతూ చావు బతుకుల్లో మంచాన పడి వుంది. మందుకోసం మొన్ననే కాబూలీవాలా దగ్గర పది రూ॥లు అప్పుతెస్తే ఆ అప్పుకు వడ్డీగా నీ బట్వాడాలో సగభాగం ఇప్పుడే కాబూలీవాలా కొట్టుకుపోయాడు. ఆ మిగిలిన కాస్త డబ్బుతో వారమంత కుటుంబాన్ని ఎలా పోషించాలా అని కుమిలి పోతున్నావా?

'నరాల బిగువూ
కరాల సత్తువ
వరాల వర్షం కురిపించాలని
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని–
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిశ్రమిస్తూ,
పరిప్లవిస్తూ,
ధనిక స్వామికి దాస్యంచేసే
యంత్ర భూతముల కోరలుతోమే
కార్మిక ధీరుల కన్నులనిండా
కణకణ మండే,
గల గల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్!'

కామ్రేడ్! పొద్దు పొడిచి పొద్దు గడిచేదాకా యంత్రంగా పనిచేసి మీరు సృష్టించిన సంపద ఏమౌతోంది? ఒక్కసారి ఆలోచించు. అదిగో! నీలాంటి లక్షలాది కార్మికుల శ్రమశక్తిని దోచుకొని, మీరక్తాన్నితాగి మిమ్మల్ని అస్థిపంజరాల్లా తయారుచేసిన ఫ్యాక్టరీ యజమానులు మేడలమీద మేడలుకట్టి ఎలా కులుకుతున్నారో చూడు. ఫ్యాక్టరీలనూ మిల్లులనూ, యంత్రాలనూ పరికరాలనూ తమ గుప్పెట్లో పెట్టుకున్న కొద్దిమంది ధనికులు మీ శ్రమను దోచుకు తింటూ మిమ్మలను ముద్దకికూడా దూరం చేశారు. కాని ఈ ఫ్యాక్టరీలు మీవి. వాటిని నిర్మించింది మీరు. మీరు సృష్టిస్తున్న సమస్త సంపదలకూ అధినాధులు మీరే కామ్రేడ్స్ మీరే.

కామ్రేడ్. గ్రామసీమల వైపుచూడు. అడుగో రైతు. తన భవిష్యత్తును తన చేతిలోకి తీసుకొని దోపిడీరాజ్యాన్ని నిర్మూలించేందుకై సాయుధ పోరాటం సాగిస్తున్నాడు. సమిష్టిద్వారా సృష్టించబడిన సంపద కొద్ది మంది ధనికులకుగాక శ్రమించే వారందరికి ఉపయోగపడే నూతన వ్యవస్థకోసం పోరాడుతున్నాడు. ఆకలీ కన్నీరూ లేని, దోపిడీ పీడనాలేని నవ సమాజ స్థాపనకు నడుంకట్టి నిలిచాడు. అతడితో చేతులు కలుపు. తెగించి ముందుకు దూకు. రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించు. అదే కార్మికవర్గం నిర్వహించాల్సిన చారిత్రిక కర్తవ్యం.

అదిగో తూరుపు కనుమలు మండుతున్నాయ్. ప్రపంచ పీడిత ప్రజల మహా నాయకుడు చైర్మన్ మావో ప్రజాయుద్ధ సిద్ధాంత వెలుగు తూర్పు దిక్కును అరు

కారుణం చేసింది. పీడిత మానవాళికి వెలుగు బాటను చూపింది. ప్రజాయుద్ధ మార్గంలో ప్రయాణం చేస్తున్న ప్రజలు అజేయులు. కామ్రేడ్... ఇది విప్లవాల యుగం. ప్రపంచంలోని దోపిడీ గాళ్ళంతా సర్వనాశనమై పోతున్నయుగం. ప్రపంచమంతటా విప్లవాగ్ని జ్వాలలు మండుతున్నాయి. సామ్రాజ్యవాదులూ, వారి తాబేదారులూ, ఆ విప్లవాగ్ని జ్వాలల్లోపడి మసిమసిగా మాడి చస్తారు. దోపిడీ సమాజ శిథిలాలపై నుండి వేలాది అమరులు కలలుగన్న నూతన సమాజం ఆవిర్భవిస్తుంది. ఆ సుదీర్ఘ పోరాటంలో నీ చారిత్రిక కర్తవ్యాన్ని నిర్వహించేందుకై కదులు. ముందుకు— మున్ముందుకు సాగిపో. 'విప్లవం వర్ధిల్లాలి' అని చైతన్య శంఖం పూరిస్తూ కదిలిపో. కదిలిన నీ కాళ్ళకు తోడుగా కోట్లాదికాళ్ళు కదిలివస్తాయి. పిలిచిన నీ పిలుపుకు కోట్ల కంఠాలు బదులు పలుకుతాయ్. కదులు, వెళ్ళు.

(కార్మికుడు నిష్క్రమిస్తూవుండగానే, తెరవెనుక "రండోయ్ - రండోయ్" పాట వినిపిస్తుంది. విప్లవ కార్యకర్త ఎర్రజెండాతో, రైతులు గొడ్డలి, పలుగు, కర్ర చేతపట్టి రంగంమీదికి వస్తారు. తర్వాత కార్మికుడు, నిరుద్యోగి వారితో కలుస్తారు. పాటకు అనుగుణంగా అడుగులువేస్తూ నృత్యం చేస్తారు.)

రండోయ్ ! రండోయ్ !
ప్రజా విముక్తి సైన్యంలో
చేరగ వేగమె రండి !
దోరండోయ్ ! రండోయ్ !

ఈ భూములు, ఈ గనులు
ఫ్యాక్టరీలు, ఈ బ్యాంకులు
ఈ సంపద మనదేనోయ్
మనరక్తం తాగి తాగి
మన ప్రాణం పీల్చి పీల్చి
శ్రమ శక్తిని దోచి దోచి
బలుపెక్కిన బలుపెక్కిన
భూస్వాముల, జమీందార్ల
దోపిడి రక్కసి మూకల
హతమార్చగ ప్రతినబూని ॥రండోయ్॥

నీ పలుగూ, నీ పారా
నీ కత్తి, నీ సుత్తి
నీ గొడ్డలి, నీ బరిసె
నీ కర్రి, నీ కర్రి
నీ విల్లూ, నీ సిల్లా
కాడిమేడి చేతబట్టి
ఎదుర్కొనగ తరలిరండి ॥రండోయ్॥

గ్రామాల విముక్తి చేసి
పట్టణాల చుట్టుముట్టి
కార్మిక కర్షక రాజ్యం
స్థాపించుట నిజమేనోయ్
కణం కణం రగిలి రగిలి
దళం దళం కదిలి కదిలి
క్షణం క్షణం పగిలి పగిలి
పెనుమంటలు పెనుతుఫాన్

భూకంపం పుట్టించగ
ప్రజాసేన నిర్మించగ
పిడికిలెత్తి బాసచేసి
కార్మికులు, కర్షకులు
నేతగాడు, జీతగాడు
హమాలీలు, కళాసీలు
కమ్మరులు, కుమ్మరులు
వడ్రంగులు, జాలరులు
పీడిత తాడితులంతా
కదంత్రొక్కి కదలిరండి ॥రండోయ్॥

తుది సమరం జరుగుతోంది
జగమంతా కదులుతోంది
సోవియట్ - అమెరికాల
యుద్ధోన్మాదుల కూటమి
బుగ్గి అగుట నిజమేనోయ్ ॥రండోయ్॥

ఒంటరిగా లేం మనం
కోటికోట్ల సేన మనం
చైనాలో ఎర్రసేన
వియత్నాం గెరిల్లాలు
పాలస్తీన కమాండోలు
అమెరికాలో నల్లపులులు
క్యాంపస్‌లో విద్యార్థులు
మలయాలో, బర్మాలో
కాంబోడియ, లావోస్‌లో
నక్సల్‌బరి, శ్రీకాకుళం
ఫిలిప్పైన్స్, జావాలో
ఉరుగ్వేలో, పెరుగ్వేలో
ఆసియా, ఆఫ్రికాలో
దక్షిణాది అమెరికాలో
కదంతొక్కు ప్రజాసేన
మోహరించిన మనసేన
అందరిదీ ఒకే మాట
అందరిదీ ఒకే బాట ॥వందేమ్॥

మావోసియాంగ్ కేంద్రంగా
జనయుద్ధం వ్యూహంగా
కెరటాలుగ పొంగి పొంగి
అగ్నిశిఖగ మండి మండి
చీకట్లను కాల్చి కూల్చి
స్వాతంత్ర్యం, సమధర్మం
సౌభ్రాతృం, సమధర్మం
ప్రాణంగా, ప్రణవంగా
నవజగతిని నిర్మించగ
రణశంఖం పూరించగ
అగ్నివీణ సారించగ
జయభేరి మ్రోగించగ

గణ గణ గణ
గణ గణ గణ
గణ గణ గణ
జేగంటలు మ్రోగింపగ
కదంతొక్కి కదలిరండి ॥రండోయ్॥

[ఈ రూపకంలోని గేయాలూ, పాటలూ అమరుడూ, ప్రజాకవీ కామ్రేడ్ సుబ్బారావ్ పాణిగ్రాహి, మహాకవి శ్రీశ్రీ, గెరిల్లా కవి నటరాజమూర్తిగార్లవి. వారికి నా కృతజ్ఞతలు– నిర్మల్]

అంతర్జాతీయతా చైతన్యం – నార్మన్ బెథూన్

కామ్రేడ్ నార్మన్ బెథూన్ కెనడా కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు. కెనడా, అమెరికా కమ్యూనిస్టు పార్టీల తరుపునఆయన చైనా వచ్చినప్పుడు ఆయన వయస్సు రమారమి యాభై సంవత్సరాలు. జపాన్ వ్యతిరేక ప్రతిఘటనా పోరాటంలో మన (చైనా)కు అండగా వేలకొలది మైళ్ళు సునాయాసంగా దాటి వచ్చాడు. గడచిన సంవత్సరం వసంతకాలం (1938 మార్చి) లో ఆయన యానాన్ వచ్చాడు. అక్కడ నుండి వుతాయ్ పర్వతాలలో పని చేయడానికి వెళ్ళాడు. అక్కడే వీర మరణం పొంది మనల్ని శోకసంతప్తుల్ని చేశాడు. చైనా ప్రజల విమోచన లక్ష్యాన్ని నిస్వార్థంగా తనదిగా భావింప జేసిన ఆ చైతన్యం ఎటువంటిది? అది అంతర్జాతీయతా చైతన్యం. అది కమ్యూనిజం అనే చైతన్యం. దాన్నుంచీ ప్రతి చైనా కమ్యూనిస్టు నేర్చుకోవాలి. పెట్టుబడిదారీ దేశాల శ్రమజీవులు వలస, అర్ధ వలస దేశాల ప్రజల విముక్తి పోరాటాన్ని– వలస, అర్ధ వలస దేశాల శ్రమజీవులు పెట్టుబడిదారీ దేశాలలోని శ్రమజీవుల పోరాటాన్నీ పరస్పరం బలపరచినపుడే ప్రపంచ విప్లవం జయప్రదం కాగలదని లెనినిజం బోధిస్తుంది.

—మావో

అక్టోబర్ 4, 5, 6, 7 విరసం సాహిత్య పాఠశాల సందర్భంగా వెలువడిన కొత్త పుస్తకాలు.

1. జనచైనా కమ్యూనిస్టు పార్టీ నియమావళి
   శ్రామికవర్గ ప్రచురణలు, వరంగల్. — 25 పైసలు
2. మేధావి అంటే ఎవరు? మావో-సే-టుంగ్ — 10 పైసలు
3. సరియైన భావాలు ఎక్కడినుండి వస్తాయి
   — మావో-సే టుంగ్ — 5 పైసలు
4. మన అధ్యయన విధానం ఎలా వుండాలి
   — మావో-సే-టుంగ్ — 10 పైసలు
5. ఉదార వాదాన్ని ప్రతిఘటించండి మావో-సే టుంగ్ — 5 పైసలు
6. గెరిల్లా యుద్ధతంత్రం వి. ఐ. లెనిన్ — 20 పైసలు
7. ప్యారిస్ కమ్యూన్-చారిత్రిక పాఠాలు
   — కె. ప్రభాకరరెడ్డి — 20 పైసలు

SRJANA Telugu Monthly Oct. '73 H-1088
Regd. No. with Registrar of News Papers 10953/67

SRJANA
HANAMKONDA
Warangal 506001

I Re.